www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కలెక్టర్ సార్‌కే సమస్యలు చెబుదాం!


కలెక్టరేట్‌కు పాదయాత్రగా బయలుదేరిన గురుకుల విద్యార్థులు

- జోగులాంబ గద్వాల జిల్లాలో అలంపూర్ గురుకుల పాఠశాల విద్యార్థుల పాదయాత్ర
- తాగేందుకు బోరు నీళ్లు.. అన్నంలో పురుగులు
- 50 రోజులుగా ఆందోళన చేస్తున్నా స్పందన లేకపోవడంతో రోడ్డెక్కిన విద్యార్థులు
- విషయం తెలిసి హాస్టల్‌కు అదనపు కలెక్టర్
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ

3

గురువారం | 31-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 123 | వరంగల్
శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి తె.4.59 తదుపరి అష్టమి; నక్షత్రం: చిత్ర రా.12.42 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ.6.49-8.36; దుర్ముహూర్తం: ఉ.10.13-11.04, మ.3.20-4.11; అమృతఘడియలు: సా.5.32-7.20; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.45
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారత్‌పై 25% సుంకం

- రష్యా నుంచి ఆయుధాలు, చమురు కొంటున్నందుకు జరిమానా కూడా!
- సుంకాల అమలు రేపటి నుంచే.. గడువు పొడిగించే ప్రసక్తే లేదు
- బ్రిక్స్‌లో భారత్ భాగం కావడమూ ఈ సుంకానికి ఒక కారణం: ట్రంప్
- చర్చల తీరుపై ట్రంప్ అసహనం.. అందుకే ఈ నిర్ణయం: వైట్‌హౌస్
- తాజా సుంకాల ప్రభావాన్ని పరిశీలిస్తున్నాం: కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి
- మోదీ, ట్రంప్ మధ్య స్నేహంతో ప్రయోజనం లేదని తేలింది: విపక్షాలు

వాషింగ్టన్, జూలై 30: రెండోసారి అధికారం చేపట్టినప్పటి నుంచి సుంకాల రంకెలేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత ఉత్పత్తులపై 25% సుంకం విధిస్తున్నట్టు తాజాగా ప్రకటించారు. శుక్రవారం (ఆగస్టు 1) నుంచి ఈ సుంకం అమల్లోకి వస్తుందని ప్రకటించారు. సుంకంతోనే సరిపెట్టలేదాయన.. రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేస్తున్నందుకుగాను భారత్‌పై జరిమానా కూడా విధిస్తామని హెచ్చరించారు. అమెరికా విమోచన దినం పేరుతో ఈ ఏడాది ఏప్రిల్ 2న ఆయన భారత్‌పై 26% సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. అయితే.. భారత్ సహా పలు దేశాలపై సుంకాల అమలును 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు ఆయనే ఏప్రిల్ 9వ తేదీన

మిగతా 2వ పేజీలో...



ఇరుదేశాలకూ నష్టమే!

2

- అమెరికాలో వినియోగదారులపై అధిక ధరల భారం
- ఆ దేశంలో పెరగనున్న స్మార్ట్‌ఫోన్లు, ఆభరణాలు, రెడీమేడ్ దుస్తులు, ఆటో విడిభాగాలు, ఔషధాల ధరలు
- మన ఆర్థిక వ్యవస్థపై రూ. 2.5 లక్షల కోట్ల మేర ప్రభావం

ఇంధన శాఖపై అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



రాష్ట్రంలో మరో డిస్కం

ఉచిత పథకాలన్నీ దాని పరిధిలోకే..

- ఉత్తర, దక్షిణ డిస్కంలు వాణిజ్య కార్యకలాపాలకే.
- ఆర్థిక సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయండి
- విద్యుత్తు వ్యవస్థ ప్రక్షాళనకు సంస్కరణల అమలు
- అధిక వడ్డీల రుణాలతో డిస్కమ్‌లు డీలా పడ్డాయ్
- 6 శాతం వడ్డీ ఉండేలా వాటిని రీస్ట్రక్చర్ చేయండి
- ప్రభుత్వ విద్యాసంస్థల్లో, ఆఫీసుల్లో సౌర విద్యుత్తు
- సచివాలయంలోనూ సోలార్ రూఫ్‌టాప్, ఫెన్సింగ్
- ఇంధన శాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా మరో విద్యుత్తు పంపిణీ సంస్థ (డిస్కమ్) ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొత్త డిస్కమ్ ఏర్పాటుకు గల ఆర్థిక సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలన్నారు. విద్యుత్తు వ్యవస్థ ప్రక్షాళనకు అవసరమైన సంస్కరణలు అమలు చేయాలని చెప్పారు. విద్యుత్తు పంపిణీ సంస్థలన్నీ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే సంస్థ వల్ల డిస్కమ్‌లకు ఆర్థిక లబ్ధి చేకూరే అవకాశాలు ఉంటాయా? అనే అంశాలపై చర్చించాలని సూచించారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ)తో సంప్రదింపులు జరపాలన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇంధన శాఖపై ఉప ముఖ్యమంత్రి భట్టి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్, దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ, ఉత్తర డిస్కమ్

మిగతా 13వ పేజీలో...

6నే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా.. బీసీ రిజర్వేషన్లపై జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన ధర్నా యథాతథం

జీఎస్టీలో ఇదో నయా మోసం

- 33.20 కోట్ల ఐటీసీని కొల్లగొట్టిన 'కేషాన్ ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పీ'
- మహారాష్ట్రకు ఖాళీ వాహనాలు.. సరుకు రవాణా జరిగినట్లు బురిడీ
- సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన వాణిజ్య పన్నుల శాఖ

13

ఏడుగురు అధికారుల వల్లే ఉద్యోగులు-సర్కారు మధ్య దూరం

- పరిష్కరించకుంటే ఆందోళనే
- సీఎస్‌కు ఉద్యోగ ఐకాస నోటీసు

నింగిలోకి నిసార్

జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం విజయవంతం

- అంతరిక్షంలోకి దూసుకెళ్లిన భూపరిశీలన ఉపగ్రహం
- ఇస్రో-నాసా ఉమ్మడి ప్రయోగం గ్రాండ్ సక్సెస్
- 19 నిమిషాల్లోనే నిర్దేశిత కక్ష్యలోకి నిసార్ ఉపగ్రహం
- జీఎస్ఎల్వీ ప్రయోగాల్లో మరోసారి ఇస్రో సత్తా
- సంస్థ చరిత్రలో ఇదొక మైలురాయి: నారాయణన్

సూళ్లూరుపేట, తడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అంతరిక్ష రంగంలో ఇస్రో మరో అద్భుత విజయాన్ని అందుకుంది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసాతో కలిసి చేపట్టిన భూపరిశీలన ఉపగ్రహం నిసార్ (నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్) ప్రయోగం విజయవంతమైంది. యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూసిన నాసా-ఇస్రో మిషన్ సక్సెస్ కావడంతో ఇస్రో ఉత్సాహం రెట్టింపైంది. ఇస్రో చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా నిలిచింది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం-షార్ నుంచి బుధవారం సాయంత్రం 5:40 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లిన జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్.. 18.59 నిమిషాల్లోనే ఉపగ్రహాన్ని నిర్దేశిత సూర్య సమకాలిక కక్ష్యలోకి చేర్చింది. మంగళవారం మధ్యాహ్నం 2:10 గంటలకు ప్రారంభమైన 27:30 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే రివ్వున ఎగిరిన రాకెట్.. తొలి మూడు దశలనూ సునాయాసంగా పూర్తిచేసుకుంది. ఈ క్రమంలో 747 కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత 2,392 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని కక్ష్యలో విడిచిపెట్టింది. ఈ వెంటనే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో

మిగతా 14వ పేజీలో...


నిప్పులు చిమ్ముతూ నింగిలోకి దూసుకెళ్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్

రష్యాలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం

- ఊగిపోయిన కమ్చాట్కా ద్వీపకల్పం.. పసిఫిక్ తీర ప్రాంత దేశాలకు సునామీ హెచ్చరిక
- రష్యా, జపాన్, అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో చిన్నపాటి సునామీలు
- ముందు జాగ్రత్తలతో తప్పిన ప్రాణ నష్టం.. తీర ప్రాంతాల నుంచి వేలాది మంది తరలింపు

14


ఫాంహౌస్‌లో పట్టుబడ్డ నగదుతో సిట్ అధికారులు

లిక్కర్ స్కామ్.. 11 కోట్ల డంప్

- ఇంత భారీ నగదు పట్టుబడటం దేశ చరిత్రలోనే తొలిసారి
- హైదరాబాద్ సమీపంలోని ఫాంహౌస్‌లో సిట్ స్వాధీనం
- దుబాయ్ నుంచి వస్తుండగా శంషాబాద్‌లో వరుణ్ అరెస్ట్
- అతడిచ్చిన సమాచారంతో సోదాలు.. ఫాంహౌస్ యజమాని లిక్కర్ కేసు నిందితుడు రాజ్ కసిరెడ్డి మిత్రుడే
- బెజవాడకు నగదు, వరుణ్ తరలింపు

14

ఎమ్మెల్యేల అనర్హత అంశంపై
నేడు సుప్రీం తుది తీర్పు

స్పీకర్ కాలయాపనపై గతంలో ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

అసెంబ్లీలో సీఎం చేసిన వ్యాఖ్యలపైనా తీవ్ర అభ్యంతరం.. తీర్పు ఇవ్వనున్న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం



న్యూఢిల్లీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత అంశంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం తుది తీర్పు వెలువరించనుంది. బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు పది మంది పార్టీ ఫిరాయించారంటూ దాఖలైన పిటిషన్లపై సుదీర్ఘ వాదనలు జరిగిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్, కడియం శ్రీహరి పార్టీ ఫిరాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద సుప్రీంకోర్టులో జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. అదే రోజు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టీ ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, సంజయ్ కుమార్ పార్టీ ఫిరాయించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కౌశిక్ రెడ్డి, వివేకానంద, జీ జగదీశ్ రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ఆ తర్వాత వాదనలు జరుగుతుండగానే మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్‌ను ప్రతివాదిగా చేర్చారు. ఆ పిటిషన్లు అన్నింటినీ కలిపి విచారించిన జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఏప్రిల్ 3న తీర్పును రిజర్వ్ చేసింది. జస్టిస్ గవాయ్ ప్రస్తుతం సీజేఐగా ఉన్నారు. గురువారం ఆయనతో పాటు జస్టిస్ వినోద్ చంద్రన్ తుది తీర్పును వెలువరించనున్నారు. గతంలో ఈ కేసు విచారణ సందర్భంగా జస్టిస్ గవాయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టులో విచారణలో ఉన్న ఎమ్మెల్యేల అనర్హత అంశాన్ని సీఎం రేవంత్ అసెంబ్లీలో ప్రస్తావించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తెలంగాణ ముఖ్యమంత్రి సంయమనం పాటించలేరా? ఉప ఎన్నికలు రావని అసెంబ్లీ వేదికగా సీఎం ఎలా చెబుతారు?' అని ప్రశ్నించారు. అలాగే, అసెంబ్లీ స్పీకర్ కాలయాపనపైనా అసహనం వ్యక్తం చేశారు. 'నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా చూస్తూ ఊరుకోవాలా?' అని ప్రశ్నించారు. దీంతో తీర్పు ఎలా రాబోతోందనే ఉత్కంఠ నెలకొంది.



మోదీకి ధైర్యం లేదు

- ట్రంప్ అబద్ధాలాడుతున్నారని చెప్పలేకపోతున్నారు
- అలా చేస్తే ఆయన నిజం బయటపెడ్తారు: రాహుల్
- 2 గంటల ప్రసంగంలో ఒక్కసారీ ట్రంప్ పేరెత్తలేదు
- భారత్-పాక్ ఘర్షణలో మూడోపక్షం జోక్యాన్ని ఎందుకు అంగీకరించారు?: మల్లికార్జున ఖర్గే

2

పీవోకేను ఇచ్చింది మీరే

- దానిని బీజేపీ ప్రభుత్వమే తిరిగి తీసుకొస్తుంది
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

రాహుల్.. చైనా గురువు!

- విదేశాంగ మంత్రి జైశంకర్ ఎద్దేవా
- రాజ్యసభ చర్చలో నెహ్రూ, కాంగ్రెస్‌పై ధ్వజం

ఎకరం 65.34 కోట్లు

- కేపీహెచ్‌బీలో వేలం పాటలో పలికిన ధర
- రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల ద్వారా రూ.26 కోట్లు
- హౌసింగ్ బోర్డుకు భారీ ఆదాయం

14

రాహుకాలానికి ముందే 'కాళేశ్వరం'పై నివేదిక!

- నేడు ఉదయం 9:57 గంటల్లోపు సర్కారుకు కమిషన్ అందజేత
- ఆలోపు రావాలని నీటిపారుదల అధికారులకు సమాచారం

13

378 కోట్ల సైబర్ దోపిడీ!

- దేశంలోనే అతిపెద్ద 'క్రిప్టో' సంస్థ నెబ్లియో టెక్నాలజీస్ సర్వర్ హ్యాక్
- సంస్థ ఉద్యోగి ల్యాప్‌టాప్ నుంచే 44 మిలియన్ డాలర్ల బదిలీ
- సంస్థ అంతర్గత భద్రతను లక్ష్యంగా చేసుకుని పేట్రేగిన సైబర్ ముఠా
- కస్టమర్ల సొమ్ము భద్రమేనని నెబ్లియో వెల్లడి.. కేసు నమోదు
- ఉద్యోగి అరెస్టు.. దేశంలోనే అతిపెద్ద సైబర్ దోపిడీ: పోలీసులు

14



ఆయుధాలు అప్పగించి వైదొలగండి

2

- గాజా పాలన పాలస్తీనా అథారిటీకి..
- హమాస్‌కు తేల్చి చెప్పిన అరబ్ దేశాలు
- ఐరాస సదస్సులో 2 దేశాల సూత్రంపై చర్చ
- అరబ్ లీగ్, ఈయూ, 17 దేశాల మద్దతు

ట్రంప్ పేరు చెప్పేందుకు
మోదీకి ధైర్యం లేదు

అందుకే ట్రంప్ చెప్పేదంతా
అబద్ధం అనలేకపోతున్నారు: రాహుల్



న్యూఢిల్లీ, జూలై 30: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నదంతా అబద్ధమని ప్రధాన మంత్రి మోదీ చెప్పలేకపోతున్నారని కాంగ్రెస్ విమర్శించింది. భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణలో తాను కీలక పాత్ర పోషించానని ట్రంప్ ఇప్పటికి దాదాపు 30సార్లు ప్రకటించుకోవడంపై మోదీ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదని ఎద్దేవా చేసింది. కాల్పుల విరమణ విషయంలో తన పాత్ర గురించి ట్రంప్ అబద్ధం చెబుతున్నారని మోదీ చెప్పలేరని, అలా చేస్తే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిజాన్ని బయట పెడతారని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. 'ఒకవేళ ట్రంప్ చెప్పేది అబద్ధమని మోదీ చెబితే.. నిజం ఏమిటో ఆయనే బహిరంగంగా చెబుతారు. అందుకే ప్రధాని ఏమీ చెప్పలేకపోతున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ట్రంప్ అబద్ధం చెబుతున్నారని చెప్పే ధైర్యం మోదీకి లేదని, ఈ వ్యవహారం మొత్తం అనుమానాస్పదంగా ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే అన్నారు. ఇదిలా ఉండగా, భారత తొలి ప్రధాని నెహ్రూను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో విమర్శించడంపై కాంగ్రెస్ మండిపడింది. వారి వైఫల్యాలకు సమాధానం చెప్పలేక దృష్టి మళ్లింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించింది. నెహ్రూ విషయంలో మోదీ, అమిత్ షా ఇద్దరూ ఓసీడీ (అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్) సమస్యతో బాధపడుతున్నారన్న విషయం లోక్‌సభలో మరోసారి నిరూపితమైందని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

ఎస్ఐఆర్‌పై వరుసగా ఏడో రోజు నిరసన

న్యూఢిల్లీ, జూలై 30: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- ఎస్ఐఆర్) ప్రక్రియ పార్లమెంట్ ఉభయసభల్ని కుదిపేస్తోంది. తక్షణమే ఈ సర్వేను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీతో పాటు ఇండియా కూటమికి చెందిన పలువురు ఎంపీలు వరుసగా ఏడో రోజు కూడా పార్లమెంట్ మకర ద్వారం వద్ద నిరసన చేపట్టారు. సోనియా, ప్రియాంక గాంధీ సహా డీఎంకే, టీఎంసీ, సమాజ్‌వాది, ఆర్జేడీ, వామపక్షాలకు చెందిన ఎంపీలు.. "ఎస్ఐఆర్- ప్రజాస్వామ్యంపై దాడి" అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బుధవారం సమావేశాల ప్రారంభానికి ముందే నిరసన వ్యక్తం చేశారు.

గౌరవ్ గొగోయ్‌కు పాక్‌తో లింకులు: హిమంత

గువాహటి, జూలై 30: 'ఆపరేషన్ సిందూర్'పై పార్లమెంటులో జరిగిన చర్చలో ప్రధాని మోదీ సహా కేంద్ర ప్రభుత్వాన్ని తప్పుబడుతూ.. అసోంకు చెందిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ నిప్పులు చెరిగారు. అయితే.. ఆ మర్నాడే(బుధవారం) ఆయనపై అసోం సీఎం హిమంతబిశ్వశర్మ మరో రూపంలో సంచలన ఆరోపణలు చేశారు. ఎంపీ గౌరవ్, ఆయన భార్య ఎలిజబెత్ కోల్బర్న్ గొగోయ్ సహా వారి కుటుంబానికి పాకిస్థాన్‌తో సంబంధాలు ఉన్నాయన్నారు. ఈ వ్యవహారంపై ఎన్ఐఏతో లోతైన విచారణ జరిపించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. "పాకిస్థాన్ తరఫున గొగోయ్ వకాల్తా పుచ్చుకున్నారు. ఆ దేశం తరఫున పనిచేస్తున్నారు. ఆయన భార్య ఎలిజబెత్ నేతృత్వంలో ఎన్జీవోకు కూడా పాక్‌తో లింకులు ఉన్నాయి" అని ఆరోపించారు. "గౌరవ్ భార్య, ఇద్దరు పిల్లలకు విదేశీ పౌరసత్వం ఉంది. ఆయన ఎప్పుడైనా దేశాన్ని వీడి వెళ్లిపోయే అవకాశముంది." అని పేర్కొన్నారు.

127 ఏళ్ల తర్వాత భారత్‌కు బుద్ధుడి అవశేషాలు

న్యూఢిల్లీ, జూలై 30: బ్రిటిష్ పాలనలో భారత్ నుంచి తరలిపోయిన బుద్ధుడి పవిత్ర అవశేషాలను 127 ఏళ్ల తర్వాత తిరిగి స్వదేశానికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ అద్భుత ఘట్టం మన దేశానికి, మన సాంస్కృతిక వారసత్వానికి గర్వకారణమని మోదీ పేర్కొన్నారు. ఈ పవిత్ర అవశేషాలు బుద్ధుడితో భారతదేశానికి గల అనుబంధాన్ని, ఆయన ఉన్నత బోధనలను ప్రతిబింబిస్తాయని అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఓ అంతర్జాతీయ వేలంలో కనిపించిన ఈ అవశేషాలను తిరిగి భారత్‌కు తీసుకురావడానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ప్రధాని తెలిపారు. 1898లో ఉత్తరప్రదేశ్‌లోని పిపర్‌వాహలో (భారత్-నేపాల్ సరిహద్దుకు సమీపం) ఓ పురాతన బౌద్ధ స్తూపం తవ్వకాల్లో కొన్ని అవశేషాలు బయటపడ్డాయి. గౌతమ బుద్ధుడివని భావిస్తున్న అస్థి అవశేషాలు, విలువైన పేటికలు, బంగారు ఆభరణాలు, రత్నాలు వీటిలో ఉన్నాయి.

హైవేపై సడన్ బ్రేక్ వేయడం నిర్లక్ష్యమే: సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 30: ఎలాంటి సిగ్నల్, హెచ్చరికలు లేకుండా హైవేపై సడన్‌గా బ్రేక్ వేయడం నిర్లక్ష్యం కిందకే వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జరిగిన ప్రమాదానికి బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. హైవేపై అందరూ వేగంగానే వెళ్తుంటారని, అలాంటి పరిస్థితుల్లో రోడ్డు మధ్యలో ఆకస్మికంగా బ్రేక్ వేయడం ప్రమాదానికి హేతువు అవుతుందని జస్టిస్ సుధాంశు ధులియా, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం మంగళవారం తెలిపింది. 2017 జనవరి 7న కోయంబత్తూర్‌కు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ఎస్.మహమ్మద్ హకీం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఎదురుగా వెళ్తున్న కారుకు డ్రైవర్ సడన్ బ్రేకు వేయడంతో దానికి తగిలి కింద పడ్డాడు. ఇంతలో వెనుక నుంచి బస్సు రావడంతో దాని కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో ఆయన ఎడమకాలును తొలగించాల్సి వచ్చింది. పరిహారం కోరుతూ ఆయన తొలుత మోటార్ యాక్సిడెంట్ క్లైయిమ్స్ ట్రిబ్యునల్‌ను, తర్వాత మద్రాసు హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన కోర్టు.. హైవేపై రోడ్డు మధ్యలో సడన్ బ్రేకు వేయడాన్ని ఏ కోణంలోనూ సమర్థించలేమని తెలిపింది. కారు డ్రైవర్‌ది 50%, బస్సు డ్రైవర్‌ది 30%, బైకు నడిపిన విద్యార్థిది 20% తప్పని వివరించింది. బీమా కంపెనీలు రూ.1.14 కోట్ల పరిహారం చెల్లించాల్సి ఉంటుందని లెక్కకట్టింది. విద్యార్థిది 20% మేర తప్పు ఉన్నందున అంత మేరకు పరిహారాన్ని తగ్గించి మిగిలిన సొమ్మును 4వారాల్లో చెల్లించాలని ఆదేశించింది.

వేధించిన న్యాయమూర్తికి పదోన్నతి.. మధ్యప్రదేశ్‌లో మహిళా జడ్జి రాజీనామా

భోపాల్, జూలై 30: తనను వేధించిన ఓ న్యాయమూర్తికి పదోన్నతి లభించడాన్ని నిరసిస్తూ ఓ మహిళా జడ్జి రాజీనామా చేశారు. తన ఆవేదనను రాష్ట్రపతికి లేఖ రూపంలో వివరించినా.. ఫలితం లేదని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లోని శహడోల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న అదితికుమార్ శర్మ అనే జడ్జి సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. తనను వేధించిన న్యాయమూర్తి రాజేశ్‌కుమార్ గుప్తాకు మధ్యప్రదేశ్ హైకోర్టులో పదోన్నతి లభించడానికి నిరసనగా ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ఓ సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. గుప్తా పదోన్నతిని నిరసిస్తూ తాను రాష్ట్రపతికి, మధ్యప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి, సుప్రీంకోర్టుకు, రిజిస్ట్రార్ జనరల్, కొలీజియంకు లేఖలు రాసిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ లేఖలపై ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అనుభవించిన హింస కేవలం శారీరకమైనది కాదని, తన గౌరవం, గళం, న్యాయమూర్తిగా అస్తిత్వం నాశనం అయ్యాయని ఆమె వాపోయారు.

ఎయిర్ ఇండియా విమానాల్లో భద్రతా లోపాలు


» ఆడిట్‌లో దాదాపు వంద ఉల్లంఘనలను గుర్తించిన డీజీసీఏ

న్యూఢిల్లీ, జూలై 30: అహ్మదాబాద్ విమాన ప్రమాదం నేపథ్యంలో డీజీసీఏ గురుగ్రామ్‌లోని ఎయిర్ ఇండియా బేస్‌లో ఉన్న విమానాల్లో నిర్వహించిన తనిఖీల్లో దాదాపు వంద భద్రతా లోపాలు, ఉల్లంఘనలు బయటపడ్డాయి. ఇందులో ఏడు తీవ్రమైన ఉల్లంఘనలని(లెవెల్ 1- అత్యంత రిస్క్‌తో కూడుకున్నవి), వాటిని వెంటనే సరిదిద్దుకోవాలని డీజీసీఏ తన ఆడిట్ రిపోర్టులో పేర్కొంది. జూలై 1- జూలై 4 మధ్య ఈ తనిఖీలను నిర్వహించారు. విమాన సిబ్బందికి తగిన శిక్షణ, వారి విధులు, విశ్రాంతికి సంబంధించిన రూల్స్‌ను ఎయిర్ ఇండియా అధికార యంత్రాంగం సరిగ్గా పాటించడం లేదని ఈ తనిఖీల్లో తేలింది.

రాహుల్.. చైనా గురువు!

బీజింగ్ ఒలింపిక్స్‌కు వెళ్లి ఆ దేశం నుంచి పాఠాలు నేర్చుకున్నారు

» అవి చాలక చైనా రాయబారితో ట్యూషన్లు
» విదేశాంగ మంత్రి జైశంకర్ ఎద్దేవా
» రాజ్యసభ చర్చలో నెహ్రూ, కాంగ్రెస్‌పై ధ్వజం



న్యూఢిల్లీ, జూలై 30: విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ రాజ్యసభలో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీని, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్‌ను చైనా గురువులుగా అభివర్ణించారు. దౌత్యవేత్తగా పనిచేసిన తనకు చైనా గురించి పెద్దగా తెలీదని.. రాహుల్, ఆయన కుటుంబ సభ్యులు మాత్రం బీజింగ్ ఒలింపిక్స్‌కు వెళ్లి చైనా గురించి తెలుసుకున్నారని.. ఇక్కడి చైనా రాయబారి నుంచి ప్రత్యేకంగా ట్యూషన్లు చెప్పించుకున్నారని ఎద్దేవాచేశారు. తాను ఇటీవల ఆ దేశాన్ని సందర్శించినప్పుడు సదరు చైనా గురువుల్లా రహస్య భేటీలు జరుపడం గానీ, రహస్య ఒప్పందాలు కుదుర్చుకోవడం గానీ చేయలేదన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం రాజ్యసభలో చర్చ సందర్భంగా.. ప్రథమ ప్రధాని నెహ్రూ, గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై జైశంకర్ విరుచుకుపడ్డారు. ఏ దేశమైనా తనకు మేలు జరిగేలా, తన రాష్ట్రాలకు ఎక్కువ నీరు అందేలా ఒప్పందాలు చేసుకుంటుందని.. కానీ నెహ్రూ కుదుర్చుకున్న సింధూ జలాల ఒప్పందంతో నీళ్లపై మనకు హక్కే లేకుండా చేశారని.. పాకిస్థాన్‌లోని పంజాబ్‌కు 80% నీరివ్వడమే గాక ఆర్థిక సాయం కూడా అందించారని ధ్వజమెత్తారు. పాకిస్థాన్-చైనా బంధం గురించి రాహుల్ మాట్లాడుతున్నారని.. ఇది రాత్రికి రాత్రి ఏర్పడిన బంధం కాదని.. 1960ల నుంచే ఆ దేశాల నడుమ పరస్పర సహకారం ప్రారంభమైందన్నారు. తాను 41 ఏళ్ల దౌత్యవేత్తగా ఉన్నానని.. దీర్ఘకాలం చైనాలో రాయబారిగా కూడా పనిచేశానని.. అయినా తానేమీ చేయడం లేదని కొందరు అంటున్నారని ఆక్షేపించారు. 'ఇప్పుడు కొందరు చైనా గురువులు ఉన్నారు. వారికి ఆ దేశమంటే వల్లమాలిన అభిమానం. వారిలో ఒకరు (జైరాం రమేశ్) ఈ సభలో నా ముందే కూర్చుని ఉన్నారు. ఏకంగా 'చిండియా' అనే పదాన్నే కనిపెట్టారు. ఇంకో చైనా గురువు (రాహుల్) ఉన్నారు. ఆయనలా నేను ఒలింపిక్స్‌కు వెళ్లి చైనా నుంచి పాఠాలు నేర్చుకోలేదు. ప్రత్యేకమైన వ్యక్తిని కాకపోవడంతో ఆహ్వానం కూడా లేదు (యూపీఏ-1 హయాంలో 2008లో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ బీజింగ్ ఒలింపిక్స్‌కు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు). అక్కడ వారెవరిని కలిశారు? చైనా వాళ్లనే కాదు.. ఇతరులతోనూ (పాకిస్థాన్ నేతలు) భేటీ అయ్యారు. ఒలింపిక్స్ క్లాస్‌రూంలో అన్నీ నేర్చుకున్నట్లు లేరు. దీంతో ఢిల్లీలో చైనా రాయబారి ఇంటికి వెళ్లి ప్రైవేటు ట్యూషన్లు చెప్పించుకున్నారు. పాక్, చైనా చేరువయ్యాయని ఈ చైనా గురువు అంటున్నారు. పాక్ ఆక్రమిత కశ్మీరును వాళ్లు వదిలేయడం వల్లే ఆ రెండు దేశాలూ సన్నిహితమయ్యాయి' అని తూర్పారబట్టారు. రాహుల్ తమకు వార్నింగ్ ఇస్తున్నారని.. చరిత్ర పాఠం చెబుతున్నప్పుడు ఆయన నిద్రపోయారేమోనని.. యూపీఏ హయాంలోనే చైనాతో వ్యూహాత్మక భాగస్వామ్యం పెరిగిందని.. పెట్టుబడుల కోసం చైనా కంపెనీలను ఆహ్వానించారని గుర్తుచేశారు. జాతీయ భద్రత గురించి మాట్లాడుతున్నారని.. వారి హయాంలోనే శ్రీలంకలో హంబంటోటా పోర్టును చైనా కైవసం చేసుకుందని.. అప్పుడే భారత భద్రతకు చెప్పుకోలేనంత నష్టం వాటిల్లిందని స్పష్టంచేశారు. చైనాపై లెక్చర్లు దంచే చైనా గురువు ఇదంతా వారి హయాంలోనే జరిగిందనేది తెలుసుకోవాలని సూచించారు. పహల్గాంలో ఉగ్రవాద దాడి జరిగిన ఏప్రిల్ 22 నుంచి జూన్ 16 నడుమ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రధాని మోదీ మధ్య ఒక్కసారి కూడా ఫోన్ చర్చలు జరుగనేలేదని తేల్చిచెప్పారు. సింధూ జలాల ఒప్పందం గురించి మాట్లాడుతూ.. 'అసలు ఇలాంటి ఒప్పందం ఉంటుందని ఆలోచించలేం కూడా. ఒక దేశం తన ప్రధాన నదులు వేరే దేశంలో ప్రవహించడానికి అనుమతించడం.. అది కూడా ఆ నదులపై హక్కులు లేకుండా! నాటి ప్రధాని నెహ్రూ 1960 నవంబరు 30న పార్లమెంటులో మాట్లాడుతూ.. పాకిస్థానీ పంజాబ్ ప్రయోజనాల కోసం ఈ ఒప్పందం కుదుర్చుకోనివ్వాలని కోరారు. కశ్మీరు, పంజాబ్ రైతుల గురించి ఒక్క ముక్క మాట్లాడలేదు. సింధు జలాల ఒప్పందం, 370 అధికరణకు సంబంధించి నెహ్రూ చేసిన తప్పులను ప్రధాని మోదీ సరిదిద్దారు' అని తెలిపారు. కాగా, కాంగ్రెస్ హయాంలో ఉగ్రదాడులకు పాల్పడినవారికి బిర్యానీ పెట్టారని నడ్డా విమర్శించారు.

పీవోకేను ఇచ్చింది మీరే

దానిని బీజేపీ ప్రభుత్వమే తిరిగి తీసుకొస్తుంది: అమిత్ షా

న్యూఢిల్లీ, జూలై 30: 'పీవోకేను మీరే ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం మాత్రమే దాన్ని తిరిగి తీసుకొస్తుంది' అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీకి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాజ్యసభలో ఆయన సవాల్ చేశారు. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చకు ఆయన బుధవారం సమాధానం ఇచ్చారు. "ఎవరో కోరారని ఆపరేషన్ సిందూర్‌ను ఆపేయలేదు. పాకిస్థాన్ మన ముందు మోకరిల్లింది. దయచేసి ఇంతటితో ఆపేయండి... అని వారి డీజీఎంవో మనకు ఫోన్ చేసి అభ్యర్థించారు. పాక్ మన దేశంలోని పౌరులు నివసించే ప్రాంతాలపై దాడులకు పాల్పడింది. కానీ భారత్ మాత్రం వారి 11 ఈ సభ ద్వారా ఉగ్రవాదులకు నేను ఒకటే చెప్పాలనుకుంటున్నాను. మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి. జమ్మూ కశ్మీర్ ఉగ్రవాదం నుంచి విముక్తి పొందుతుంది. ఇది ప్రధాని మోదీ సంకల్పం' అని అమిత్ షా స్పష్టం చేశారు.



పహల్గాం ఉగ్రదాడిలో
టీఆర్ఎఫ్ పాత్ర

ఐరాస భద్రతా మండలి నివేదిక స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 30: పహల్గాం దాడిలో అంతర్జాతీయంగా పాకిస్థాన్‌ను దోషిగా నిలబెట్టే విషయంలో భారత్ గొప్ప దౌత్య విజయం సాధించింది. ఈ దాడిలో ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) పాత్ర ఉందని మొట్టమొదటిసారి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) నివేదిక స్పష్టం చేసింది. లష్కరే తాయిబా మద్దతు లేకుండా ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రదాడి జరగదని, లష్కరే తాయిబాకు, టీఆర్ఎఫ్‌కు అవినాభావ సంబంధం ఉందని భద్రతా మండలికి చెందిన పర్యవేక్షక బృందం (ఎంటీ) నివేదిక వెల్లడించింది. భద్రతా మండలి 1267 ఆంక్షల కమిటీ నిర్ణయాలు, నివేదికలను ఏకాభిప్రాయంతో ఐరాస సభ్యులు ఆమోదించడంతో ఆ నివేదిక ప్రాధాన్యత సంతరించుకుందని ఐరాస వర్గాలు తెలిపాయి. పహల్గాం దాడిలో ఐదుగురు ఉగ్రవాదులు పాల్గొన్నారని, 26 మంది అమాయక పౌరులు చనిపోయారని నివేదిక తెలిపింది. ఆ దాడులు తామే చేశామని టీఆర్ఎఫ్ అదేరోజు ప్రకటించడాన్ని ప్రస్తావించింది. నాలుగు రోజుల తర్వాత టీఆర్ఎఫ్ మాటమార్చేసిందని వెల్లడించింది. అనంతరం మరే ఉగ్రవాద సంస్థ కూడా దాడులకు బాధ్యత తీసుకోలేదని తెలిపింది. ప్రాంతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలను లష్కరే ఉపయోగించుకునే ప్రమాదం ఉందని హెచ్చరించింది. లష్కరే, జేఈఎంల నుంచి దృష్టి మరల్చడానికి టీఆర్ఎఫ్, పీపుల్ ఎగైనెస్ట్ ఫాసిస్ట్ ఫ్రంట్ పేర్లతో జమ్మూ కశ్మీర్‌లో దాడులు చేయడానికి పాక్ చేసిన ప్రయత్నాలకు పెద్ద దెబ్బపడినట్లయింది. కాగా, లష్కరే, పాక్‌లోని ఉగ్రవాద గ్రూపుల పేర్లను నివేదికల్లో చేర్చడం 2019 తర్వాత తొలిసారి. ఎంటీ నివేదిక నుంచి టీఆర్ఎఫ్ పేరును తొలగించడానికి పాక్ చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు. తమకు సంబంధం లేదంటూ పాక్ చేసిన వాదన ఎంటీ నివేదికతో వీగిపోయింది.

మణిపూర్‌లో మరో ఆరు నెలలు రాష్ట్రపతి పాలన

తీర్మానానికి లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, జూలై 30: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను ఆగస్టు 13 తర్వాతి నుంచి మరో ఆరు నెలలు పొడిగించడానికి సంబంధించిన తీర్మానానికి బుధవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ తీర్మానాన్ని లోక్‌సభలో చర్చకు ప్రవేశపెట్టారు. మణిపూర్‌లో ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన ను విధించగా.. ఏప్రిల్ 2న పార్లమెంట్ ఆమోదం తెలిపిందని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. రాష్ట్రపతిపాలనకు పార్లమెంట్ తెలిపిన ఆమోదం ఆరు నెలల పాటు చెల్లుబాటు అవుతుంది. ఒకవేళ రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలల పాటు పొడిగించాలంటే చట్టబద్ధమైన తీర్మానాన్ని పార్లమెంట్‌లోని ఉభయ సభలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించిన తర్వాతి నుంచి ఒకే ఒక మరణం చోటు చేసుకుందని కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ పేర్కొన్నారు. ఈ రాష్ట్రంలో శాంతి స్థాపనకు రాష్ట్రపతి పాలన ముఖ్యమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు నియంత్రణలో ఉన్నాయని తెలిపారు.

భారత్‌పై 25% సుంకం

(మొదటి పేజీ తరువాయి)

మరొక ప్రకటన చేశారు. అప్పటిదాకా.. చైనా వంటి కొన్నిదేశాలు మినహా మెజారిటీ దేశాలపై 10 శాతం సుంకం వసూలు చేస్తానని చెప్పారు. భారతదేశం తమకు మిత్రదేశమే అయినప్పటికీ.. ఆ దేశంతో అమెరికా చాలా సంవత్సరాలుగా పెద్దగా వ్యాపారం చేయలేకపోయిందని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. "ఎందుకంటే భారత్ విధించే సుంకాలు చాలా ఎక్కువగా ఉంటాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు విధిస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇతరదేశాలతో పోలిస్తే భారత్ అత్యంత కఠినమైన, గర్హనీయమైన ఆర్థికేతర పన్ను అడ్డంకులను విధించే దేశం" అని ఆయన ఆ పోస్టులో వివరించారు. "అంతేకాదు.. వారు (భారత్) ఎల్లప్పుడూ తమకు కావాల్సిన సైనిక పరికరాల్లో ఎక్కువ భాగం రష్యా నుంచే కొనుగోలు చేస్తారు. రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేసే అతిపెద్ద దేశాల్లో చైనాతో పాటు భారత్ కూడా ఉంది. ఇదంతా కూడా.. ఉక్రెయిన్‌లో రష్యా సాగిస్తున్న మారణకాండను నిలువరించాలని అందరూ అనుకుంటున్న వేళ జరుగుతోంది. ఇది మంచిది కాదు. అందువల్ల భారత్ ఉత్పత్తులపై 25% సుంకాలు, అదనంగా జరిమానా విధిస్తాం. ఇవి ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయి." అని తేల్చిచెప్పారు. "ఆగస్టు ఒకటి అంటే.. ఆగస్టు ఒకటే. ఈసారి ఆ గడువును పొడిగించే ప్రసక్తే లేదు." అని హెచ్చరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ట్రంప్.. వాణిజ్యంతోపాటు.. భారత్ 'బ్రిక్స్'లో భాగం కావడం కూడా 25% సుంకాల నిర్ణయానికి ఒక కారణమని తెలిపారు. బ్రిక్స్.. అమెరికా వ్యతిరేక కూటమి అని, అది డాలర్‌పై దాడి చేస్తోందని.. ఎవరైనా సరే, డాలర్‌పై దాడి చేయడాన్ని తాము అనుమతించబోమని ఆయన వ్యాఖ్యానించారు. "ప్రధాని మోదీ నా స్నేహితుడే. కానీ.. వాణిజ్యకోణంలో చూస్తే వారు (భారత్) మాతో పెద్ద ఎత్తున వ్యాపారం చేయట్లేదు. భారత్ మాకు అనేక ఉత్పత్తులను విక్రయిస్తోందిగానీ మేం వారి దగ్గర కొనదల్చుకోలేదు. ఎందుకంటే వారి సుంకాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలు వారు వసూలు చేస్తున్నారు. ఇప్పుడు వారు ఆ సుంకాలను గణనీయంగా తగ్గించడానికి సిద్ధంగా ఉన్నారు. చర్చలు జరుగుతున్నాయి. ఏం జరుగుతుందో చూడాలి. ఈ వారాంతానికి ఏ విషయమూ తేలుతుంది" అని ట్రంప్ పేర్కొన్నారు. కాగా.. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటిదాకా ఇరు దేశాల మధ్య.. వాణిజ్య ఒప్పందంపై ఐదుసార్లు చర్చలు జరిగాయిగానీ అవి ఒక కొలిక్కి రాలేదు. ఆరో దశ చర్చలు ఆగస్టులో జరగాల్సి ఉంది. ఇందుకోసం అమెరికా నుంచి ఒక బృందం ఆగస్టు 25న భారత్‌కు రానున్నట్టు ప్రభుత్వ వర్గాలు ఇటీవలే వెల్లడించాయి. ఇంతలోనే.. ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.

పరిశీలిస్తున్నాం..

ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం ఎంతమేరకు ఉంటుందనే అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్రప్రభుత్వం తెలిపింది. సముచితమైన, సంతులిత, పరస్పర ప్రయోజనకారిగా, ఇరు దేశాలకూ లాభదాయకంగా ఉండే వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న ఆశ తమకు ఉందని.. ఆ దిశగా ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని పేర్కొంది. మరోవైపు.. భారత ఉత్పత్తులపై 25% సుంకం, రష్యా చమురు కొన్నందుకు జరిమానా విధిస్తామంటూ ట్రంప్ చేసిన ప్రకటన నేపథ్యంలో విపక్షాలు కేంద్రంపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టాయి. ప్రధాని మోదీకి ట్రంప్‌తో ఉన్న స్నేహం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని దీంతో తేటతెల్లమైందని ఎద్దేవా చేశాయి. హౌడీ మోదీకి, ట్రంప్ మధ్య ఉన్న 'తారిఫ్ (పరస్పర పొగడ్తలు)' పనికి రాలేదని.. ట్రంప్ మనపై టారిఫ్ (సుంకం), పెనాల్టీ (జరిమానా) వేశారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'టారిఫ్'.. 'తారిఫ్' అనే పదాలు ఉపయోగించి చురకలు వేశారు. ఇప్పటికైనా ప్రధాని మోదీ మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ఆదర్శంగా తీసుకుని అమెరికా అధ్యక్షుడికి ఎదురుగా ధైర్యంగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. ట్రంప్ చేసిన ఎన్నో అవమానాలను మౌనంగా భరిస్తే భారత్‌కు ప్రయోజనాలు ఉంటాయని ప్రధాని మోదీ భావించారని.. కానీ అలా జరగలేదని జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు.

2024లో ఎగుమతులు ఇలా

ఉత్పత్తి	విలువ (రూ.కోట్లలో)
ఔషధాలు	67,635
టెలికం పరికరాలు	54,340
రత్నాలు	44,360
పెట్రో ఉత్పత్తులు	34,260
స్వర్ణాభరణాలు	26,720
ఆటో విడిభాగాలు	23,400
రెడీమేడ్ దుస్తులు	23,380
ఇనుము, ఉక్కు	22,545

ట్రంప్ అసహనం.. అందుకే..

భారత్‌పై 25% సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ చేసిన ప్రకటన వెనుక కారణం ఏంటో వైట్ హౌస్ ఆర్థిక సలహాదారు, అమెరికా నేషనల్ ఎకనామిక్ కౌన్సిల్ డైరెక్టర్ కెవిన్ హాసెట్ బయటపెట్టారు. ఏప్రిల్‌లో ట్రంప్ సుంకాల ప్రకటన చేసిన నాటి నుంచీ.. ఇండియా-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి జరుగుతున్న చర్చలు ఎటూ తెగట్లేదు. దీనిపై ట్రంప్ అసహనంతో ఉన్నారని.. 25% సుంకాల విధింపును ఆయన పరిష్కారంగా చూస్తున్నారని.. ఈ టారిఫ్ ద్వారా భారత్‌పై ఒత్తిడి పెంచి అమెరికా ప్రజలకు మేలు చేసేలా ఒప్పందం కుదుర్చుకోవచ్చని ఆయన భావిస్తున్నట్టు హాసెట్ వెల్లడించారు.

ఇరుదేశాలకూ నష్టమే!



న్యూఢిల్లీ, జూలై 30: భారత్‌పై ట్రంప్ సుంకాల బాదుడుతో.. ఇరు దేశాలకూ నష్టమేనని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న పలు ఉత్పత్తులపై ఇన్నాళ్లుగా అతి తక్కువ సుంకాలు ఉండేవి. దీంతో ఆయా ఉత్పత్తులు అమెరికన్లకు చాలా చౌకగా అందుబాటులో ఉండేవి. ముఖ్యంగా.. స్మార్ట్‌ఫోన్లు, రెడీమేడ్ దుస్తులు, ఆటోమొబైల్ విడిభాగాలు, ఆభరణాలు, కట్, పాలిష్ వజ్రాలు, పలు కీలక ఔషధాల ధరలు ట్రంప్ నిర్ణయంతో భారీగా పెరగనున్నాయి. ప్రముఖ మార్కెట్ రిసెర్చ్ కంపెనీ.. 'కౌంటర్‌పాయింట్ రిసెర్చ్' నివేదిక ప్రకారం స్మార్ట్‌ఫోన్లకు భారత్ ఇటీవలికాలంలో గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారింది. ప్రపంచవ్యాప్తంగా అమ్ముడవుతున్న మధ్య శ్రేణి ఆండ్రాయిడ్ ఫోన్లతోపాటు.. యాపిల్ ఫోన్ల కాంపోనెంట్లు కూడా భారత్‌లోనే అసెంబుల్ అవుతున్నాయి. ఇటీవలికాలంలో ఐఫోన్లు భారత్‌లో పెద్ద ఎత్తున తయారై అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. వాటన్నింటిపైనా 25% సుంకం విధించడమంటే.. ఇప్పటికే ద్రవ్యోల్బణం దెబ్బకు విలవిలలాడుతున్న అమెరికన్ వినియోగదారులపై పెనుభారం మోపడమేనని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 'యేల్స్ బడ్జెట్ లాబ్', 'అసోసియేటెడ్ ప్రెస్' అంచనాల ప్రకారం.. తాజా సుంకాల పెంపుతో అమెరికాలో దుస్తుల ధరలు 17% దాకా పెరుగుతాయి. అమెరికా ప్రజలు వినియోగించే జనరిక్ ఔషధాల్లో 40% ఇండియా నుంచే సరఫరా అవుతున్నాయి. భారత్ ఎగుమతి చేసే ఔషధాల్లో క్యాన్సర్, మధుమేహం, హృద్రోగాలు, సాంక్రమిక వ్యాధులకు సంబంధించిన కీలక ఔషధాలు చాలా ఉన్నాయి. ట్రంప్ నిర్ణయంతో వాటన్నింటి ధరలూ పెరుగుతాయి. 2023లో భారత్ నుంచి అమెరికాకు 2.2 బిలియన్ డాలర్ల విలువైన ఆటోమొబైల్ విడిభాగాలు ఎగుమతి అయ్యాయి. అమెరికన్ వాహన తయారీదారులు.. తమ ఉత్పత్తి ఖర్చులను తక్కువగా ఉంచుకోవడానికి భారత్ నుంచి దిగుమతి చేసుకునే విడిభాగాలపైనే ఆధారపడుతున్నారు. ఇకపై వాటి ధరలు కూడా పెరగనుండడంతో.. సగటు అమెరికన్ల కారు మరమ్మతుల ఖర్చులు పెరుగుతాయి.

మనమీదా..

ట్రంప్ సుంకాల ప్రభావం సగటు అమెరికన్లపైనే కాక.. భారత జీడీపీపైనా గణనీయంగా పడే ప్రమాదం ఉందని ఐఎంఎఫ్ ఏప్రిల్‌లోనే అంచనా వేసింది. అప్పట్లో ట్రంప్ ప్రకటించిన 26% టారిఫ్ ప్రభావం భారత జీడీపీపై 30 బిలియన్ డాలర్ల మేర (దాదాపు రూ.2.5 లక్షల కోట్లు) ఉంటుందని ఐఎంఎఫ్ పేర్కొంది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో భారత జీడీపీ రూ.4.3 లక్షల కోట్ల డాలర్లలో ఇది దాదాపుగా 0.7 శాతానికి సమానం. ఇప్పుడు.. 25 శాతం సుంకం, దానికి తోడుగా జరిమానా కూడా విధిస్తే ఆ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా గనక 20 శాతం అంతకంటే ఎక్కువ సుంకాన్ని గంపగుత్తగా విధిస్తే.. భారత జీడీపీపై 50 బేసిస్ పాయింట్ల మేర (0.5%) ప్రభావం పడుతుందని అంతర్జాతీయ బ్రోకింగ్ సంస్థ మాక్వరీ గతంలోనే హెచ్చరించింది.

ఆయుధాలు అప్పగించండి

» గాజాలో పాలన కూడా ముగించండి
» హమాస్‌కు తేల్చి చెప్పిన అరబ్ దేశాలు



న్యూయార్క్, జూలై 30: హమాస్ తమ వద్ద ఉన్న ఆయుధాలను పాలస్తీనా అథారిటీకి అప్పగించి గాజా పాలన నుంచి తప్పుకోవాలని అరబ్ దేశాలు తొలిసారిగా సూచించాయి. పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించేందుకు ఇదే సరైన మార్గమని తేల్చి చెప్పాయి. న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితిలో జరిగిన సదస్సులో అరబ్ దేశాలు, ఈయూతో పాటు 17 దేశాలు పాల్గొని ఇజ్రాయెల్-పాలస్తీనాలను రెండు దేశాలుగా గుర్తించే సూత్రంపై చర్చించాయి. దీనిపై ఫ్రాన్స్, బ్రిటన్, కెనడాతో పాటు ఈయూ, అరబ్ లీగ్ దేశాలు సమావేశమై ఓ తీర్మానం ఆమోదించాయి. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని కూడా తీర్మానంలో ఖండించారు. హమాస్ చర్యను అరబ్ దేశాలు ఖండించడం కూడా ఇదే తొలిసారి. నాటి హమాస్ దాడిలో 1200 మంది ఇజ్రాయెలీలు చనిపోయారు. ప్రతీకారంగా గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 60 వేల మందికి పైగా మృతిచెందారు.

సమావేశానికి హాజరుకాని అమెరికా, ఇజ్రాయెల్

ఐక్యరాజ్యసమితిలో జరిగిన ఈ సమావేశానికి అమెరికా, ఇజ్రాయెల్ హాజరుకాలేదు. కాల్పుల విరమణకు అంగీకరించకుంటే పాలస్తీనాను ప్రత్యేక దేశంగా గుర్తిస్తామని బ్రిటన్ ప్రధాని స్టార్మర్ హెచ్చరించడాన్ని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తప్పుబట్టారు. ఉగ్రవాదులపై మెతకవైఖరి తగదన్నారు. ఐక్యరాజ్యసమితిలో రెండు దేశాల సూత్రంపై సెప్టెంబరులో జరిగే చర్చలో పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు మ్యాక్రాన్ ప్రకటించడాన్ని కూడా ఇజ్రాయెల్, అమెరికా ఇప్పటికే ఖండించాయి. రెండు దేశాల సూత్రంపై ఫ్రాన్స్, స్పెయిన్ సహా 15 పశ్చిమ దేశాలు ఇప్పటికే మద్దతు తెలిపాయి.

కలెక్టర్ సార్‌కే సమస్యలు చెబుదాం

గురుకుల పాఠశాల విద్యార్థుల పాదయాత్ర

అలంపూర్ చౌరస్తా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని, తమ గోడును ఏకంగా కలెక్టర్ సార్‌కే చెప్పుకొంటామంటూ గురుకుల పాఠశాల విద్యార్థులు పాదయాత్రగా బయలుదేరారు. పోలీసులు నచ్చజెప్పినా ససేమిరా అన్న విద్యార్థులు అడుగు ముందుకే వేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామ శివారు అలంపూర్ చౌరస్తాలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను ఆరేళ్లుగా ఓ ప్రైవేటు భవనంలో కొనసాగిస్తున్నారు. 5 నుంచి 10వ తరగతి వరకు 480 మంది, ఇంటర్‌లో 80 మంది కలిపి మొత్తం 560 మంది ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని 50 రోజులుగా మొత్తుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు ఆందోళన బాటపట్టారు. ఏకంగా జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి తమ గోడును వెళ్లబోసుకుంటామంటూ తొమ్మిదవ, పదవ తరగతికి చెందిన 59 మంది విద్యార్థులు బుధవారం రోడ్డెక్కారు. 45 కి.మీ. దూరంలో ఉన్న కలెక్టరేట్‌కు పాదయాత్ర చేపట్టారు. పోలీసులు వచ్చి నచ్చజెప్పినా విద్యార్థులు వినలేదు. సుమారు 9కి.మీ. వరకు వెళ్లారు. ఈ క్రమంలో విద్యార్థులు తమ సమస్యలపై ఏకరువు పెట్టారు. 50 రోజులుగా తాము బోరునీరే తాగుతున్నామని, ఉపాధ్యాయులు మాత్రం ఫిల్టర్ నీళ్లు తాగుతున్నారని, తమకు సరిపడా మరుగుదొడ్లు కూడా లేవని, దీంతో బహిర్భూమికి బయటకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న 16మరుగుదొడ్లను మరమ్మతు పేరిట భవన యజమాని మూసివేయించారని ఆరోపించారు. ఈ మధ్య తాము తింటున్న అన్నంలో పురుగులు వస్తున్నాయని చెప్పినా.. పట్టించుకోవడం లేదని వాపోయారు. మళ్లీ జోక్యం చేసుకున్న ఉండవల్లి, మానవపాడు ఎస్సైలు శేఖర్, చంద్రకాంత్.. మరికొంతమంది పోలీసులు కలిసి.. ఇటిక్యాలపల్లి స్టేజీ వద్ద విద్యార్థులను సముదాయించారు. మీ సమస్యలు వినేందుకు జిల్లా అధికారులే మీ వద్దకు వచ్చేలా ఏర్పాట్లు చేస్తామని పోలీసు అధికారులు హామీ ఇచ్చి అతి కష్టంమీద వారిని ఓ డీసీఎంలో ఎక్కించి తిరిగి పాఠశాలకు తీసుకొచ్చారు. విషయం తెలిసిన అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు హాస్టల్‌కు చేరుకుని విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. యుద్ధప్రాతిపదికన 30 మరుగుదొడ్లు నిర్మిస్తామని, తాగునీటి వసతి కల్పిస్తామని, నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తామని, విద్యార్థుల సమస్యలు వినేందుకు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.


కలెక్టరేట్‌కు పాదయాత్రగా వెళుతున్న విద్యార్థులకు నచ్చజెప్పి తిరిగి డీసీఎంలో వసతి గృహానికి తరలిస్తున్న పోలీసులు

40 ఏళ్ల వ్యక్తితో 13 ఏళ్ల బాలికకు వివాహం

» బాలిక ఫిర్యాదుతో ఆమె తల్లి, మరో ముగ్గురిపై కేసు నమోదు

నందిగామ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలిక(13)కు 40 ఏళ్ల వ్యక్తితో పెళ్లి చేశారు. అనంతరం ఆ బాలిక తాను చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని కలిసి న్యాయం చేయాలని ప్రాధేయపడింది. రంగారెడ్డి జిల్లా నందిగామకు చెందిన ఓ మహిళకు ఒక కూతురు,కుమారుడు ఉన్నారు. భర్త చనిపోవడంతో కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. ఆమె కూతురు ప్రభు త్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. కుటుంబ పోషణ భారమవడంతో కూతురికి పెళ్లి చేసేందుకు మధ్యవర్తిని సంప్రదించగా.. అతను రంగారెడ్డి జిల్లా చేవెళ్లమండలం కందవాడకు చెందిన 40ఏళ్ల వ్యక్తికి ఆస్తి బాగా ఉందంటూ సంబంధం తెచ్చాడు. దీంతో మే 28న వివాహం జరిపించారు. ఈ క్రమంలో ఇష్టం లేని పెళ్లి చేశారని, చదువుకుంటానంటూ మంగళవారం బాలిక.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి తెలిపింది. ఆయన నందిగామ తహసీల్దార్ వద్దకు బాలికను తీసుకెళ్లగా ఆయన పోలీసులకు సమాచారమిచ్చారు. బాలిక ఫిర్యాదు మేరకు ఆమె తల్లితో పాటు పెళ్లికొడుకు, మధ్యవర్తి, వివాహం జరిపిన పూజారిపై బాల్య వివాహ నియంత్రణ చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం బాలికను రెస్క్యూ హోంకు తరలించారు.

ఆదిలాబాద్ రిమ్స్‌లో వైద్య విద్యార్థి ఆత్మహత్య

» విద్యార్థి స్వస్థలం రాజస్థాన్‌లోని జైపూర్


సాహిల్ చౌదరి (ఫైల్)

ఆదిలాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజస్థాన్‌లోని జైపూర్ పట్టణానికి చెందిన సాహిల్ చౌదరి(20) బుధవారం ఉదయం తోటి విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసిన అనంతరం క్లాస్‌రూమ్‌కు వెళ్లే సమయంలో అకస్మాత్తుగా హాస్టల్ గదిలోని తన రూమ్‌కు వెళ్లి ఉరేసుకున్నాడు. దీనిని గమనించిన తోటి విద్యార్థులు డోర్‌ను పగులగొట్టి బయటకు తీసుకొచ్చారు. వెంటనే ఎంఐసీకి తరలించి సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. రిమ్స్ డైరెక్టర్ రాథోడ్‌జైసింగ్ హుటాహుటిన విద్యార్థి హాస్టల్ గదికి చేరుకుని, ఆ వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ కరుణాకర్‌రావు విద్యార్థి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై త్రిసభ్య కమిటీ వేసి విచారణ జరిపిస్తామని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్‌జైసింగ్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారని చెప్పారు.

గొర్రెల పంపిణీ కుంభకోణం..

8 చోట్ల ఈడీ సోదాలు

» నాటి మంత్రి ఓఎస్డీ కల్యాణ్ ఇంట్లో తనిఖీలు.. కీలక పత్రాలు స్వాధీనం

» అధికారులు, బ్రోకర్ల ఇళ్లలోనూ సోదాలు

హైదరాబాద్,జూలై 30 (ఆంధ్రజ్యోతి) గొర్రెల పంపిణీ కుంభకోణంలో మనీలాండరింగ్ కోణంలో విచారణ ప్రారంభించిన ఈడీ అధికారులు బుధవారం హైదరాబాద్‌లో ఎనిమిది చోట్ల సోదాలు నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ అధికారులు, వారి కార్యాలయాలు, దళారులు, గతంలో అరెస్టయిన వ్యక్తుల ఇళ్లతో పాటు నాటి మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ఓఎస్డీ కల్యాణ్ ఇంట్లోనూ ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల మేర కుంభకోణం జరిగిందంటూ గతంలోనే కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు అప్పట్లోనే 17మందిని అరెస్టు చేశారు. ఏసీబీ కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో నిరుడు జూన్‌లో ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు) నమోదు చేసిన ఈడీ అధికారులు ఇప్పటికే పలువురు అనుమానితులను పిలిపించి సుదీర్ఘంగా విచారించారు. కోట్లలో డబ్బు చేతులు మారడం, ఇతర రాష్ట్రాలకు లింకులు ఉండటంతో ఈడీ అధికారులు నిశితంగా విచారణ చేపట్టారు. బుధవారం ఈడీ అధికారులు 'తెలంగాణ స్టేట్ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్' మాజీ డైరెక్టర్ రామచంద్ర నాయక్, ఈక్రముద్దీన్, మొయినుద్దీన్ ఇళ్లల్లో సోదాలు జరిపి కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. దిల్‌సుక్‌నగర్‌లోని తలసాని మాజీ ఓఎస్డీ కల్యాణ్ ఇంట్లో సోదాలు చేపట్టిన ఈడీ అధికారులు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కుంభకోణం సూత్రధారి ఎవరు? మాజీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి పాత్ర ఏమిటి? గొర్రెల యూనిట్లను మోటార్ సైకిళ్లు, ఆటోల్లో తరలించారని బిల్లులు పెట్టినా ఏ విధంగా మంజూరు చేశారు? ఆడిటింగ్ ఎందుకు జరగలేదు? అనే విషయాలపై ఈడీ అధికారులు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. గొర్రెల పంపిణీ పథకంలో రాష్ట్ర నిధులతో పాటు కేంద్రానికి చెందిన (ఎన్‌సీడీసీ) నిధులను కూడా వాడిన నేపథ్యంలో ఈడీ అధికారులు పలు అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

కన్నవారం కాదని వారు వదిలేశారు..

కన్నవారేమో కటకటాల్లో!

అనాథగా శిశువిహార్‌లో 2నెలల బిడ్డ.. ఐదుగురి జీవితాలతో నమ్రత చెలగాటం

» ఫర్టిలిటీ కేంద్రం సహాయకులు సంజయ్, నందిని పరారీలో

» తన క్లినిక్ లైసెన్స్ రద్దవడంతో మరో డాక్టర్ పేరుతో నమ్రత లైసెన్స్

హైదరాబాద్ సిటీ, కేపీహెచ్‌బీకాలనీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆ శిశువును తమ బిడ్డే అనుకున్న ఆ తల్లిదండ్రులు, తమ నెత్తురు పంచుకొని పుట్టిన బిడ్డ కాదని తెలుసుకొని వదిలేయడం.. అటు బిడ్డకు కన్నవారుగా తేలిన ఆ జంటేమో కటకటాలపాలవ్వడంతో ఇప్పుడా రెండు నెలల పసిగుడ్డు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అటు ఆ దంపతులకు.. ఇటు కన్నవారికి దూరమై ఆ బిడ్డ ఓ అనాథగా శిశువిహార్‌కు పరిమితమైంది. సరోగసీ పేరుతో అక్రమాలకు పాల్పడిన సృష్టి ఫర్టిలిటీ కేంద్రం నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత.. ఇలా ఐదుగురి జీవితాలతో చెలగాటమాడింది. సరోగసీ ద్వారా బిడ్డను అందజేస్తామని రాజస్థాన్‌కు చెందిన దంపతులకు హామీ ఇచ్చిన నమ్రత.. అసోంకు చెందిన దంపతులు మహ్మద్ అలీ ఆదిక్, నస్రీమా బేగంకు పుట్టిన మగబిడ్డను వారి నుంచి రూ. 90 వేలకు కొని.. ఆ బిడ్డ సరోగసీ ద్వారా జన్మించిన బిడ్డగా నమ్మించి పిల్లలు లేని దంపతులకు అంటగట్టింది. ప్రతిగా ఆ దంపతుల నుంచి రూ.35 లక్షలు వసూలు చేసింది. అయితే తమ బిడ్డే అని నిరూపించుకోవడానికి డీఎన్ఏ పరీక్షల తాలుకు ధ్రువపత్రాలను నమ్రత ఇవ్వకపోవడంతో అనుమానించిన ఆ దంపతులు డీఎన్ఏ పరీక్షలు చేయించగా ఆ శిశువు తమ బిడ్డ కాదని తేలిపోయింది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో సృష్టి ఫర్టిలిటీలో జరుగుతున్న మోసాల గుట్టు బట్టబయలైంది. గోపాలపురం పోలీసులు డాక్టర్ నమ్రతను, అమె కుమారుడు జయంత్ కృష్ణను, పుట్టిన బిడ్డను రూ.90వేలకు అమ్ముకున్న నస్రీమాబేగం, మహ్మద్ అలీ ఆదిక్‌లను నమ్రతకు సహకరించిన వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అయితే కన్నతల్లిదండ్రులు దూరమై.. పెంచుకుంటున్న తల్లిదండ్రులూ వదిలేయడంతో శిశువిహార్‌కు చేరిన ఆ బిడ్డ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. కన్నవాళ్లు జైలు నుంచి బయటకొచ్చాక వారికి బాబును అప్పగిస్తారా? ఒకవేళ వారు నిరాకరిస్తే ఆ చిన్నారిని శిశువిహార్‌లోనే ఉంచుతారా? అనేది చర్చనీయాంశంగా మారింది. పుట్టిన వెంటనే పొత్తిళ్లలోని బిడ్డను అమ్ముకున్న దంపతులకు ఆ బిడ్డను అప్పగించడానికి నిబంధనలు ఒప్పుకుంటాయా? అనేది తేలాల్సి ఉంది. న్యాయస్థానం ఇచ్చే తీర్పుపై ఆ బిడ్డ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. నేడో రేపో నమ్రతతో పాటు.. ఆ బిడ్డ తల్లిదండ్రులను పోలీసులు కస్టడీకి తీసుకొని విచారించే అవకాశం ఉంది.

ఎంతమందికి బేబీలను ఇచ్చి ఉంటారు?

సృష్టి సరోగసీ మోసం కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. గోపాలపురం పోలీసుల విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నమ్రత దందాలో ఇద్దరు కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించినట్లుగా తెలిసింది. సృష్టి ఫర్టిలిటీ సెంటర్ మోసాలపై ఐదేళ్లక్రితమే కేసులు నమోదయ్యాయి. సోదాలు చేసిన వైద్యాధికారులు, పోలీసులు ఈ కేంద్రాన్ని సీజ్ చేశారు. ఆమె లైసెన్సును రద్దుచేశారు. అప్పటికే ఆమె ఏపీలో, ఇతర రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన బ్రాంచీల నుంచి సరోగసీ, టెస్ట్‌ట్యూబ్ బేబీ దందాను కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. సికింద్రాబాద్‌లో కేంద్రం మూతబడిన తర్వాత కొద్దివిరామం ఇచ్చిన నమ్రత మరో డాక్టర్ పేరుతో లైసెన్స్ పొందింది. అప్పటి నుంచి తనఇంటినే కేంద్రంగా మార్చేసి.. సంజయ్, నందిని అనే ఇద్దరిని సహాయకులుగా నియమించుకుంది. వారి ఆధ్వర్యంలో ఈ అక్రమ దందాను నమ్రత తిరిగి కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. ఇటీవల సరోగసీ మోసం వెలుగులోకొచ్చాక సంజయ్, నందిని పరారయ్యారు. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. వారు దొరికితే ఇప్పటి వరకు ఎంతమందికి టెస్ట్‌ట్యూబ్ బేబీలను అందించారు? సరోగసీ ద్వారా ఎంతమందికి సంతానాన్ని అందించారు? అనే వివరాలు తెలుస్తాయని పోలీసులు భావిస్తున్నారు.

కేపీహెచ్‌బీలో 3 ఫర్టిలిటీ కేంద్రాల్లో తనిఖీలు

కేపీహెచ్‌బీలోని 3 ఫర్టిలిటీ కేంద్రాలను బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమాగౌరి ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. అవని, ఐశ్వర్య, ఫెర్టీ9 కేంద్రాలను పరిశీలించి అక్కడి ఉద్యోగులతో మాట్లాడారు. ఆయా కేంద్రాల్లో గుర్తించిన లోపాలపై సెంటర్ల నిర్వాహకులకు నోటీసులు ఇస్తామని డీఎంహెచ్‌వో తెలిపారు.

ఆ ఆర్జేసీ పోస్టులెక్కడ?

» రాష్ట్ర విభజన తర్వాత దేవాదాయ శాఖకు నాలుగు ఆర్జేసీ పోస్టుల మంజూరు

» భర్తీ అయింది ఒక్కటే.. పత్తా లేని మిగతా పోస్టులు

» పదోన్నతులతో పోస్టుల భర్తీకి జేఏసీ డిమాండ్

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో ఏళ్లుగా పోస్టులు, పోస్టింగ్‌ల పంచాయితీ సాగుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత తెలంగాణ దేవాదాయ శాఖకు ఒక కమిషనర్, మూడు అడిషనల్ కమిషనర్(ఏడీసీ), 4 రీజినల్ జాయింట్ కమిషనర్(ఆర్జేసీ) తోపాటు డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్ స్థాయి పోస్టులు మంజూరయ్యాయి. ఈ పోస్టులు అత్యంత కీలకం. అయితే పైస్థాయిలో ఉండే పోస్టుల్లో కమిషనర్/డైరెక్టర్, ఏడీసీలు మినహా... తర్వాతి స్థానంలో ఉండే ఆర్జేసీ పోస్టులకు సంబంధించి దశాబ్దకాలంగా ఎలాంటి స్పష్టత లేకుండాపోయింది. వేములవాడ, భద్రాచలం, యాదగిరి గుట్ట ఆలయాలకు ఈవోలుగా ఆర్జేసీ స్థాయి అధికారులు ఉండాలి. నాలుగు ఆర్జేసీ పోస్టుల్లో ఒక ఆర్జేసీ(పరిపాలన) పోస్టు భర్తీ కాగా ఐదేళ్లుగా ఒక్కరే ఇన్‌చార్జి హోదాలో కొనసాగుతున్నారు. వేములవాడ, భద్రాచలం, యాదగిరి గుట్ట ఆర్జేసీ క్యాడర్ ఆలయాలు. ఇప్పటి వరకు ఈ ఆలయాలకు ఆర్జేసీ స్థాయి అధికారుల నియామకం జరగలేదు. వేములవాడకు మొన్నటి దాకా డీసీ క్యాడర్ అధికారిని ఈవోగా కొనసాగించగా.. ఇటీవలే రెవెన్యూ నుంచి ఆర్డీవోను డిప్యుటేషన్‌పై తీసుకుని బాధ్యతలు అప్పగించారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి కూడా ఆర్డీవో.. ఈవోగా కొనసాగుతున్నారు. కాగా భద్రాచలం ఈవో మంగళవారం పదోన్నతి పొందారు. యాదగిరిగుట్టకు తొమ్మిదేళ్లు ఈవోగా పనిచేసిన గీతారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బాధ్యతల నుంచి తప్పుకున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి దేవాదాయ శాఖ కమిషనర్/డైరెక్టర్ గుట్ట ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇక దేవాదాయ శాఖలోకి ఇతర విభాగాల నుంచి డిప్యుటేషన్ల రద్దు, సీనియార్టీ సమీక్షించి అర్హులందరికీ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల జేఏసీ సమావేశంలో చర్చించింది. విషయం దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్‌రావు దృష్టికి వెళ్లగా వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నెల రోజులైనా సమావేశం ఏర్పాటు చేయకపోవడం, సమస్యల పరిష్కారానికి సమీక్షలు జరపకపోవడాన్ని సిబ్బంది తప్పుబడుతున్నారు.

విద్యార్థినులతో అసభ్య ప్రవర్తన

» మంచిర్యాల జిల్లాలో ఆశ్రమ పాఠశాల హెచ్ఎంపై పోక్సో కేసు

కోటపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన కారణంగా మంచిర్యాల జిల్లాలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై బుధవారం పోక్సో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం, మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు (హెచ్ఎం) అశోక్ తమతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని విద్యార్థినులు ఈ నెల 9వ తేదీన ధర్నా చేశారు. అతన్ని సస్పెండ్ చేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో హెచ్ఎం అశోక్‌ను ఈ నెల 11న ఆసిఫాబాద్ ఆశ్రమ పాఠశాలకు బదిలీ చేశారు. అయినా అతన్ని సస్పెండ్ చేసే దాకా ఆందోళన వీడేది లేదంటూ విద్యార్థినులు రెండుసార్లు రాస్తారోకో చేశారు. దీంతో స్పందించిన కలెక్టర్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి రాజేశ్వరిని విచారణకు ఆదేశించారు. సంక్షేమాధికారి విచారించి నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. నివేదిక ఆధారంగా హెచ్ఎం అశోక్ బాలికలపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని రుజువు కావడంతో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆనంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా హెచ్ఎం అశోక్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో పలు పార్టీల నాయకులు, జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులు బాలికలకు అండగా నిలిచారు.


పట్టుబడ్డ హైడ్రోఫోనిక్ గంజాయి

బ్యాంకాక్ నుంచి గంజాయి

» శంషాబాద్ విమానాశ్రయంలో మహిళ అరెస్టు

» 40 కిలోల గంజాయి సీజ్

» విలువ రూ.14 కోట్లు: ఎన్‌సీబీ

హైదరాబాద్/శంషాబాద్ రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బ్యాంకాక్‌లో హైడ్రోపోనిక్ పద్ధతిలో సాగు చేసిన గంజాయిని దుబాయ్ మీదుగా హైదరాబాద్‌కు తీసుకువచ్చిన ఓ మహిళను ఎన్‌సీబీ అధికారులు బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. ఆ మహిళ తీసుకువచ్చిన రెండు బ్యాగుల్లో రహస్య అరల్లో 40.2 కిలోల గంజాయిని తీసుకువచ్చినట్లు.. దాని విలువ రూ.14 కోట్లుగా వెల్లడించారు. దీనికి భారత్‌లో భారీ డిమాండ్ ఉంటుందని, దాంతో స్మగ్లర్ల టార్గెట్‌గా మారిందని చెప్పారు. అరెస్టయిన మహిళ బ్యాంకాక్ నుంచి దుబాయ్‌కి.. అక్కడి నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నట్లు తెలిపారు. "ఆ మహిళ ఎవరి కోసం గంజాయి తీసుకువచ్చారు? ఈ ముఠా వెనక నెట్‌వర్క్‌ను ఎవరు నడుపుతున్నారు? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం" అని ఎన్‌సీబీ సూపరింటెండెంట్ అశిష్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

భూదాన్ భూములపై విచారణకు సిద్ధం

» హైకోర్టు ఆదేశిస్తే కమిషన్ వేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం

» నాగారం వివాదాస్పద భూములపై కొనసాగిన విచారణ

హైదరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా భూదాన్ భూములపై విచారణకు సిద్ధమని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. హైకోర్టు ఆదేశిస్తే రాష్ట్రంలో మొత్తం ఎంత భూదాన్ భూమి ఉంది? ఎలా బదిలీ అయిందనే అంశాలపై కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 ప్రకారం విచారణ కమిషన్ నియమించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంది. అయితే నాగారంలోని సర్వే నంబర్ 194, 195 భూములు మాత్రం ప్రైవేటు వ్యక్తులకు చెందినవని, వాటిపై ప్రభుత్వానికి విచారణ కమిషన్ వేసే ఉద్దేశం లేదని తెలిపింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని సర్వే 181, 182, 194, 195 నంబర్లలో భూదాన్ భూములుగా పేర్కొంటున్న వివాదాస్పద భూములను ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు ఐఏఎస్, ఐపీఎస్‌లు రికార్డులు మార్చి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీనిపై విచారణ కమిషన్ వేయాలని బిర్ల మల్లేశ్, వడిత్య రాములు అనే వ్యక్తులు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై జస్టిస్ కె. లక్ష్మణ్ ధర్మాసనం బుధవారం విచారణ కొనసాగించింది. భూదాన్ భూముల వివరాలు కోరినా బోర్డు వాటిని అందజేయకపోవడంపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ సమాచారం అంతా సీసీఎల్ఏ వద్ద ఉంటుందని భూదాన్ బోర్డు న్యాయవాది తెలపగా.. అక్కడి నుంచి సమాచారం తీసుకుని సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఇప్పటివరకు దాతల నుంచి స్వీకరించిన భూమి ఎంత? పేదలకు పంచిపెట్టిన భూమి ఎంత? బోర్డు వద్ద మిగిలి ఉన్న భూమి ఎంత? అనే వివరాలు ఇవ్వాలని స్పష్టం చేసింది. మరోవైపు భూమి కొనుగోలుదారుల తరఫున సీనియర్ న్యాయవాది పి. శ్రీరఘురాం వాదిస్తూ ఒక ప్రైవేటు వ్యక్తి ప్రైవేటు స్థలం కోసం విచారణ కమిషన్ వేసేలా ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరలేరని పేర్కొన్నారు. ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.


రిలీవైన జస్టిస్ వినోద్ కుమార్

» వీడ్కోలు తీసుకోకుండానే మద్రాస్ హైకోర్టుకు..

హైదరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయిన జస్టిస్ టి. వినోద్‌కుమార్ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా రిలీవ్ అయ్యారు. ఆయన గురువారం అక్కడ బాధ్యతలు స్వీకరించనున్నారు. సంప్రదాయం ప్రకారం బదిలీపై వెళ్లే న్యాయమూర్తికి న్యాయమూర్తులు మొదటి కోర్టుహాల్‌లో ఫుల్ కోర్టు సమావేశం నిర్వహించి వీడ్కోలు పలుకుతారు. ఆ తర్వాత హైకోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహిస్తారు. కాని జస్టిస్ వినోద్‌కుమార్ వీడ్కోలు తీసుకోకుండానే మద్రాస్ వెళ్లారు. వీడ్కోలు తీసుకోవడానికి తిరస్కరించినట్లు తెలిసింది.

ప్రోత్సాహకాలిస్తే తప్పేంటి?

» పెట్టుబడులను ఆకర్షించడం కోసమే టీసీఎస్‌కు ఏపీ ప్రభుత్వం నామమాత్ర ధరకు భూములు ఇచ్చి ఉంటుంది : ఏపీ హైకోర్టు



అమరావతి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఏపీకి పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలు ఇస్తే తప్పేముందని హైకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థను ఆకర్షించేందుకు నామమాత్రపు రేటుతో భూమిని కేటాయించి ఉండవచ్చని పేర్కొంది. టీసీఎస్ రూ.1,370 కోట్లు పెట్టుబడితో 12వేల ఉద్యోగాలు కల్పిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఉందని గుర్తు చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు పెట్టుబడులను ఆకర్షించేందుకు నామమాత్రపు ధరకు భూమిని కేటాయించడంతో పాటు వివిధ ప్రోత్సాహకాలు ఇస్తున్నాయని గుర్తు చేసింది. రాష్ట్ర అభివృద్ధి ప్రారంభ దశలో ఉందని తెలిపింది. ఇలాంటి సమయంలో భూమిని ఎంత రేటుకు ఇస్తున్నారనేది చూడకూడదని, టీసీఎస్ రాష్ట్రానికి రావడం వల్ల జరిగే ప్రయోజనాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడింది. ఐటీ వృద్ధి కారణంగా హైదరాబాద్, బెంగుళూరు నగరాలు ఏ స్థితిలో ఉన్నాయో గమనిస్తున్నాం కదా అని వ్యాఖ్యానించింది. విశాఖలో టీసీఎస్‌కు ఎకరాకు ఒక రుపాయి చొప్పున భూకేటాయింపులు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిల్ విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. టీసీఎస్ సంస్థకు లీజు పద్ధతిలోనే భూమిని కేటాయిస్తున్నామని, సేల్ డీడ్ ద్వారా విక్రయిస్తున్నామన్న వాదనలో వాస్తవం లేదన్న ఎస్‌జీపీ వాదనను నమోదు చేసింది.

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నాణ్యత ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ.. పంచాయతీరాజ్ ఏఈ సింగం అనిల్ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల రెవెన్యూ డివిజన్‌లోని పలు గ్రామాల్లో రూ. 18 లక్షల విలువైన అభివృద్ధి పనులను వెంకటేశ్ అనే కాంట్రాక్టర్ పూర్తి చేశాడు. వీటికి సంబంధించిన నాణ్యత ధ్రువీకరణ పత్రం కోసం జగిత్యాలలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి ఏఈ సింగం అనిల్, ఆ వ్యక్తి వద్ద నుంచి రూ.18 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో, కాంట్రాక్టర్ ఏఈతో సంప్రదింపులు జరిపి రూ.10 వేలు ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకుని, ముందుగా రూ.3 వేలు అందించాడు. మిగిలిన డబ్బుల కోసం ఏఈ ఒత్తిడి చేస్తుండడంతో బాధితుడు ఏసీబీని సంప్రదించాడు. మంగళవారం పంచాయతీరాజ్ కార్యాలయంలో బాధితుడి నుంచి రూ.7 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సమాధానాలులేని ప్రశ్నలు

పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్‌లపై లోక్‌సభలో 19గంటలకుపైగా జరిగిన ప్రత్యేక చర్చకు సమాధానంగా మంగళవారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీ 102 నిముషాలు మాట్లాడారు. ఆయన వాగ్ధాటి మనకు కొత్తేమీ కాదు కానీ, టెలివిజన్‌చానెళ్ళలో ప్రత్యక్షంగా చూసినవారు మారోమారు పరవశులైపోయి ఉంటారు. విపక్షాలు లేవనెత్తిన ఏ ప్రశ్నకూ నేరుగా సమాధానం చెప్పకపోయినా అభిమానులనూ, పార్టీ ప్రేమికులను ఆయన ప్రసంగం కచ్చితంగా కుదిపేసివుంటుంది. గంటన్నరకుపైగా మాట్లాడి కూడా ఉగ్రదాడి, ప్రతీకార దాడులమీద దేశప్రజల్లో రేగిన అనుమానాలను నివృత్తి చేయకపోగా, విపక్షాలమీద విరుచుకుపడటంలోనూ, ప్రధానంగా కాంగ్రెస్‌ను పాక్‌ప్రేమిగా, చైనా దూతగా ముద్రవేయడంలో ఆయనదే పైచేయి. యుద్ధంమీద చర్చతో ప్రజలకు సంబంధం లేదని, వారికి చెప్పాల్సింది కూడా ఏమీ లేదనీ, ఇది ప్రజాక్షేత్రంలోనూ, నిండుసభలోనూ కాంగ్రెస్–బీజేపీ రాజకీయ పోరాటమేనని దేశప్రధాని సైతం భావించినట్టుంది. చర్చ తొలిరోజున, సభలో కూర్చొని విపక్షాల వాదన వినడం కంటే, ఎన్నికలక్షేత్రం తమిళనాడుకు పోయి, బృహదీశ్వరాలయంలో ప్రార్థనలు చేయడం బహుళ ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన అనుకొని ఉంటారు.

అత్యంత ప్రమాదకరమైన, ఉగ్రదాడులకు నిలయమైన పహల్గాంలో ఐదువేలమంది పర్యాటకులు చేరినప్పుడు, ఒక్క పోలీసు కూడా ఎందుకు లేడు, నిఘావ్యవస్థ ఏం చేస్తోంది, సహాయం ఎందుకు అందలేదన్న ప్రశ్నలకు అధికారపక్షంనుంచి బాధ్యతాయుతమైన సమాధానాలు వచ్చివుంటే బాగుండేది. ప్రత్యేక ప్రతిపత్తిని కోసేసిన కశ్మీరంలో ఉగ్రవాదం దుంపనాశనమైపోయిందన్న పాలకుల ప్రచారాన్ని నమ్మి, ఛప్పన్నారు ఇంచీల ఛాతీ గల చౌకీదార్ మనలను భద్రంగా కాపాడతాడని విశ్వసించి, నిర్భయంగా వినోదానికి వెళ్ళిన అమాయక ప్రజలను ఓ ఉగ్రమూక అంత సునాయాసంగా ఎలా ఊచకోతకోయగలిగిందో చెప్పివుంటే బాగుండేది.

దాడిజరిగిన వందరోజుల తరువాత, అదీ ప్రధానమంత్రి సమాధానానికి కాస్తముందు ఉగ్రవాదులను మట్టుబెట్టడమేమిటని విపక్షాలు ఆశ్చర్యపోవడం కూడా మహాపాపమైపోయింది. ఇలా ముహూర్తం చూసుకొనే ఆ పనిచేసినట్టుగా దేశప్రజలకూ అనిపించింది కనుకనే, ఆ రాక్షసులను ఎప్పుడు పట్టుకున్నారు, ఇప్పుడు ఎందుకు కాల్చారన్న సందేహం కలిగింది. నేరుగా సమాధానాలు చెప్పడం ఇబ్బంది కాబట్టే, ఎప్పటిలాగానే చరిత్ర తవ్విపోతలు, నెహ్రూ తప్పిదాల ఎత్తిపోతలు, కాంగ్రెస్‌మీద నేరాభియోగాలు ఈ మారూ మనం వినకతప్పలేదు. ఇది ఆపరేషన్ సిందూర్ మీద కాక, నెహ్రూ విదేశాంగ విధానంమీద చర్చలాగా విశ్లేషకులకు అనిపించిందట. చైనాకు కాంగ్రెస్ భారీగా భూమిని ధారాదత్తం చేసిందని విమర్శిస్తున్న మోదీ, మొన్నటి యుద్ధంలో పాకిస్థాన్‌కు ఆయుధసాయం చేసినందుకు కూడా చైనాను గట్టిగా అనలేకపోతున్నారు.

వాణిజ్యాయుధాన్ని ప్రయోగించి నేనే యుద్ధం ఆపానని ట్రంప్ ముప్పైసార్లు చెప్పుకున్నారు. చివరకు నిండుసభలో మోదీ ప్రసంగం ముగిసిన మరుక్షణంలోనే మళ్ళీ ట్రంప్ పాతపాటే పాడటం చూస్తే, వీళ్ళిద్దరి మధ్యా బాగా చెడిందేమోనన్న అనుమానం కూడా కలుగుతుంది. ఏ దేశాధినేతా తనను యుద్ధం ఆపమనలేదని, అమెరికా ఉపాధ్యక్షుడు ఫోన్‌చేసినా తాను తగ్గలేదని మోదీ చెప్పుకున్నారు. ట్రంప్ పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని నిండుసభలో ప్రకటించడానికి మోదీకి ఇబ్బందులు ఉండవచ్చు. మరి, ఏ కారణంగా, ఎవరి నిర్ణయం మేరకు, ఏ ప్రకటిత లక్ష్యాల సాధనతో ఈ యుద్ధం ఆగిందో ఆయనే ఓ నాలుగుముక్కలు వివరంగా చెప్పివుంటే ఎంతో బాగుండేది. యుద్ధం కొనసాగనందుకు సంతోషించాల్సిందే. కానీ, బహూత్ మారా, బస్ కరో అని పాకిస్థాన్ డీజీఎంవో ప్రాధేయపడటంతోనే మనం యుద్ధాన్ని ఆపేశామన్న అభిప్రాయం మాత్రం మోదీ సమాధానం తరువాత కలుగుతోంది. మన ధాటీకి తట్టుకోలేక విలవిలలాడిన పాకిస్థాన్‌నుంచి ఇందుకు ప్రతిగా దక్కిన హామీలు ఏమిటో తెలియదు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలించివేయాలన్న లక్ష్యం కోసం పొరుగుదేశంలోకి యుద్ధవిమానాలతో చొరబడిన మనం కేవలం శత్రువు ఏడ్చినందుకే ఇలా విరమించుకున్నపక్షంలో ప్రయోజనం ఏమిటన్నది ప్రశ్న. అటు, బీజేపీ వీరాభిమానులు ఆశించిన పీవోకే స్వాధీనం, బెలూచిస్థాన్ విముక్తి ఇత్యాది లక్ష్యాలూ ఆకాంక్షలూ నెరవేరకుండా, ఇటు పాక్ భూభాగంనుంచి భారత్‌మీద భవిష్యత్తులో ఏ ఉగ్రదాడీ జరగదన్న కనీస హామీ కూడా దక్కకుండా పాలకులు వెనకడుగువేయడం ఆశ్చర్యం. యుద్ధదేశం కాదు, బుద్ధదేశం అన్న మోదీ వ్యాఖ్య పాకిస్థాన్‌కు ఇప్పుడు కొత్తగా ఇచ్చే సందేశం ఏమిటో చూడాలి.

కట్టని కాళేశ్వరమే బనకచర్ల!

జీవధార జగడాలు జటిలమైనవి. నీటి పంపకాలలో పక్షపాతాలు ఆంధ్రప్రదేశ్‌ను రెండు రాష్ట్రాలుగా విభజించాయి. వేరుపడిన దశాబ్దం అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు (లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్) ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య నదీజలాల ఘర్షణలు పునఃప్రారంభమయ్యే పరిస్థితిని కల్పించింది. రైతులు సమృద్ధ సాగునీటి వసతిని కోరుతున్నారు. వారి ఆరాటం రాజకీయవేత్తలకు మరొక మెగా ప్రాజెక్ట్ నిర్మాణాన్ని ఆరంభించేందుకు ఆలంబన అయింది.

బనకచర్ల ప్రాజెక్టు ఏమిటి? అది ఆంధ్రప్రదేశ్ కాళేశ్వరం! తెలంగాణలో కట్టిన కాళేశ్వరం, ఆంధ్రలో ప్రతిపాదిత బనకచర్ల మధ్య పోలికలు కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. తొమ్మిది దశలవారీగా నీటి పంపింగ్, ఇంచుమించు 400 కిలోమీటర్ల దూరానికి బదలాయింపు, కాలువలు, సొరంగాలు, 150 టీఎంసీలకు పైగా నీటి నిల్వ చేసే భారీ జలాశయాలు. రెండిటి నిర్మాణ వ్యయ అంచనా కూడా సమస్థాయిలో ఉన్నది. కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే ప్రాజెక్టులివి. భారీ ప్రాజెక్టులు, వాటిని మించిన మహా భారీ ప్రాజెక్టులు నిర్మించడమనే ప్రక్రియ అప్రతిహతంగా సాగిపోతోంది. నిర్మాణ వ్యయాలు పోటా పోటీగా పెరిగిపోతున్నాయి. ఈ పోటీ సుడిలో బనకచర్ల లాంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చిక్కుకున్నాయి. వ్యవస్థాపిత ప్రమాణాలు, ఆర్థిక తర్కాన్ని ఈ ప్రాజెక్టులు పరిగణనలోకి తీసుకోవు. పర్యావరణ వ్యవస్థల పరిరక్షణను పట్టించుకోవు. పుట్టని తరాల వారిపై పడుతున్న భారం గురించి కించిత్ ఆలోచన కూడా ఉండదు. ఈ పరిణామాలు మినహాయింపుగా కాకుండా ఒక సాధారణ ప్రమాణంగా వాటిల్లుతున్నాయి. ప్రాజెక్టు పరిమాణం ఎంత భారీగా ఉంటే అంత మంచిది, నిర్మాణ వ్యయం ఎంత అధికంగా ఉంటే అంత ప్రయోజనకరం. కాళేశ్వరం, బనకచర్ల కథ ఒకటే. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికాలో సైనిక–పారిశ్రామిక వర్గాల కుమ్మక్కుతో ఆయుధోత్పత్తి పరిశ్రమలు విస్తరిల్లినట్టుగా ఇప్పుడు మన దేశంలో రాజకీయ వర్గాలు– బిల్డర్లు, ఇంజనీరింగ్ సంస్థల కుమ్మక్కుతో మెగా ఇంజనీరింగ్ ప్రాజెక్టుల నిర్మాణం పెచ్చరిల్లిపోతోంది.

సమస్త వ్యవస్థాపిత ప్రమాణాలు, నియమ నిబంధనలు, నదీ జల పంపకాల ఒప్పందాలు, వ్యయ ప్రయోజన తర్కాన్ని భూస్థాపితం చేసేందుకు ఆంధ్ర, తెలంగాణ, గోదావరి ఎగువ రాష్ట్రాలు, భారత ప్రభుత్వం, కేంద్ర జల సంఘం ఏకీభవిస్తేనే బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం సుసాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు ఎప్పటికైనా ఒక రూపు తీసుకుంటే, అంతర్ రాష్ట్ర ఒప్పందాలను లక్ష్య పెట్టకుండా తమకు తోచిన రీతిలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని చేపట్టేందుకు అన్ని రాష్ట్రాలనూ పురిగొల్పుతుంది.

రాయలసీమ రైతుల ఆదాయాన్ని పెంపొందించేందుకు బనకచర్ల నిర్మించాల్సిన అవసరం లేదు. ఈ ప్రాజెక్టు పూర్తయ్యి, నీటి సరఫరా మొదలైనా నిర్వహణ వ్యయం పంట దిగుబడుల విలువ కంటే అధికంగా ఉంటుందని చెప్పేందుకు పెద్ద తెలివితేటలు అవసరం లేదు. నీటి సరఫరా వ్యయం ఎకరానికి రూ.50వేలకు మించి ఉంటుందని ఇప్పటికే కొంతమంది లెక్క కట్టారు. బనకచర్ల నిర్మాణ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే భరించినా అది ఆంధ్రా ప్రజలకు పెద్ద భారమవుతుంది.



> బనకచర్ల ప్రాజెక్టుకు అవసరమైన 200 టీఎంసీల నీరు అందుబాటులో లేదు; సముద్రానికి తరలిపోయే నీరు ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాతిపదిక కాదు; సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టుకు అనుమతి నివ్వదు. వరద జలాల భావన అనేదే లేదని, ఏ ప్రాజెక్టుకూ వరద జలాల కేటాయింపు లేదని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది.

ఈ ప్రాజెక్టుకు అవసరమైన 200 టీఎంసీల నీరు అందుబాటులో లేదు; సముద్రానికి తరలిపోయే నీరు ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాతిపదిక కాదు; సీడబ్ల్యూసీ ఈ ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితులలోను అనుమతినివ్వబోదు; సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టలేదు; అనుమతి లేకుండానే నిర్మాణాన్ని ఆరంభించిన పక్షంలో ఎగువ రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. సముద్రం లోకి వృథాగా పోతున్నాయని చెబుతున్న 3000 టీఎంసీల నీటిలో ఎగువ రాష్ట్రాలు వివిధ కారణాల వల్ల ఉపయోగించుకోని జలాలు కూడా ఉన్నాయనేది విస్మరించకూడదు. వరద జలాలు అన్న భావనే లేదు. నదుల్లో ప్రవహించే నీటిని అడ్డుకోవడం, ఉపయోగించుకోవడం కుదరదు. ఈ కారణంగానే సీడబ్ల్యూసీ ఆయా నదుల్లో లభ్యమయ్యే నీటికి సంబంధించి అంచనాలు వేసి, పరీవాహక ప్రాంత రాష్ట్రాలకు కేటాయింపులు జరుపుతోంది. బనకచర్ల ప్రస్తుత అంచనా వ్యయం రూ.80,000 కోట్లు. అంతిమంగా ఇది రూ.1,50,000 కోట్లకు పెరగవచ్చు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ మొత్తాన్ని మరింత అర్థవంతంగా, మరింత ప్రయోజనకరమైన ప్రాజెక్టులకు వినియోగించాలి.

తెలంగాణ రాష్ట్రం తప్పకుండా బనకచర్లను వ్యతిరేకిస్తుంది. అయితే అది తమ న్యాయబద్ధమైన వ్యతిరేకతలను సీడబ్ల్యూసీ అధికార పరిధిలో వ్యక్తం చేయాలి. ప్రజల వద్దకు ఈ సమస్యను తీసుకుపోయి భావావేశాలను రెచ్చగొట్టడం మంచిది కాదు. బనకచర్లపై వ్యతిరేకత వ్యక్తం చేసేందుకు వ్యవస్థాపిత ప్రమాణాలు, వేదికలు ఉన్నాయి. ఈ సమస్య తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల మధ్య కాదు. తెలంగాణ రాష్ట్రం గోదావరి నదీ జలాల ట్రిబ్యునల్ తమకు కేటాయించిన నీటిలో సగ భాగాన్ని కూడా ఉపయోగించుకోవడం లేదు. ఆంధ్రప్రదేశ్ తన వాటాను ఇప్పటికే పూర్తిగా వినియోగించుకుంటోంది. బనకచర్లపై ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికకు సంబంధించి సీడబ్ల్యూసీ తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖలో సూచించిన విధంగా ఆంధ్రకు అదనపు జలాలు సమకూరుస్తామని తెలంగాణ ప్రభుత్వం లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడమనేది జరగని విషయం. తనకు కేటాయించిన నీటి వాటా, భావి ప్రాజెక్టులపై తన హక్కును వదులుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం అంగీకరిస్తే తప్ప, దాని నుంచి ఆంధ్రప్రదేశ్ 200 టీఎంసీల నీటిని వాడుకునేందుకు తమకు అభ్యంతరం లేదనే లిఖితపూర్వక హామీ పొందడమనేది జరగదు.

సీడబ్ల్యూసీ బాధ్యతలు, అధికారాలు రాజ్యాంగ నిర్దేశితమైనవి. తమకు కేటాయించిన నదీజలాల ఆధారంగా కాకుండా ఇతరత్రా నిర్మించేందుకు తలపెట్టిన కొత్త ప్రాజెక్టులకు అనుమతిని నిర్ద్వంద్వంగా నిరాకరించేందుకు సీడబ్ల్యూసీకి అధికారమున్నది. నీటి కేటాయింపులు పొంది, ప్రస్తుతం ఆ జలాలను ఉపయోగించుకోలేకపోతున్న రాష్ట్రాల భావి ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యత కూడా సీడబ్ల్యూసీపై ఉన్నది. ఎగువ రాష్ట్రాలు ఏవైనా తమ వాటా నీటిని ఉపయోగించుకోలేకపోతే దిగువ రాష్ట్రాలు వాటిని ఉపయోగించుకునేందుకు వీలులేదు. ఉమ్మడి పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాల అవసరాలు, ఆకాంక్షలను తప్పక గుర్తించి, గౌరవించాలి. ఈ దృష్ట్యా వరద జలాలు, సముద్రానికి వృథాగా వెళుతున్న నీరు అనే భావనలు బనకచర్ల తరహా అదనపు ప్రాజెక్టుల నిర్మాణానికి ఆలంబన కాబోవు. సముద్రంలోకి ప్రవహిస్తున్న నీరు వృథా అయిపోతుందనేది పూర్తిగా కాలం చెల్లిన భావన. నదీ ప్రవాహాలను అడ్డుకుంటే పర్యావరణ విపత్తులు సంభవిస్తాయి. నదులు స్వేచ్ఛగా సముద్రానికి ప్రవహించాలి.. ఇది పర్యావరణ అవసరం. కోస్తా ప్రాంతాలు ఈ నీటిపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ కారణంగానే వరద జలాల భావన అనేదే లేదని సీడబ్ల్యూసీ స్పష్టం చేసింది. ఏ ప్రాజెక్టుకూ వరద జలాల కేటాయింపు లేదని ఖండితంగా పేర్కొంది. బనకచర్ల ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికపై సీడబ్ల్యూసీ తీసుకున్న విధానపరమైన వైఖరి అది. గోదావరీ తీరస్థ రాష్ట్రాలకు 18 ఫిబ్రవరి 2022న రాసిన లేఖలో ఇచ్చంపల్లి వద్ద 75 శాతం మిగులు జలాల లభ్యత (ఏదైనా ప్రాజెక్టు తలపెట్టినప్పుడు ఆ ప్రాజెక్టు కింద ఏర్పాటయ్యే ఆయకట్టుకు నాలుగేళ్లలో కనీసం మూడేళ్లపాటైనా నిర్దేశిత సాగునీరు అందుబాటులో ఉండే విధానాన్ని 75 శాతం లభ్యత అంటారు) లేదని కేంద్ర జలసంఘం స్పష్టం చేసింది. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికపై పోలవరం వద్ద 200 టీఎంసీల నీటి లభ్యతపై కూడా స్పష్టమైన వ్యాఖ్యలు చేసింది. గోదావరి ఎగువ రాష్ట్రాలలో పూర్తయిన, నిర్మాణమవుతున్న, ప్రతిపాదిత ప్రాజెక్టులు అన్నిటినీ పరిగణనలోకి తీసుకుని ఆ వ్యాఖ్యలు చేయడం జరిగింది.

బనకచర్ల ప్రాజెక్టు ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదికపై ఎగువ రాష్ట్రాలయిన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషాలు కూడా తమ అభిప్రాయాలు చెప్పవలసిన అవసరం ఉంది. ఈ రాష్ట్రాలు తమ వాటా జలాల నుంచి కొత్త ప్రాజెక్టుకు అవసరమైన నీటిని ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వవలసి ఉన్నది. ఇది జరగడం అసంభవం. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు వంటివి ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య గందరగోళాన్ని, విభేదాలను సృష్టిస్తాయి. అటువంటి నిష్ఫల ప్రాజెక్టులను ప్రశ్నించిన వారిపై అభివృద్ధి నిరోధకులు లేదా ఫలానా రాష్ట్ర వ్యతిరేకి అని ముద్ర వేయడమూ జరుగుతుంది. బనకచర్ల ప్రాజెక్టును ప్రశ్నిస్తున్నవారు ప్రత్యామ్నాయాలను సూచించవలసిన అవసరమున్నది. అన్ని ప్రత్యామ్నాయాలను అన్వేషించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉన్నది.

ఆంధ్రప్రదేశ్ పాలకులు మూడు విషయాలపై ఆలోచించవలసిన అవసరం ఉంది. బనకచర్ల ఆచరణ సాధ్యమైన ప్రాజెక్టు కాదు. ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్య సమస్యలు తలెత్తేందుకు ఆస్కారమున్నది; ఆంధ్రప్రదేశ్‌పై ఈ ప్రాజెక్టు పెద్ద ఎత్తున ఆర్థిక భారాన్ని మోపవచ్చు; ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం బనకచర్లకు సీడబ్ల్యూసీ, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, అపెక్స్ కౌన్సిల్ మొదలైనవి అనుమతులు ఇవ్వబోవు; రాయలసీమ రైతులను ఆదుకునేందుకు అనేక మార్గాలు ఉన్నాయి; మరీ ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు నివ్వలేదు. రాజకీయ కారణాలతో కేంద్ర ప్రభుత్వ తోడ్పాటు లభించినా దేశవ్యాప్తంగా నదీ జలాల కేటాయింపులకు ప్రస్తుతం అనుసరిస్తున్న మార్గదర్శక సూత్రాలు, నియమ నిబంధనలు, వ్యవస్థాపిత ప్రమాణాలు సమస్తమూ సమసిపోతాయి. ఇదే సంభవిస్తే సీడబ్ల్యూసీ విశ్వసనీయత, అధికారమూ హరించిపోతాయి. దేశ జలవనరుల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్న ఆ జాతీయ సంస్థ నిష్పాక్షికతపై ప్రజలు నమ్మకం కోల్పోతారు.

▪ డాక్టర్ బిక్షం గుజ్జా
▪ డాక్టర్ కె.శివకుమార్
(వ్యాసకర్తలు జలవనరుల, పర్యావరణ వ్యవహారాల నిపుణులు)

ఇంటర్నెట్‌ను కమ్మేసిన అశ్లీలం

భారత ప్రభుత్వం 25 అశ్లీల యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధం విధిస్తూ ఇటీవల నిర్ణయం తీసుకొంది. 2018లో కూడా భారత టెలీ కమ్యూనికేషన్ విభాగం 827 పోర్న్ వెబ్‌సైట్లు బ్లాక్ చేయాలని ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశాలు ఇచ్చింది. అంతకుముందు 2015లో సైతం సుప్రీం కోర్టు ఆదేశాలను అనుసరించి 850 పోర్న్ వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. ఈ లెక్కలు ఎలా ఉన్నా మనుషుల ఆలోచనాధోరణుల్లో మార్పులు రానంత వరకూ అశ్లీలతకు ఎవరూ అడ్డుకట్ట వేయలేని పరిస్థితులు ఉన్నాయి.

నీలి చిత్రాలను పంపిణీ చేసే పోర్న్ హబ్ అనే సంస్థ సర్వే ప్రకారం– అశ్లీల చిత్రాలు చూసేవారిలో అమెరికా, బ్రిటన్ తరువాత స్థానంలో భారతీయులు ఉన్నారు. వివిధ ఇంటర్నెట్ సర్వేలు కూడా మన దేశంలో అశ్లీల చిత్రాలు చూసే వారి సంఖ్య పెరుగుతోందని చెబుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో 63శాతం మంది చూస్తున్నారు, ఇందులో 75 శాతం మొబైల్స్‌లో చూస్తున్నారు.

ఈ మార్కెట్‌ను ఆధారం చేసుకొనే దేశంలో అశ్లీల చిత్రాలు రూపొందించే వారు, నటించేవారు పెరిగిపోయారు. వాటిని యాప్‌లు, వెబ్‌సైట్ల రూపంలో మన ఫోన్లలోకి డంప్ చేస్తున్నారు. శుక్రవారం నిషేధానికి గురైన ఉల్లు యాప్ యజమాని ఆస్తి రూ.100కోట్లు అని అంచనా. ఈ యాప్‌లో బోల్డ్ కంటెంట్ పేరుతో అశ్లీలాన్ని గుమ్మరిస్తున్నారు. ఉల్లు యాప్ వాళ్ళు హద్దులు మీరడంతో ఈ యేడాది మే నెలలో జాతీయ మహిళా కమిషన్ సమన్లు ఇచ్చింది. నిషేధానికి గురైన మరో యాప్ ఏఎల్‌టీటీ బాలాజీ. ఈ యాప్ యజమాని ఏక్తా కపూర్. పలు టీవీ సీరియళ్ళు సినిమాలు తీసిన ఏక్తా కపూర్‌కి 2020లో పద్మశ్రీ పురస్కారం కూడా దక్కింది. ఏఎల్‌టీటీ యాప్‌లో బోల్డ్ కంటెంట్ పేరుతో అశ్లీలాన్ని గుప్పిస్తున్నారు. నిషేధం వార్త వచ్చాక ఆ కంపెనీతో తనకు సంబంధం లేదని, 2021లో బయటకు వచ్చానని ఏక్తాకపూర్ వివరణ ఇచ్చారు. అయితే సదరు యాప్ బాలాజీ టెలీ ఫిల్మ్స్ నుంచే పుట్టిందని ఆరోపణ. గతంలో నటి శిల్పాశెట్టి భర్త రాజ్ కుంద్రా కూడా ఈ అశ్లీల చిత్రాలు నిర్మించి అరెస్టయ్యారు. వెబ్‌సైట్లు, యాప్స్ నిషేధానికి గురవుతుండటంతో వీటిలో నటించే వారు, నిర్మాతలు కొత్త మార్గాలు వెతుకుతున్నారు. ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ఖాతాలు తెరిచి అశ్లీల చిత్రాలు గుమ్మరిస్తున్నారు. అంతే కాదు అందులో నటించేవారు– వీడియో కాల్స్ వ్యాపారాలకు తెర తీశారు. నిర్దేశిత రుసుములతో సెమీ న్యూడ్, న్యూడ్ లైవ్ షోల ద్వారా వ్యాపారం చేస్తున్నారు.



> యాప్స్, వెబ్‌సైట్లతోపాటు ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌లో ఉన్న నీలి కంటెంట్‌ను అదుపు చేయాలి. ఇంతకంటే ముందు అసలు ఇలాంటి కంటెంట్‌ను నిర్మించేవారిని, నటించేవారిని, సాంకేతిక నిపుణులను... వీరికి పెట్టుబడులు సమకూర్చి, ఇలాంటి వీడియోల ఆధారంగా వ్యాపారం చేసేవారిని ముందుగానే గుర్తించి అదుపు చేయాలి. నీలి చిత్రాల నటులు, సాంకేతిక నిపుణులకు ప్రచారం కల్పించే వెబ్ ఆధారిత చానెళ్లు, ఖాతాలను కూడా కట్టడి చేయాలి.

కొంతలో కొంత మెరుగు ఏమిటంటే– తెలుగులో ఈ తరహా కంటెంట్‌కు తగిన ఆదరణ దక్కలేదు. కరోనా సమయంలో ఇక్కడ కూడా రొమాంటిక్ పేరుతో ఈ తరహా చిత్రాలు, బూతు కథలు చెప్పే వీడియోలు మొదలైనప్పటికీ, తగిన ఆదరణ రాకపోవడంతో కొద్ది కాలమే నడిచింది ఈ దందా. ఇందులో కొందరు పెయిడ్ వీడియోలు మొదలుపెట్టారు. అలాగే హాస్యం పేరుతో బూతులతో వీడియోలు చేస్తున్నారు. రీల్స్ ద్వారా ప్రవహిస్తున్న అశ్లీలత మరో ఎత్తు. ఏఐ టెక్నాలజీ వాడి స్టాండప్ కామెడీ వీడియోల తరహాలో యువతులను సృష్టించి వారితో పచ్చి బూతులు మాట్లాడిస్తున్నారు.

పోర్నోగ్రఫీకి సంబంధించిన కేసులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టాల ప్రకారం నమోదు చేస్తున్నారు. 2015లో వచ్చిన తీర్పు మేరకు ఇంట్లో నాలుగు గోడల మధ్య పోర్న్ చూడటం నేరం కాదు. అయితే ఆ తరహా వీడియోలు తీయడం, ప్రచారం, పంపిణీ మాత్రం నేరం. సెక్షన్ 292 అశ్లీలం అంటే ఏంటో వివరిస్తుంది. ఈ సెక్షన్ ప్రకారం వీటిని రూపొందించడం, డిస్ట్రిబ్యూషన్ చేయడం నేరంగా పరిగణిస్తూ తొలిసారి అయితే మూడేళ్ల జైలు శిక్ష, రెండోసారి అయితే ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తారు. సెక్షన్ 67ఏ ప్రకారం అశ్లీల కంటెంట్‌ను ఎలక్ట్రానిక్ రూపంలో పబ్లిష్ చేయడం, షేర్ చేయడం నేరం. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధిస్తారు. రెండోసారి నేరం చేస్తే ఏడేళ్ల వరకూ జైలు శిక్ష విధించవచ్చు.

యాప్స్, వెబ్‌సైట్లతోపాటు ప్రభుత్వం సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్స్‌లో ఉన్న నీలి కంటెంట్‌ను అదుపు చేయాలి. ఇంతకంటే ముందు అసలు ఇలాంటి కంటెంట్‌ను నిర్మించేవారిని, నటించేవారిని, సాంకేతిక నిపుణులను... వీరికి పెట్టుబడులు సమకూర్చి, ఇలాంటి వీడియోల ఆధారంగా వ్యాపారం చేసేవారిని ముందుగానే గుర్తించి అదుపు చేయాలి. నీలిచిత్రాల నటులు, సాంకేతిక నిపుణులకు ప్రచారం కల్పించే వెబ్ ఆధారిత చానెళ్లు, ఖాతాలను కూడా కట్టడి చేయాలి.

ఇన్ని చేసినా అశ్లీలతను కట్టడి చేయగలమా అంటే జవాబు చిక్కని ప్రశ్నే! పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ఏది మంచి ఏది చెడు అని చెప్పాలి. నైతిక విలువల బోధన పాఠ్యాంశాల్లో చేర్చాలి. భారతీయ జీవన విధానం, కుటుంబ బంధాల విలువను తెలియచెప్పాలి. ఇది విద్యాలయాల స్థాయిలో చేయాలి. అదే సమయంలో గృహ వాతావరణంలోను మార్పు రావాలి. పట్టణ, నగర వాతావరణంలో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులుగానో, వ్యాపార వ్యవహారాల్లోనో తలమునకలవుతున్నారు. తమ బిడ్డలకు కావల్సిన సౌకర్యాలు సమకూరుస్తున్నారు. ఇందులో భాగంగా వారికి ఇచ్చే మొబైల్స్, లాప్‌టాప్స్ మీద ఓ కన్ను వేసి ఉంచాల్సిందే. వారికి తగినంత సమయం కేటాయించి మంచి చెడు చెప్పడం అవసరం. లేదంటే రేపటి తరం మెదళ్లు చెదలు పట్టే ప్రమాదం ఉంది.

○ వట్టికూటి చక్రవర్తి

ఆలయం కోసం యుద్ధంలో సందేశం ఏమిటి?

ఒక ప్రాచీన శివాలయం కోసం కాంబోడియా–థాయ్‌లాండ్ మధ్య ఘర్షణలు రేగడం వెనుక పనిచేసినదేమిటి? కొంత భూభాగంపై ఆధిపత్యం కంటే, తమ పూర్వీకుల మూలాలూ, ఆనవాళ్లకు సంబంధించిన ఉద్వేగపూరితమైన అంశం ఇది. ఈ వైరం భూమి కోసం కాదు, సాంస్కృతిక వారసత్వం కోసం. మరి, దీని నుంచి మనం నేర్చుకోవాల్సినదీ, స్ఫూర్తి పొందాల్సినదీ ఏమీ లేదా?

జైనం, బౌద్ధం, వీరశైవం భారతీయ సమాజాన్ని ప్రభావితం చేసి సర్వమానవ సమానత్వానికి బాటలేశాయి. మానవ సమాజపు ఉన్నతి ఎట్లా ఉండాలో బసవేశ్వరుడు వందలయేండ్ల కిందనే ఆచరించి చూపించారు. తన ప్రజామండపంలో మహిళలకూ సమాన అవకాశాలిచ్చారు. అట్టడుగు సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. జైనం ఉనికిలో ఉన్నప్పుడు అల్ప, స్వల్ప ప్రాణులకూ కష్టం, నష్టం కలిగించరాదనే భావనను నూరి పోసింది. బౌద్ధం మానవాళి జీవన గమనాన్నే మార్చి వేసి, ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులకు సరికొత్త భాష్యాన్ని చెప్పింది. బసవేశ్వరుడు, ఆ తర్వాత చాలా మంది మార్గదర్శులు సమాజపు ఆలోచనా ధోరణిని మార్చి, సరికొత్త దారులు చూపించారు. అక్కమహాదేవి, అల్లమహాప్రభు, హరళయ్య, కక్కయ, వేమన, ఆదున్న ఇద్దాసు... ఇట్లా చాలామంది శివతాత్విక పునాది ఆధారంగా అందర్నీ ఏకం చేసేందుకు యత్నించారు, సఫలమయ్యారు. నాటి సామాజిక పరిస్థితుల కోణంలో చూసినప్పుడు వీరిది అతి పెద్ద సాహసం. వీరి బోధలు ఆ తర్వాత ఉత్పత్తి కులాల ప్రజల పనిపాటల్లో ప్రధాన భాగం అయ్యాయి. ఆలోచనలను, ఉత్పత్తిశక్తిని పెంచాయి. సరికొత్త సంస్కృతికి, ఉన్నతికి దారి చూపించాయి.

పాల్కురికి, ధూర్జటి, శ్రీనాథుని రచనలన్నీ నాటి వీరశైవ ప్రభావంతోనే వచ్చాయి, నాటి సమాజాన్ని ప్రభావితం చేశాయి. కర్ణాటక, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో శివాలయాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఈ ప్రజల జీవితాల్లో శివుడు ప్రధానం. కాలక్రమంలో వీరశైవ ప్రభావం ఎందుకు తగ్గిపోయిందో చారిత్రక, సాంస్కృతిక కోణాల్లో పరిశోధించాలి. కాయకమే కైలాసం అని చెప్పిన బసవేశ్వరుల జీవితసారం గురించి మనం ఎందుకు మర్చిపోయామో ఆలోచించాలి. "రాజుల్ మత్తుల్ వారి సేవ నరక ప్రాయంబు" అని ప్రభువులనే సవాల్ చేసిన ధూర్జటి ఇచ్చిన చైతన్యం గురించీ తెలుసుకోవాలి. జన జీవితంలో పరుల కోసం జీవించాలనే తలంపును బలీయంగా తీసుకొచ్చింది వీరశైవమే. అంటే శివుని మార్గం. మరి, మనదైన ఉన్నతి సంస్కృతిని, సదాచారాన్ని సమాజం ఎందుకు మర్చిపోయింది? భక్తి భావన అంటే అందరూ బాగుండాలని, పరులకు మేలు చేయకపోయినా, కీడు తలంచొద్దనే. తత్వాల రూపంలో, గేయాల రూపంలో, పద్యాల రూపంలో, నాటకాల రూపంలో పూర్వీకులు బోధించిన ఇలాంటి పాఠాలను జీవితంలో ఆచరిస్తున్నామా? రెండు దేశాల మధ్య ఒక శివాలయం కోసం జరిగిన యుద్ధాన్ని మనం చూడాల్సింది వార్తగా కాదు. వీరశైవం బోధించిన సర్వమానవ సమానత్వాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ మనం అవలోకనం చేసుకోవాలి, ఆచరించాలి.

– గోర్ల బుచ్చన్న (జర్నలిస్టు)

రైతుకు తోడై నిలిచిన పరిశోధన



> ఉష్ణమండల సముద్రాల పైన ఉండే మేఘమాలికల వర్షస్వభావం అనేది ఆయా సముద్రతలాల ఉష్ణోగ్రతల మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రత 28డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు అత్యధిక వర్షపాతం పడే అవకాశం ఉందని సులోచనా గాడ్గిల్ బృందం చేసిన పరిశోధనలతో తేలింది. నేరుగా జన సామాన్యంతో, దేశ ఆర్థిక భద్రతతో ముడిపడిన పరిశోధనాంశం కనుక ఆమె సదా రైతులతో ముచ్చటిస్తూ క్షేత్రస్థాయి నివేదికలను అధ్యయనం చేసేవారు.

ఋతుపవనాల ఎగుళ్ళు దిగుళ్ళు, ఉష్ణ మండల ప్రాంతపు సముద్ర తలాల ఉష్ణోగ్రతలూ, తత్కారణంగా జరిగే ఉష్ణ సంవహన ప్రక్రియలకు సంబంధించి నాలుగున్నర దశాబ్దాల క్రితం తన పరిశోధనతో భారతదేశపు వ్యవసాయాన్ని, పంటలనూ, దేశ ఆర్థిక ప్రణాళికలను ప్రభావితం చేసిన ప్రొ. సులోచనా గాడ్గిల్ 81 సంవత్సరాల వయసులో ఈ జూలై 24న బెంగళూరులో కన్నుమూశారు. ఆమె పరిశోధనల్లో స్థూలంగా గణిత, భౌతిక శాస్త్రాలు; వాతావరణ, సముద్ర శాస్త్రాలు; వ్యవసాయం, ఆర్థిక శాస్త్రం మొదలైన విభాగాలు కలగలిశాయి. భారత ఋతుపవనాల గురించి అమోఘంగా కృషి చేసి, మూడు వందల ఏళ్ళుగా మనకు ఉన్న అవగాహనను విస్తృతం చేసిన ప్రపంచ స్థాయి శాస్త్రవేత్త డా. సులోచనా గాడ్గిల్.

భారత స్వాతంత్ర్యోద్యమంలోనే కాదు, మహిళా విమోచనా కార్యక్రమాలలో కూడా ఒకటిన్నర శతాబ్దం చరిత్ర ఉన్న పూణె నగరంలో సులోచన 1944 జూన్ 7న వేశ్వంత్ పాథక్, ఇందుమతి దంపతులకు జన్మించారు. వీరికి కలిగిన నలుగురు ఆడపిల్లల్లో ఈమె మూడవ సంతానం. ఈమె తాత వైద్యుడిగా సేవలందిస్తూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న వ్యక్తి. కనుక వాళ్ళింటికి ఎప్పుడూ ఆయన మిత్రులైన పోరాట యోధులు వస్తూ వెడుతూ ఉండేవారు. తండ్రి అల్లోపతిలో ఎం.డి. పట్టాతో పాటు ఆయుర్వేద, యోగ విధానాలలో పూర్తిగా అవగాహన ఉన్న వైద్యులు. తల్లి మరాఠీ సాహిత్యరంగంలో ప్రముఖులు. పూణెలో ప్రాథమిక విద్య తర్వాత ఆమె హైస్కూల్ విద్య కోసం ఏపీ లోని మదనపల్లి దగ్గర ఉన్న ఋషి వ్యాలీలో చేరారు. మార్కులు, ర్యాంకులతో సంబంధం లేకుండా ఇష్టమైన అంశాన్ని, ఇష్టమైన రీతిలో చదివే అవకాశం తనకు అక్కడ లభించిందని; అదే దృష్టి తన చదువును, జీవితాన్ని తీర్చిదిద్దిందని ఆమె చెప్పేవారు. పూణెలోని ఫెర్గ్యూసన్ కాలేజీలో కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్‌తో బీఎస్సీ చేసిన తర్వాత; పూణె విశ్వవిద్యాలయం నుంచి అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో ఎంఎస్సీ 1965 లో పూర్తి చేశారు. ఒకసారి బోర్ కొట్టే క్లాసు ఎగ్గొట్టడానికి కిటికీలోంచి దూకుతున్న సులోచన రెండేళ్ల సీనియరైన మాధవ్ గాడ్గిల్ దృష్టిని ఆకర్షించారు. సులోచన ఎమ్మెస్సీ చదివే సమయంలో మాధవ్ గాడ్గిల్‌తో ఆమె పెళ్లి జరిగింది. ఆ తర్వాత ఇద్దరూ ఫెలోషిప్ మీద హార్వర్డు యూనివర్సిటీలో చేరారు.

పక్షులు, సీతాకోకచిలుకలు, ఏనుగులు, మేఘాలు, నక్షత్రాలు, తోకచుక్కలు పరిశీలించడం తన హాబీ అని చెప్పుకునే సులోచనా గాడ్గిల్ ప్రకృతి ప్రపంచం మీద ఆసక్తి కలిగి హార్వర్డ్ యూనివర్సిటీలో 'ఫిజికల్ ఓషనోగ్రఫీ' అంశాన్ని ఎంచుకున్నారు. తనకు ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ లలో లోతైన అవగాహన ఉందనీ; అదే సమయంలో తన భర్త మాధవ్‌కు మ్యాథమెటికల్ ఎకాలజీ, ఎవల్యూషనరీ బయాలజీ ఆసక్తికరమైన విషయాలు కావడం వల్ల తన అధ్యయనం హాయిగా సాగిందనీ ఆమె చెప్పేవారు. ప్రొఫెసర్ ఎ.ఆర్. రాబిన్‌సన్ వద్ద ఫిజికల్ ఓషనోగ్రఫీ పూర్తి చేసిన తర్వాత; అక్కడే ప్రఖ్యాత శాస్త్రవేత్త ప్రొ. జూల్స్ చర్నీ వద్ద 'ప్లానిటరీ ఫ్లూయిడ్ డైనమిక్స్'లో పీహెచ్డీ పూర్తి చేశారు. తర్వాత ఋతుపవనాల మీద ఆసక్తి కలిగి చర్నీ వద్దనే ఎమ్ఐటీలో పోస్టుడాక్టోరల్ రీసెర్చ్ ముగించారు. అమెరికాలో ఆరేళ్ల పాటు మూడు విలక్షణమైన విభాగాలను శోధించి భర్తతో కలిసి 1971లో భారతదేశం తిరిగి వచ్చారు. అప్పటికి ఆమె ఋతుపవనాల తీరుతెన్నుల గురించి పట్టు సాధించడంతో వాతావరణంలో మార్పులను విశ్లేషించే రీతిలో పరిశోధన చేపట్టడానికి సాహసం చేశారు. ఈ పరిశోధన కొనసాగింపుగా పంటలకొచ్చే తెగుళ్ళు, రోగాలు, కరువు పరిస్థితులు వంటివి ముందుగా వివరించే రీతిలో దేశానికి దోహదపడ్డారు.

1971లో భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత సులోచనా గాడ్గిల్ సీఎస్ఐఆర్ పూల్ ఆఫీసర్‌గా పూణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రోపికల్ మెటీరాలజీలో ఓ రెండేళ్ల పాటు పనిచేయడంతో వాతావరణానికి సంబంధించి నిష్ణాతులైన ఆర్. అనంతకృష్ణన్, డి.ఆర్. శిక్కాలతో పరిశోధన చేసే అవకాశం కలిగింది. 1973లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ డైరెక్టర్‌గా ప్రముఖ అంతరిక్ష విజ్ఞానవేత్త సతీష్ ధావన్ ఫ్లూయిడ్ డైనమిక్స్‌లో ఋతుపవనాల గురించి పరిశోధన చేయాలని సెంటర్ ఫర్ థియరిటికల్ స్టడీస్ విభాగాన్ని ప్రారంభించి, సులోచనా గాడ్గిల్‌ను ఆహ్వానించి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తీసుకున్నారు. అదే సమయంలో అదే విభాగంలో మ్యాథమెటికల్ ఎకాలజీకి సంబంధించి మాధవ్ గాడ్గిల్ కూడా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అవకాశం పొందారు. క్రమంగా ఈ విభాగమే 'సెంటర్ ఫర్ అట్మాస్ఫియరిక్ అండ్ ఓషనిక్ సైన్సెస్'గా మారి ఇక్కడ విశేషమైన పరిశోధనలు జరిగాయి.

ఉష్ణమండల సముద్రాల పైన ఉండే మేఘమాలికల వర్షస్వభావం అనేది ఆయా సముద్రతలాల ఉష్ణోగ్రతల మీద ఆధారపడి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రత 28డిగ్రీల సెల్సియస్ ఉన్నప్పుడు అత్యధిక వర్షపాతం పడే అవకాశం ఉందని సులోచనా గాడ్గిల్ బృందం చేసిన పరిశోధనలలో తేలింది. నేరుగా జన సామాన్యంతో, దేశ ఆర్థిక భద్రతతో ముడిపడిన పరిశోధనాంశం కనుక ఆమె సదా రైతులతో ముచ్చటిస్తూ క్షేత్రస్థాయి నివేదికలను అధ్యయనం చేసేవారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో కర్ణాటక రాష్ట్రం లోని పావగడ ప్రాంతపు రైతుల నుంచి తెగుళ్ళు, చీడపీడల గురించి సమాచారం అందుకొని పరిశోధన కొనసాగించడం విశేషం. 2016లో భూ విజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వ శాఖ జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేస్తూ 'ఏ ఆర్థిక శాస్త్రవేత్తా సాధించని రీతిలో సులోచనా గాడ్గిల్ విజయం సాధించారని పేర్కొన్నది. గత ఐదు దశాబ్దాలలో మనదేశపు జీడీపీలో వ్యవసాయం పాత్ర తగ్గినా; కరువు ప్రభావం మాత్రం అలాగే రెండు నుంచి ఐదు శాతంగా దాదాపు స్థిరంగా ఉందని ఈమె పరిశోధన తేల్చింది.

సులోచన భర్త మాధవ్ గాడ్గిల్ జీవావరణ శాస్త్రవేత్త మాత్రమే కాకుండా రచయితగా, కాలమిస్టుగా కూడా ప్రఖ్యాతులు. పశ్చిమ కనుమల జీవావరణాన్ని అధ్యయనం చేయడానికి 2010లో ఏర్పరిచిన గాడ్గిల్ కమిషన్‌తో సుప్రసిద్ధులు. సులోచనా గాడ్గిల్ కూతురు జర్నలిస్టుగా ఉంటూ స్పానిష్ భాషను బోధిస్తుంటారు. కుమారుడు సిద్ధార్థ గాడ్గిల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో గణిత శాస్త్రవేత్తగా పరిశోధనలు చేస్తున్నారు. విద్యా సంస్కార సంపద పుష్కలంగా ఉన్న నేపథ్యం నుంచి వచ్చిన సులోచనా గాడ్గిల్ ఋతుపవనాల గురించి విశేషమైన పరిశోధన చేసిన ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తగా కలకాలం గుర్తుండిపోతారు.

● డా. నాగసూరి వేణుగోపాల్





పోలీస్ డ్యూటీ మీట్‌కు సర్వం సిద్ధం

- మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈవెంట్లు
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడి

7



మహబూబాబాద్ జిల్లా బీజేపీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లే రాష్ట్రాన్ని దోచుకున్నాయి..

- బీసీల ఓట్ల రాజకీయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే..
- దేశ సైనికులను అనుమానిస్తున్న కాంగ్రెస్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

6



దేవస్థానం పరిసరాల్లో అధికారులు, పూజారులతో మాట్లాడుతున్న ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

భక్తుల కోసమే గద్దెల వద్ద మార్పులు

- రెండు రకాల డిజైన్లు సిద్ధం
- దర్శనం మరింత సులభతరం చేయడమే లక్ష్యం
- మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి పనులు
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర
- మేడారంలో అధికారులు, పూజారులతో కలిసి పర్యటన

6

'మధ్యాహ్న భోజనం'లో కష్టాల కుతకుత

కార్మికులకు ఏడు నెలలుగా రాని బిల్లులు, వేతనాలు



- ఉమ్మడి జిల్లాలో రూ.123 కోట్ల బకాయిలు
- ఏడాదిగా చెల్లించని గుడ్ల డబ్బులు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం
- డిమాండ్ల పరిష్కారానికి ఆందోళనబాట
- ఆగస్టు 6న చలో హైదరాబాద్
- స్పందించకుంటే పంద్రాగస్టు నుంచి నిరవధిక సమ్మె

హనుమకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్నం భోజనం నిర్వాహకుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది. వారి సమస్యలను పట్టించుకోకపోగా కనీసం వారికి చెల్లించాల్సిన జీతాలను నెలలతరబడి పెండింగ్‌లో పెడుతోంది. మధ్యాహ్నం భోజనం బిల్లుల గురించి ఏ మాత్రం పట్టించుకోవడమే లేదు. దీంతో నిర్వాహకులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తమ ఇక్కట్లను తొలగించాలని ప్రభుత్వాన్ని ఎంత వేడుకున్నా స్పందన లేకపోవడంతో మరో మార్గం లేక ఆందోళన బాట పడుతున్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చేందుకు ఆందోళన కార్యక్రమంలో భాగంగా ఈనెల 28వ తేదీన అన్ని కలెక్టరేట్ కార్యాలయాల సూత్రప్రాయంగా ధర్నాలు చేశారు. అయినా స్పందనలేకపోవడంతో ఆగస్టు 6వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి కదలిక లేకపోతే పంద్రాగస్టు తర్వాత నిరవధిక సమ్మె చేపట్టే యోచనలో ఉన్నారు.

ఏడాదిగా బిల్లులు పెండింగ్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి రూ.120.34 కోట్ల మేరకు బిల్లులు రావలసి ఉంది. హనుమకొండ జిల్లాలో రూ.21.90 కోట్లు, వరంగల్ జిల్లాలో రూ.21.95కోట్లు, జనగామ జిల్లాలో రూ.21.87కోట్లు, మహబూబాబాద్ జిల్లాలో రూ.32.14కోట్లు, ములుగు జిల్లాలో రూ.11.05కోట్లు, జయశంకర్ భూపాపల్లి జిల్లాలో రూ.11.23కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

పెంచినప్పటి నుంచి..

కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు గణనీయంగా పెరిగాయి. దీనితో ప్రభుత్వం చెల్లించే రేటుకు మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు అందించడం కష్టమవుతోందని ఎంతోకాలంగా మొరపెట్టుకోగా కరుణించిన ప్రభుత్వం.. గత మార్చి నెలలో పెంచింది. ఒక్కో విద్యార్థికి 1వ తరగతి నుంచి 6వ తరగతి వరకు రూ.6.17 పైసలు, 7, 8వ తరగతి విద్యార్థులకు రూ.10.17 పైసలు, 9, 10వ తరగతులకు రూ.10.67పైసలకు పెంచింది. ప్రభుత్వం రేట్లు పెంచినప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు ఏడు నెలలుగా బిల్లులు చెల్లించడం లేదు.

ఏడు నెలలుగా వేతనాల్లేవు

మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడు నెలలుగా వేతనాలు కూడా రావడం లేదు. వీరికి ఇచ్చేదే అతి తక్కువ.. అది కూడా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టుడంతో ఆర్థికంగా కష్టాలను ఎదుర్కొంటున్నారు. మధ్యాహ్న కార్మికులకు నెలకు రూ.3వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఇందులో కేంద్రం తన వంతుగా రూ.1000 అందిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.2000లను సమకూరుస్తోంది. కేంద్రం సకాలంలో తన వంతువాటా జమ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వమే తాత్సారం చేస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం అమలు చేస్తామని ఇచ్చిన హామీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు.

గుడ్ల డబ్బులూ పెండింగ్

ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు కేంద్ర పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. విద్యార్థులకు రోజూ ఆహారంతో పాటు వారంలో మూడు రోజులు గుడ్లు అందిస్తున్నారు. ఎంతో వేడుకున్న తర్వాత గుడ్డు ధరను రూ.6.07పైసలు పెంచిన ప్రభుత్వం.. ఆ డబ్బులను కూడా ఏడాదిగా చెల్లించడం లేదు. అప్పులు తీసుకువచ్చి భోజనంలో గుడ్లను సమకూర్చిన నిర్వాహకులు సకాలంలో బిల్లులు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. గుడ్లను అంగన్‌వాడీ

(మిగతా 6వ పేజీలో...)

> **బిల్లులు, వేతనాలు చెల్లించాలి**
>
> నిడిగొండ రజిత, జిల్లా అధ్యక్షురాలు
> మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్
>
> మధ్యాహ్న భోజన నిర్వాహకులకు బిల్లులు, కార్మికులకు వేతనాలను వెంటనే చెల్లించాలి. మధ్యాహ్నం భోజనం వండడానికి ప్రతీ స్కూల్‌కు గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని, అవసరమైన గ్యాస్‌ను సరఫరా చేయాలని, గుర్తింపుకార్డులను ఇవ్వాలని, కాటన్ బట్టల యూనిఫామ్ సరఫరా చేయాలని, సామాజిక భద్రత కల్పించాలని, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు ద్వారా రుణాలు ఇవ్వాలని, మధ్యాహ్న భోజన బిల్లులు, కార్మికుల వేతనాలు ఈ-కుబేర్ నుంచి కాకుండా గతంలో లాగానే గ్రీన్ చానెల్ నుంచి చెల్లించాలి. కొత్త మెనూకు అదనంగా బడ్జెట్ విడుదల చేయాలి.

నిబంధనల ప్రకారమే క్రయ విక్రయాలు

- నిర్దేశిత చార్జీలనే వ్యాపారులు వసూలు చేయాలి
- మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ ఉప్పుల శ్రీనివాస్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జేడీ ఉప్పల శ్రీనివాస్

వరంగల్ వ్యవసాయం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ బైలా ప్రకారమే క్రయవిక్రయాలు నిర్వహించాలని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్, ఆ మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి ఉప్పుల శ్రీనివాస్ వ్యాపారులకు సూచించారు. బుధవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో అధికారులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎలాంటి అదనపు చార్జీలను వసూలు చేయకుండా బైలా ప్రకారమే రైతుల నుంచి చార్జీలు వసూలు చేయాలని సూచించారు. కమీషన్ ఏజెంట్ల నుంచి రోజువారి యార్డుకు వచ్చే రైతులు, సరుకుల నివేదిక ప్రకారమే లాట్ ఐడీలు తీసుకోవాలని, వ్యాపారులు యార్డుల్లో కొనుగోలు చేసిన సరుకులు గేట్ల నుంచి బయటకు పంపే క్రమంలో గేట్ పాసులు ఒకేవిధంగా(ఏకరూప) ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్యా, గ్రేడ్-2 కార్యదర్శులు రాము, అంజత్‌రావు, చాంబర్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మడూరి వేద ప్రకాష్, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు లింగారెడ్డి, చాంబర్ కార్యవర్గ సభ్యులు గౌరిశెట్టి శ్రీనివాస్, కైలాస హరినాథ్, ఎక్స్‌పోర్టు సెక్షన్ ప్రతినిధులు దేవ రమేష్ బాబు, గోపాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి కథనాలపై చర్చ

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఇటీవల వచ్చిన వరుస కథనాలపై చర్చ జరిగినట్లు సమాచారం. మిర్చీ బస్తాల గల్లంతుపై సుదీర్ఘంగా చర్చించారు. లాట్ ఐడీలు తీసుకున్న తరువాత మార్కెట్ అధికారులు, సిబ్బందికి సమాచారం లేకుండా బస్తాలు ఎలా బయటకు వెళ్లాయంటూ చర్చ జరిగినట్లు తెలుస్తోంది. గల్లంతైన బస్తాలకు సంబంధించిన పూర్తి సమాచారం వెంటనే తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.



అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

- కలెక్టర్ స్నేహ శబరీష్
- మరియపురంలో ప్రభుత్వ పాఠశాలలో తనిఖీ

మరియపురం పాఠశాలలో బోర్డుపై రాయించి విద్యార్థి అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఐనవోలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు బోధించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు. మరియపురం ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాలలో 3, 5వ తరగతి, ఉన్నత పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులను గణితానికి సంబంధించిన అంశాలను కలెక్టర్ అడిగి, పాఠ్యాంశం పఠనం చేయించారు. బోధన అంశానికి సంబంధించి విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించేందుకు బోర్డుపై రాయించి చదివించగా విద్యార్థులు తడబాటుకు గురయ్యారు. ఉపాధ్యాయుల బోధనా పద్ధతిని

(మిగతా 6లో...)

కార్పొరేట్ వర్గాలకు ఊడిగం

- పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్న మోదీ సర్కారు
- కమ్యూనిజాన్ని ఎవరూ అంతం చేయలేరు..
- కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



ఖిలా వరంగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కారు ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా సీపీఐ ద్వితీయ మహాసభను వరంగల్ నగరంలోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ పాలనలో అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారన్నారు. 11ఏళ్లకాలంలో అదానీ, అంబానీలాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో

(మిగతా 8లో..)



ర్యాలీగా వెళ్తున్న సీపీఐ నాయకులు

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

'ఇరిగేషన్'లో అక్రమాల వరద

- టెక్స్‌టైల్ పార్కులో వరద కాలువ టెండర్లలో గోల్‌మాల్
- బిల్లుల చెల్లింపులు, బదిలీలు, పదోన్నతుల్లోనూ అదే తీరు
- 'పెద్ద సారు' రిటైర్‌మెంట్ ఫంక్షన్ కోసం జోరుగా వసూళ్లు
- నివ్వెరపరుస్తున్న నీటిపారుదల శాఖ

వివిధ పనుల్లో రీ ఎస్టిమేషన్, టెండర్లలో అక్రమాలు



నీటిపారుదల శాఖను అక్రమాల వరద ముంచెత్తుతోంది. పనులకు బిల్లులు చెల్లించాలన్నా.. పాత పనులకు రీఎస్టిమేషన్ వేయాలన్నా.. టెండర్లు దక్కాలన్నా.. చివరికి సొంత శాఖలో పదోన్నతులు కల్పించాలన్నా.. చేతులు తడపాల్సిందేనట. అవకాశం ఉన్న ప్రతి చోట ఇరిగేషన్‌శాఖలో ఓ ఉన్నతాధికారి ప్రాధ్బలంతో కొందరు ఇంజనీర్లు జలగల్లా పీల్చుకతింటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో వరద కాలువ పనుల్లో, భద్రకాళి చెరువు మట్టి తవ్వకాల్లోనూ, పదోన్నతులు కల్పించటంలో ఇరిగేషన్ శాఖలో ఓ ఉన్నతాధికారి అక్రమాలకు తెర తీశారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ఓ అధికారి పదవీ విరమణ పేరుతో కాంట్రాక్టర్లు, ఉద్యోగుల నుంచి కొందరు ఇంజనీర్లు వసూళ్లకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలకు పాల్పడి ఏసీబీకి చిక్కిన హరిరామ్, శ్రీధర్, మురళీధర్‌రావులతో కలిసి పని చేసిన సదరు ఉన్నతాధికారిపై ఇప్పటికే ఏసీబీ నిఘా ఉంది. ఈ క్రమంలో సదరు అధికారిపై వస్తున్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

టెండర్లు, రీ ఎస్టిమేషన్‌లో అక్రమాలు

వరంగల్ ఇరిగేషన్ శాఖలో కొందరు అధికారులు అవినీతిలో మునిరిపోయారనే చర్చ జరుగుతుంది. వరంగల్ కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో వరద కాలువ నిర్మాణం కోసం గత నవంబరు 18వ తేదీన ప్రభుత్వం రూ.160.92కోట్లు కేటాయింపులు చేసింది. ఈ పనుల కోసం ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. టెండర్ దక్కించుకునేందుకు నాలుగైదు బడా కాంట్రాక్టు కంపెనీలు ఆసక్తి చూపించాయి. అయితే ఇరిగేషన్ శాఖలోని ఓ ఉన్నతాధికారి తనకున్న ప్రత్యేక అధికారాలను వినియోగించి, కొన్ని కంపెనీల టెండర్లలో సాంకేతిక సమస్యలను చూపించి వాటిని క్యాన్సిల్ చేసినట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు అనుకూలమైన ఓ కంపెనీకి ఈ పనులు అప్పగించారనే ప్రచారం జరుగుతోంది. ఈ టెండర్లలో రింగ్ తిప్పిన సదరు అధికారి.. ఇవే పనులకు మరికొన్ని కలిపి రూ.197కోట్ల వరకు

(మిగతా 6లో..)

పోలీసులపై భరోసా కలిగించేలా వ్యవహరించాలి

పదోన్నతి పొందిన ఎస్సైలకు సీపీ సన్‌ప్రీత్ సింగ్ సూచన

వరంగల్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీసుల పట్ల భరోసా కలిగించేలా విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ పదోన్నతి పొందిన ఎస్‌ఐలకు సూచించారు. ఏఎస్‌ఐ నుంచి ఎస్‌ఐలుగా పదోన్నతి పొందిన ఇ.రాజు, బి.విజయ్ కుమార్, బి.రాజమౌళి, పి.సారయ్య, ఎం.నరేంద్రచారి బుధవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ప్రేమ జంటలకు కౌన్సెలింగ్

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

వరంగల్ క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అగ్గలయ్య, పద్మాక్షిగుట్టలపై పట్టుబడ్డ ప్రేమ జంటలను హనుమకొండ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ నిర్వహించారు. ఈ నెల 29వ తేదీన 'గుట్టలపై ఛీఛీ' అని ఆంధ్రజ్యోతిలో ప్రచురించబడిన కథనానికి హనుమకొండ పోలీసులు స్పందించారు. బుధవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని అగ్గలయ్య, పద్మాక్షిగుట్ట, సిద్ధేశ్వర గుట్టలను సందర్శించి కళాశాలలను బంద్ చేసి గుట్టలపై కాలక్షేపం చేస్తున్న యువతీ యువకులను అదుపులోకి తీసుకుని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కళాశాల ఐడీ కార్డులతో పాటు, ఆధార్ కార్డు వివరాలను సేకరించి హెచ్చరించి వదిలేశారు.

నేడు భద్రకాళి ఆలయ ఈవో ఉద్యోగ విరమణ

ఆలయ పరిపాలన అధికారిగా ఐఏఎస్?

వరంగల్ కల్చరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లులోని భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారి శేషభారతి జూలై 31 గురువారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈవోగా 2021 అక్టోబరులో బాధ్యతలు చేపట్టిన ఆమె.. ఆలయాభివృద్ధికి కృషి చేశారు. అయితే కొత్తగా ఆలయ ఈవోగా ఐఏఎస్ అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. లేకుంటే ప్రస్తుత ఈవోకే తాత్కాలిక ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇస్తారనే ప్రచారం ఉంది. అయితే బుధవారం రాత్రి వరకు కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి జీవో జారీ కాలేదు. కొత్త ఈవో ఎవరనేది ఆలయ సిబ్బందిలో, భక్తుల్లో ఆసక్తి నెలకొంది.

పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యం

ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైలు, టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ జీ

వడ్డెపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పవిత్ర క్షేత్రాల దర్శనాలే లక్ష్యంగా మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష రైలు యాత్ర సెప్టెంబరు 9న ప్రారంభం అవుతుందని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్, టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్‌జీ తెలిపారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడారు. ఇండియన్ రైల్వేస్ భారత్ గౌరవ్ టూరిస్టు రైల్, సౌత్ స్టార్ రైల్, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన అగ్రశ్రేణి టూరిస్టు రైలు ఆపరేటర్ టూర్ టైమ్స్ ఈ యాత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈ యాత్రలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధపూర్, మధుర, అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసీ, గయా వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను దర్శించే అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల వారు వివరాల కోసం నంబర్ :98483 43882లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో టూర్ టైమ్స్ మేనేజర్ యాకేశ్ పాల్గొన్నారు.

మీనాక్షి పర్యటన వాయిదా

వర్ధన్నపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర వాయిదా పడినట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జనహిత పాదయాత్ర ఈ నెల 31 నుంచి ఆగస్టు 4 వరకు రాష్ట్రంలో యథావిధిగా పర్యటన జరుగుతుందని, వరంగల్ జిల్లా లో మాత్రం వాయిదా పడినట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 5, 6, 7న బీసీ రిజర్వేషన్ బిల్లుపై ఆమోదానికి ఢిల్లీలో ధర్నా కారణంగా పాదయాత్రను వాయిదా వేసినట్లు తెలిపారు. 6న జంతర్ మంతర్ వద్ద ధర్నాలో పాల్గొంటున్న కారణంగా వరంగల్ జిల్లా పర్యటన వాయిదా పడినట్లు పేర్కొన్నారు. మళ్లీ వర్ధన్నపేట నియోజకవర్గంలో పర్యటనకు సంబంధించిన తేదీలను ఖరారు చేస్తామని ప్రకటించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లే రాష్ట్రాన్ని దోచుకున్నాయి

- బీసీల ఓట్ల రాజకీయం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- తెలంగాణలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారే..
- దేశ సైనికులను అనుమానిస్తున్న కాంగ్రెస్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

మహబూబాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు రాష్ట్రాన్ని దోచుకున్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డీఎన్ఏ ఒక్కటేనని ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో వీఆర్ఎన్ గార్డెన్స్‌లో బుధవారం బీజేపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ ఓట్ల రాజకీయాలు చేస్తున్నారని, తాము బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని, కేవలం మతపరమైన రిజర్వేషన్‌కు వ్యతిరేకమని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లో 10 శాతం ముస్లింలకు కేటాయించి రాజకీయంగా బీసీలను అణగదొక్కుతున్నారని చెప్పారు. మత రాజకీయం చేసేది కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు ఇస్తామన్న కాంగ్రెస్ అవేవి ఇవ్వకుండా అన్ని బంద్ చేశారని ఎన్.రాంచందర్‌రావు ధ్వజమెత్తారు.

నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారని అవి ఏమయ్యాయని ప్రశ్నించారు. తెలంగాణలో రైతులకు సరిపడా యూరియా అందించకుండా కాంగ్రెస్ కృత్రిమ కొరత సృష్టిస్తోందని విమర్శించారు. రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం ఇవ్వడం లేదని, అదే విధంగా ఉద్యోగులకు పీఆర్సీ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆస్కార్ అవార్డు కాదని, ఏ అవార్డు ఇవ్వాలో అర్థకావడం లేదని ఎద్దేవా చేశారు.



మహబూబాబాద్‌లో బీజేపీలో చేరిన ఎస్బీఐ రిటైర్డ్ అధికారి శంకర్‌నాయక్‌కు పార్టీ కండువా కప్పుతున్న రాంచందర్‌రావు

ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలను భారత సైనికులు మట్టుపెడితే కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ దానిని అనుమానిస్తున్నారని ఎన్.రాంచందర్‌రావు ఆరోపించారు. దేశ సరిహద్దుల్లో ప్రజలకు రక్షణగా నిలబడుతున్న భరత మాత సైనికులను అనుమానిస్తే ఊరుకోబోమన్నారు. గతంలో ప్రధాని మోదీ సర్జికల్ స్ట్రైక్ చేస్తే అది జరిగిందా! లేదా? అంటూ కాంగ్రెస్ అనుమానం వ్యక్తం చేయడం సరికాదన్నారు. ఉత్తర తెలంగాణకు దీటుగా దక్షిణ తెలంగాణలో బీజేపీ బలం పుంజుకుందని, తెలంగాణలో వచ్చేది డబుల్ ఇంజన్ సర్కారేనని స్పష్టం చేశారు. వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ, రైల్వేస్టేషన్‌ల ఆధునీకరించింది బీజేపీ ప్రభుత్వమని రాంచందర్‌రావు చెప్పారు. ప్రధాని మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మానుకోట జిల్లా పరిషత్‌ను బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక నుంచి మానుకోట బీజేపీ అడ్డాగా మారుతుందని అన్నారు.

ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి 500 మంది బీజేపీలో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. డోర్నకల్ నియోజకవర్గం నుంచి ఎస్బీఐ రిటైర్డ్ అధికారి శంకర్‌నాయక్, గుగులోతు నరేష్‌నాయక్, మహబూబాబాద్ నుంచి మాజీ వార్డు కౌన్సిలర్ బోనగిరి గంగాధర్ బీజేపీలో చేరారు. అనంతరం ఆయన్ను గజమాలతో సత్కరించారు. కాగా, బీజేపీ సమావేశంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిమానులు జనసేన జెండాతో హాజరై జై.. పవన్ అంటూ నినాదాలు చేశారు. బీజేపీ, జనసేన ఒక్కటేనంటూ రాబోయే రోజుల్లో తెలంగాణలో కలిసి పనిచేయనున్నాయంటూ సర్దిచెప్పి వారిని కూర్చోబెట్టారు.

ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, మాజీ ఎంపీ అజ్మీర సీతారాంనాయక్, ఎడ్ల అశోక్‌రెడ్డి, లింగాల సుధీర్‌రెడ్డి, వద్దిరాజు రాంచందర్‌రావు, యాప సీతయ్య, యలమంచిలి వెంకటేశ్వర్లు, కొమురయ్య, చీకటి మహేష్‌గౌడ్, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, నాయిని ధర్మారెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, చెల్పూరి వెంకన్న, భూక్య సంగీత, గడ్డం అశోక్, వెన్నమల్ల అజయ్, సతీష్, పొదిళ్ల నర్సింహారెడ్డి, మదన్, సందీప్ పాల్గొన్నారు.

భక్తుల కోసమే గద్దెల వద్ద మార్పులు

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర

మేడారంలో అధికారులు, పూజారులతో కలిసి పర్యటన



పూజారుల అభిప్రాయలను సేకరిస్తున్న దేవాదాయ అధికారులు

తాడ్వాయి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మేడారంలో వచ్చే జనవరి 28 నుంచి 31 వరకు జరిగే సమ్మక్క-సారలమ్మల మహాజాతరకు వచ్చే భక్తులకు మెరుగైన దర్శనం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ దివాకర తెలిపారు. మేడారంలో ఆయన బుధవారం పర్యటించారు. వన దేవతల దేవస్థానం, గద్దెల పరిసరాలతోపాటు మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు, పూజారులతో కలిసి పరిశీలించారు. మేడారం మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గద్దెల విస్తీర్ణం, అభివృద్ధి పనులపై రూపకల్పన నమూనాలను పూజారులకు చూపారు. ఏమైనా అభ్యంతరం ఉంటే తెలుపాలని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావును కోరారు. గద్దెల ప్రాంగణం విస్తరణ, పగిడిద్దరాజు, గోవిందరాజుల దేవతల గద్దెలు స్థల మార్పుపై చర్చించారు. నలుగురు దేవతలను భక్తులు సులభంగా దర్శించుకునేలా ఏర్పాట్లు ఉంటాయని అన్నారు. మహాజాతర సమయంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని, ఎవరికీ ఇబ్బందులు కలగకుండా మొక్కులు చెల్లించుకొనేలా అభివృద్ధి ఉంటుందన్నారు.

కాగా, గద్దెల వద్ద చేసే మార్పులపై పూజారుల అభ్యంతరాలను పూజారుల సంఘం అడిగి తెలుసుకుంది. భక్తులు సమ్మక్క, సారలమ్మలతో పాటుగా పగిడిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకునేలా మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేసినట్టు చేయడం సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివాసి సంస్కృతీ సంప్రదాయాలకు భంగం కలగకుండా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. భక్తుల సంఖ్యతో పాటుగా వీఐపీ, వీవీపీ, ప్రొటోకాల్ భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని అన్నారు. మహాజాతరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. నలుగురు దేవతలను భక్తులు సులువుగా దర్శించుకోవాలని అధికారులు రెండు రకాలుగా గద్దెల అభివృద్ధికి రూపకల్పన చేశారని వివరించారు.

అందులో మొదటి డిజైన్ గద్దెల ప్రాంగణంలో సమ్మక్క తల్లి గద్దె వద్ద నుంచి క్యూ ద్వారా నాలుగు గద్దెలను దర్శించుకొని బయటకు వెళ్లడం ఉంటుందన్నారు. క్యూలైన్‌లు రద్దీ కాకుండా పోలీస్ భద్రత ఉంటుందని తెలిపారు. రెండో డిజైన్ నాలుగు గద్దెలు వరుస క్రమంలో వచ్చే విధంగా గోవిందరాజు, పగిడిద్దరాజు దేవతల గద్దెలను స్థల మార్పు చేయడం, ఎగ్జిట్ గేట్‌ల వద్ద ప్రాకారం, సాలారం విస్తరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, పంచాయతీరాజ్ ఈఈ అజయ్‌కుమార్, పూజారులు కాక సారయ్య, మునీందర్, గోవర్ధన్, కొక్కెర కృష్ణయ్య, కాక కిరణ్, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెడికవర్ హాస్పటల్‌లో ఆరోగ్య శ్రీ సేవలు

హనుమకొండ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ హాస్పటల్‌లో ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నట్లు మెడికవర్ పీఆర్‌వో రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభు త్వం ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా మెడికవర్ హాస్పటల్‌లో అనేక ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. న్యూరో, కిడ్నీ, హృదయ సంబంధించిన చికిత్సలు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇవే కాకుండా మెడికల్ అంకాలజీ, జనరల్ మెడిసిన్, క్రిటికల్ కేర్ వంటి విభాగాల్లో మెరుగైన సేవలు అంది స్తూ అత్యాధునిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఒకే చోట అందుబాటులో ఉన్నట్లు మెడికవర్ వైద్యులు పేర్కొన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ టి.సంజయ్, న్యూరలాజిస్టు డాక్టర్ ప్రియాంక, కార్డియాలజిస్టు డాక్టర్ షఫీ, కార్డియాలజిస్టు డాక్టర్ శ్రవన్‌కుమార్ రాంపల్లి, యూరాలజిస్టు డాక్టర్ లక్ష్మణ్, కార్డియో థొరాసిక్ వ్యాస్కులర్ సర్జన్ (సీటీడీఎస్) డాక్టర్ రవికిరణ్, నెఫ్రాలజిస్టు డాక్టర్ జోగు శ్రావన్‌కుమార్ అనుభవజ్ఞులైన వైద్య బృందం చేత ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

'మధ్యాహ్న భోజనం'లో కష్టాల కుతకుత

(5వ పేజీ తరువాయి)

కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లుగా ప్రభుత్వమే నేరుగా పాఠశాలలకు సరరఫరా చేయాలని నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు.

మహిళా సంఘాల ఒత్తిడి

మధ్యాహ్న భోజన పథకాన్ని గతంలో మహిళా సంఘాలు నిర్వహించేవి. ఆ తర్వాత కాలంలో తమ వల్ల కాదని చేతులు ఎత్తేశాయి. దీనితో స్థానిక మహిళలు ముందుకు వచ్చి పథకాన్ని అమలు చేస్తున్నారు. అయితే ఇప్పుడు మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ప్రభుత్వం వంట పాత్రలను సరఫరా చేసింది. పాఠశాలల్లో కిచెన్ షెడ్లను నిర్మించింది. మేనూను మార్చింది. రేట్లను పెంచింది. దీనితో ఇప్పుడు మధ్యాహ్నం భోజనం పథకం అమలును చేజిక్కించుకునేందుకు పలు చోట్ల మహిళా సంఘాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. నిర్వాహకులను తొలగించేలా ఎంఈవోలపై ఒత్తిళ్లు చేస్తున్నాయి. దీనిని అడ్డుకోవాలని నిర్వాహకులు కలెక్టర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు వినతి పత్రాలను సమర్పించారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

(5వ పేజీ తరువాయి)

కలెక్టర్ గమనించారు. ఉన్నత పాఠశాల రిజిస్టర్‌లో 26 మంది విద్యార్థులు ఉండగా, బుధవారం కేవలం 10 మంది విద్యార్థులే హాజరయ్యారు. పాఠశాలలో స్థానికులైన విద్యార్థులు లేరని, ఇతర దూర ప్రాంతాల నుంచి ప్రత్యేక ఆటోలలో విద్యార్థులను తీసుకువస్తున్నామని, తద్వారా విద్యార్థులు సక్రమంగా హాజరు కావడంలేదని ఉపాధ్యాయులు కలెక్టర్‌కు చెప్పే ప్రయత్నం చేశారు. అనంతరం పాఠశాలకు చెందిన పలు రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం వంటలు చేసి పెడుతున్నారా అని భోజన సిబ్బంది, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొని మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని, పాఠశాల తరగతి గదులు ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని సూచించారు.

'ఇరిగేషన్'లో అక్రమాల వరద

(5వ పేజీ తరువాయి)

రీఎస్టిమేషన్ వేసి ప్రతిపాదనలు పంపించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.60కోట్లకు పైగా పనుల అంచనాలను పెంచటంపై ఓ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేయటంతో ఆ ఫైల్ పెండింగ్‌లో పెట్టారని సమాచారం.

అలాగే వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు మట్టి పూడికతీత పనుల్లోనూ సదరు ఉన్నతాధికారి అక్రమాలకు తెర తీశారనే ప్రచారం ఉంది. పూడికతీత పనులను తొలుత హనుమకొండ డివిజన్ ఇంజనీరింగ్ అధికారులకు బాధ్యతలు అప్పగించిన సదరు అధికారి.. కాంట్రాక్టర్ ఒత్తిడితో రాత్రికి రాత్రే మరో డివిజన్ అధికారులకు బాధ్యతలు అప్పగించటం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో భారీగా చేతులు మారాయనే ప్రచారం జరుగుతుంది. భద్రకాళి చెరువు నుంచి క్యూబిక్ మీటర్‌కు రూ.71.83 చొప్పున చెల్లించి మట్టి అవసరం ఉన్నవారు 3.40లక్షల క్యూబిక్ మట్టిని తీసుకెళ్లారు. ఇక ప్రజలెవ్వరు ముందుకు రాకపోవటంతో అధికారులు చెరువు మట్టిని ప్రభుత్వ స్థలాల్లో డంప్ చేసి, అవసరం ఉన్నవారికి విక్రయించాలని నిర్ణయించారు. దీనికి రూ.16.11కోట్ల నిధులు కావాలని సదరు అధికారి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

దీనిపై ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు అభ్యంతరం వ్యక్తం చేయటంతో పాటు పరిపాలన అనుమతులను నిలిపివేశారు.మట్టి డంపింగ్ కోసం కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై సదరు ఉన్నతాధికారి అక్రమాలకు తెర తీసే అధిక అంచనాలు తయారు చేశారనే చర్చ జరుగుతుంది. అంతేకాకుండా ధర్మసాగర్ మండలంలో దేవాదులకు సంబంధించిన సుమారు రూ.100కోట్ల పనులను అదే జిల్లాకు చెందిన ఇంజనీర్లకు కాకుండా జనగామ జిల్లాకు చెందిన ఇంజనీర్లకు బాధ్యతలు అప్పగించటం వెనుక పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అక్రమాలు.. వసూళ్లు...

నీటిపారుదలశాఖలో పదోన్నతుల విషయంలో భారీగా అక్రమాలు జరిగాయని ఉద్యోగ సంఘాలు నిరసనలకు దిగుతున్నారు. సదరు ఉన్నతాధికారి తన ఇష్టారాజ్యంగా పదోన్నతులు కల్పించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. సీనియర్ అసిస్టెంట్ నుంచి సూపరెండెంటెండ్ పదోన్నతి విషయంలో కోర్టు, ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికి, పట్టించుకోకుండా అడ్డదారిలో పదోన్నతులు కల్పించారని, దీంతో అర్హులు సీనియార్టిని కోల్పోతున్నారని ఉద్యోగులు గుర్రుగా ఉన్నారు. అంతేకాకుండా తన సొంత జిల్లాకు చెందిన ఉద్యోగులకు కీలక బాధ్యతలు అప్పగించి, బయటి వ్యవహారం మొత్తం నడిపిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలాగే సదరు ఉన్నతాధికారి దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద కాంట్రాక్టర్ ట్యాంకర్ నుంచి తన ప్రభుత్వం వాహనంలో డీజిల్ పోయించుకుని పరువు తీసుకున్నారనే ప్రచారం జరిగింది. గత మే 3వ తేదీన హనుమకొండ జిల్లా దేవన్నపేటలో దేవాదుల ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన పంప్‌హౌస్‌ను మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించారు. అధికారయంత్రాంగం మొత్తం పంప్‌హౌస్ పరిశీలనలో నిమగ్నమవ్వగా, కాంట్రాక్టు కంపెనీకి చెందిన డీజిల్ ట్యాంకర్ నుంచి డీజిల్‌ను సదరు ఉన్నతాధికారి కారులో నింపారు. ప్రభుత్వ వాహనంలో కాంట్రాక్టర్ డీజిల్ పోయించుకుని, పెట్రోల్ బంకులో నకిలీ బిల్లు తీసుకుని సొమ్ము చేసుకుంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ఇరిగేషన్‌శాఖలో ఓ అధికారి పదవీ విరమణ పార్టీ పేరుతో భారీగా వసూళ్లకు ప్రోత్సాహిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇరిగేషన్ శాఖలో పనులు చేసే కాంట్రాక్టర్ల నుంచి రూ.లక్ష నుంచి రూ.2.50లక్షల వరకు పార్టీ కోసం డిమాండ్ చేస్తున్నారని తెలుస్తోంది. వరంగల్ డివిజన్‌లోని ఓ ఇంజనీర్ సదరు ఉన్నతాధికారి కోసం వసూళ్లకు తహతహలాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టులో పని చేసిన ఇంజనీర్లు హరిరామ్, నూనే శ్రీధర్, మురళీధర్‌రావులు అక్రమ ఆస్తుల కేసులో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే ఈ ముగ్గురు అధికారులతో కలిసి పని చేసిన అనుభవం ఉన్న సదరు ఉన్నతాధికారిపై ఇప్పటికే ఏసీబీ అధికారులు దృష్టి పెట్టారు. గతంలో కరీంనగర్ జిల్లాలో ఓ ప్రాజెక్టులో అక్రమాలకు పాల్పడిన సంఘటనలో విజిలెన్స్ విచారణను ఎదుర్కొంటున్నారు.

గురుకులంలో నేడు స్పాట్ అడ్మిషన్లు

హనుమకొండ కలెక్టరేట్, జూలై30(ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న ధర్మసాగర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం ఇంటర్మీయట్ ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి గురువారం స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సల్ల శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు 10వ తరగతి మెమో, టీసీ, బోనోఫైడ్, కుల, ఆదాయ ధృవీకరణపత్రాలతో పాటు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలు తీసుకురావాలని, ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు వినియోగించుకోవాలని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

దర్గా ఉత్సవాలకు రండి..

ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఎమ్మెల్యేలు

హనుమకొండ సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): కాజీపేట దర్గా ఉత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, దర్గా పీఠాధిపతి ఖుస్రూపాషా కోరారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు సయ్యద్ షాఅఫ్జల్ బియాబానీ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దర్గా పీఠాధిపతి కుసూర్ పాషా, ఎమ్మెల్యేలు

బాలికపై హత్యాయత్నం కేసులో మూడేళ్ల జైలు

వరంగల్ లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమించమని వెంటపడి బాలికపై హత్యాయత్నం చేసిన ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కం పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మనిషా శ్రవన్ ఉన్నమ్ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా కేంద్రంలోని క్రిష్టియన్‌కాలనీకి చెందిన బసికె నిఖిల్ అలియాస్ డానీ అబ్బుని కుంటకు చెందిన పదో తరగతి చదువుతున్న బాలికను ప్రేమించమని వెంటపడుతూ వేధించేవాడు. బాలిక తల్లిదండ్రులు నిఖిల్‌ను మందలించినప్పటికీ మార్పు రాకపోగా మరింతగా వేధింపులకు గురి చేశాడు. ఈ క్రమంలో 2020 జూన్ 17న మధ్యాహ్నం 3.30 గంటలకు బాలిక తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో నిందితుడు నిఖిల్ పగిలిన బీరు సీసాతో ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై దాడి చేసి కుడి భుజంపై, వీపులో గాయపర్చాడు. దీంతో బాలిక వెంటనే కేకలు వేయడంతో అటువైపుగా వెళ్తున్న రాజేష్‌ఖన్నా రావడంతో నిందితుడు పారిపోయాడు. వెంటనే విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు నిందితుడు నిఖిల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిఖిల్‌పై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ దౌడు ప్రతాప్ సాక్షులను ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందాదేవి గ్యాని కేసు వాదించారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2151	1521
పల్లికాయ (సూక)	3800	3450
పల్లికాయ (పచ్చిది)	6020	1575
కందులు	5633	3022
పెసళ్లు	7052	3022
పత్తి	7660	5300
పసుపు (కాడి)	11029	9534
పసుపు (గోల)	11109	8700
తేజ మిర్చి	12000	8500
తేజ ఏసీ	13300	11500
వండర్‌హాట్	10500	6000
వండర్‌హాట్ ఏసీ	15000	11500
యూఎస్341ఏసీ	13200	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	5000	3000

- వరంగల్ వ్యవసాయం



మహబూబాబాద్‌లో బతుకు బండికి భరోసా ఇవ్వాలని ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు (ఫైల్)

వేకువ జామున కోడి కూసిన దగ్గరి నుంచి మొదలుకుని రాత్రి నిద్రపోయేంతవరకు రోడ్డుపై ఆటోలు నడిపినా ఆటో డ్రైవర్ల ఆర్థిక కష్టాలు తీరడం లేదు. రేయింబవళ్లు ఆటో నడిపినా ఫైనాన్స్ కిస్తీలు కట్టేందుకు డబ్బులు రాక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఉన్నత చదువులు చదివిన యువకులు సైతం తమ కుటుంబాలను పోషించుకోవడానికి ఆటో వృత్తిని ఎంచుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7.50 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉండగా.. 30 లక్షల మంది వారిపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆగస్టు 1న ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆటోవాలా.. బతుకు గడిచేదెలా!?

మహాలక్ష్మి పథకంతో ప్రయాణికులు కరువు

- రాబడి లేక వెంటాడుతున్న ఆర్థిక ఇబ్బందులు
- ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక సతమతం
- ఏళ్లు గడుస్తున్నా మెరుగుపడని జీవితాలు
- రూ.1000 కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకై ఉద్యమాలు
- ప్రతీ నెల రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్
- రేపు ప్రపంచఆటో డ్రైవర్ల దినోత్సవం

మహబూబాబాద్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కరోనా మహమ్మారి రాక ముందు వరకు ఆటో డ్రైవర్ల జీవన స్థితి కాస్త మెరుగ్గానే ఉండేది. పొద్దంతా ఆటో నడిపితే నాలుగు పైసలు వస్తే వాటితో కుటుంబాన్ని పోషించుకునే వారు. కరోనా మహమ్మారి ఒక్క సారిగా వారి జీవితాలను కుదిపేసింది. దాదాపు రెండు సంవత్సరాల పాటు లాక్‌డౌన్‌తో ఆటోలు రోడ్డెక్కకపోవడంతో వారు ఆర్థికంగా చితికి పోయారు. కాస్త కోలుకుంటున్న సమయంలో మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందాన తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణికులు సంఖ్య తగ్గింది. ఈ క్రమంలో ఆటోలు నడవక, ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక, కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చలేక రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 80 మంది ఆటో డ్రైవర్లు ఇటు మనోవేదన, అటు గుండెపోటు, మరో పక్క ఆత్మహత్యలతో చనిపోయారు. తాము మహాలక్ష్మి పథకానికి వ్యతిరేకం కాదని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా, ఇచ్చిన హామీల్లో భాగంగా ఆటో డ్రైవరుకు ప్రతీ నెల రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిలో సుమారు 12 వేలకు పైచిలుకు ఆటోలున్నాయి. దాదాపుగా 40 వేల మంది కుటుంబసభ్యుల జీవనోపాధి ఆటోలపై ఆధారపడి ఉంది. అందులో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోనే సుమారు 1500 వరకు ఉన్నారు. మిగతా ఆటోలు మండలాల పరిధిల్లో నడుస్తున్నాయి. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అనేకమార్లు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. ఆటోలు నడవక ఆర్థికంగా చితికిపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో డ్రైవర్లు విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ఆటో డ్రైవర్ల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.1000 కోట్లతో ప్రత్యేకంగా కార్పోరేషన్‌ను ఏర్పాటు చేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి. ఎన్నికల సమయంలో ఇచ్చినహామీ మేరకు ఆటో డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు రాష్ట్ర సర్కార్ అందించి ఆర్థికంగా ఆదుకోవాలి. గూడు లేని నిరుపేద ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి.

- నలమాస సాయి,
తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (తాడు) జిల్లా అధ్యక్షుడు, మానుకోట

- కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రత్యేకంగా కార్పోరేషన్ ఏర్పాటు చేసి రూ . 1000 కోట్ల బడ్జెట్ కేటాయించి ఆదుకోవాలి
- మహాలక్ష్మి పథకం అమలు అనంతరం ఆటోలు నడవక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నఆటో డ్రైవర్లను ప్రభుత్వంఆదుకోవాలి.
- ఆటో డ్రైవరుకు నెలకు రూ.12 వేల రూపాయలు అందించి ఆదుకోవాలి.
- రూ.8 వేలు ఉన్న ఇన్సూరెన్స్ చెల్లింపును రూ. 1000 కి కుదించాలి.

ఆటో కార్మికుల డిమాండ్లు

- ఆటో డ్రైవర్లు ఏ కారణం చేతనైనా మరణించినా వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆటో బీమాను ఏర్పాటు చేసి రూ. 5లక్షలు ఇచ్చే విధంగా చట్టం తీసుకురావాలి.
- రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో స్టాండ్‌కు అధికారికంగా స్థలాలు కేటాయించాలి.
- రూ.100 కోట్ల రూపాయల ఆదాయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందిస్తున్న 50 సంవత్సరాలు పైబడిన ఆటో డ్రైవర్లుకు నెల నెల పెన్షన్ ఇవ్వాలి.
- ఇళ్లులేని నిరుపేద ఆటో డ్రైవర్లకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలి.
- రాష్ట్రంలో 7.50 లక్షల మంది ఉన్న ఆటో కార్మిక రంగాన్ని అతిపెద్ద పరిశ్రమగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి.
- ప్రైవేట్ ఫైనాన్స్‌ల దోపిడిని అరికడుతూ, సీజింగ్ వ్యవస్థను రద్దు చేస్తూ ప్రభుత్వమే బ్యాంక్‌ల ద్వారా వడ్డీలేని రుణాలు అందించాలి.

పోలీస్ డ్యూటీ మీట్‌కు సర్వం సిద్ధం



పోలీస్ డ్యూటీ మీట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

- మూడు రోజుల పాటు కొనసాగనున్న డ్యూటీ మీట్
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడి



మామునూరు/వరంగల్‌క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మామునూరు పీటీసీలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్-2025 నిర్వహణకు సర్వం సిద్ధమైందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ బుధవారం వెల్లడించారు. ఈ పోలీస్ డ్యూటీ మీట్‌కు తెలంగాణలోని ఏడు జోన్లతో పాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనర్ పోలీసులు, సీఐడీ, ఇంటెలిజెన్స్, యాంటీ నార్కోటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ వింగ్, జీఆర్‌పీ ఐటీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సుమారు వెయ్యి మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది 25 విభాగాల్లో పోటీపడనున్నట్లు తెలిపారు. ఈ పోలీస్ డ్యూటీ మీట్‌ను గురువారం ఉదయం 9 గంటలకు టీజీపీఏ డైరెక్టర్ అభిలాష బిష్త, అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్‌లు ప్రారంభిస్తారని చెప్పారు. ఆగస్టు 2న ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథుల చేతుల మీదుగా విజేతలకు పతకాలతో పాటు చాంపియన్‌షిప్ ట్రోఫీలను అందజేస్తామన్నారు. పోలీస్ డ్యూటీ మీట్ విషయంలో ఎలాంటి అనుమానులన్నా తన దృష్టికి తీసుకురావాలని సీపీ కోరారు. ఈ సందర్భంగా పోలీస్ డ్యూటీ మీట్ ఏర్పాట్లను సీపీ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పోటీల నిర్వహణకు వచ్చిన అతిథులకు వసతి, భోజన ఏర్పాట్లపై సీపీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ముస్తాబైన పోలీస్ ట్రైనింగ్ సెంటర్

తెలంగాణ స్టేట్ సెకండ్ పోలీస్ డ్యూటీ మీట్-2025కు వరంగల్‌లోని మామునూర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ముస్తాబైంది. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు సైంటిఫిక్ ఎయిడ్స్ టూఇన్విస్టిగేషన్ (ఎస్ఏఐ) ఈవెంట్‌లో భాగంగా ఫోరెన్సిక్ సైన్స్ రాత పరీక్ష, మెడికో లీగల్ ఓరల్ టెస్ట్, అబ్రేవేషన్ టెస్ట్, యాంటీ సబోటేజ్ చెక్ (యాక్సెస్ కంట్రోల్ అండ్ గ్రౌండ్ సెర్చ్) ఈవెంట్‌లో భాగంగా యాక్సెస్ కంట్రోల్ రాత పరీక్ష, గ్రౌండ్ సెర్చ్ రాత పరీక్ష, గ్రౌండ్ సెర్చ్ ప్రాక్టికల్, డాగ్ స్క్వాడ్ (నార్కోటిక్) ఈవెంట్‌లో భాగంగా ఒబిడియెన్స్ రిఫ్యూజల్ ఫుడ్, గ్రౌండ్ సెర్చ్, వెహికల్ సెర్చ్, బిల్డింగ్ సెర్చ్, లగేజీ సెర్చ్, హ్యూమన్ బాడీ సెర్చ్, కంప్యూటర్ అవేర్‌నెస్ ఈవెంట్‌లో భాగం గా కంప్యూటర్ అవేర్‌నెస్ ఆబ్జెక్టివ్ టెస్ట్, పోలీస్ ఫొటోగ్రఫీ టెస్ట్ నిర్వహించనున్నారు. కాగా, ఈవెంట్స్‌ను విజయవంతం చేయడానికి వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో 12కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రతీ ఈవెంట్‌కు ఒక అధికారిని ఇన్‌చార్జిగా నియమించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వస్తున్న పోలీసులకు వరంగల్ పోలీసులు మామునూర్‌లోని పీటీసీ అన్నీ వసతులను ఏర్పాటు చేశారు. మొదటి రోజు ఈవెంట్స్‌కు హాజరయ్యే వారంతా ఇప్పటికే మామునూర్‌తో పాటు నగరంలోని వివిధ హోటళ్లకు చేరుకున్నారు.

తప్పుల తడకగా ప్రశ్నాపత్రాలు

- లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షలో గందరగోళం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అభ్యర్థులు

హనుమకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్‌డ్ సర్వేయర్స్ (ఎల్ఎస్-2025) పరీక్ష ప్రశ్నాపత్రాల్లో తప్పులు, లోపాలు ఉన్నాయని అభ్యర్థులు పేర్కొంటున్నారు. వీటి వల్ల తాము తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఈ ప్రశ్నాలను సవరించి పరీక్ష తిరిగి నిర్వహించాలని కోరుతున్నారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజులు సర్వేయర్ పరీక్షలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో సుమారు 1800 మందికిపైగా అభ్యర్థులు పరీక్షరాశారు. కాగా, పరీక్ష రాసిన అభ్యర్థులు బుధవారం ఆయా జిల్లాల కలెక్టర్లను కలిసి ఈ మేరకు వినతి పత్రాలను సమర్పించారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్ పరీక్షలో మొదటిరోజు థియరీ ప్రశ్నాపత్రం ఇంగ్లీష్, తెలుగులో ప్రశ్నలు భిన్నంగా వచ్చాయని, ప్రశ్నాపత్రం తయారీలో తప్పులు జరిగాయని పార్ట్-ఏలోని ప్రశ్నలు, భౌగోళిక గుర్తులు ఇందుకు ఉదాహరణ అని అభ్యర్థులు పేర్కొన్నారు. థియరీ ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేయడానికి ఇచ్చిన మూడు గంటలు గడువు సరిపోలేదని, ఆన్సర్ షీట్ పేజీలు తక్కువగా ఉండడం వల్ల జవాబు పూర్తిగా రాయలే పోయామని వివరించారు. ప్లాటింగ్ ప్రశ్నాపత్రం పార్ట్ (ఏ) టిప్పన్ స్కేలింగ్‌కు మించి ఉందని, ఆఫ్‌సెట్ సైతం అయిదు చైన్లు మించి ఉందని, స్టడీ మెటీరియల్ ప్రకారం ప్రశ్నలు రాకపోవడం, ప్లాటింగ్ పేపర్‌లో థియరీ ప్రశ్నలు రావడం వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని వివరించారు. శిక్షణా కేంద్రంలో అధికారుల బృందం, అధ్యాపక బృందం టీఏఎల్ఐఎం మెటీరియల్ ప్రకారం వంద శాతం (థియరీ, ప్లాటింగ్) నేర్పించారని, కానీ ప్రశ్నలు మెటీరియల్ నుంచి ఇవ్వలేదన్నారు. టీఏఎల్ఐఎం గైడెన్స్ స్టడీ మెటీరియల్‌కు విరుద్ధంగా ప్రశ్నాపత్రాలను తయారు చేశారన్నారు. కనుక ప్లాటింగ్ థియరీ పరీక్షలను తిరిగి నిర్వహించాలని, ప్రశ్నాపత్రంలోని లోపాలవల్ల తగ్గే మార్కులను అందరికీ కలపాలని, ప్రశ్నాపత్రాలను టీఏఎల్ఐఎం స్టడీ మెటీరియల్ ఆధారంగా తయారు చేయాలని, పరీక్ష నిడివికి లోబడి ప్రశ్నలు ఉండాలని, ఆన్సర్ షీట్‌లో పేజీల సంఖ్య ఎక్కువగా ఉండాలని, పరీక్షలో (ప్లాటింగ్) ప్రింట్ స్పష్టంగా ఉండాలని కోరారు.

వయోజన విద్యకు ఉల్లాస్

- మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కార్యక్రమం
- నిరక్షరాస్యులను గుర్తించే పనిలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బంది
- విద్యాశాఖ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ



మొగుళ్లపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులైన వయోజన మహిళలను అక్షరాస్యులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేకంగా ఉల్లాస్ అండర్ స్టాండాలెస్ లాంగ్‌సాల్ ఆన్ ఇన్ సొసైటీ పథకాన్ని అమలులోకి తెచ్చింది. దేశంలో ఉన్న ప్రతి మహిళ అక్షరజ్ఞానం కలిగి ఉండాలనే ఉద్దేశతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నాయి. ఈ పథకాన్ని విద్యాశాఖ, సెర్ప్ ఉమ్మడి భాగస్వామ్యంతో కొనసాగించనున్నాయి. దశలవారీగా అమలుచేసే ఉల్లాస్ పథకంలో ముందుగా మహిళా సంఘాల్లోని నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా చేయడంతోపాటు రెండోదశ మాధ్యమంలో బడిమానేసిన వారిని గుర్తించి ఓపెన్‌స్కూల్ ద్వారా నేరుగా పదోతరగతితోపాటు వారి ఆసక్తిని బట్టి ఓపెన్ ఇంటర్ వరకు చదివించడమే ప్రభుత్వ లక్ష్యం.

ఉల్లాస్ లక్ష్యం...

సామాజిక అధికారికతలో భాగంగా ఉల్లాస్ కార్యక్రమం ద్వారా చదువురాని అందరికీ చదవడం, రాయడం నేర్పించడమే ఉల్లాస్ పథకం ప్రధాన లక్ష్యం. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యుల్లో కేవలం 50శాతం మందికి మాత్రమే సంతకం చేయడం వస్తుంది. మిగిలిన సగంశాతం మంది మహిళలు వేలిముద్ర వేస్తారన్నది అధికారిక సమాచారం. మహిళలందరికీ రాయడం నేర్పించడమేకాకుండా మధ్యలో బడి మానేసిన వారిని సైతం గుర్తించి నేరుగా ఓపెన్ టెన్త్, ఇంకా ఆసక్తి ఉంటే ఓపెన్ ఇంటర్ చదవిస్తారు. కొందరికి మరింకా ఆసక్తి ఉంటే ఓపెన్ డిగ్రీ కూడా చదివిస్తారు. అవసరమైతే టెక్నికల్ కోర్సు నేర్పించి ఉపాధి అవకాశాలు కల్పించేవిధంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. మహిళలకు చదవడం, రాయడంతోపాటు ఆర్థిక క్రమశిక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర అంశాలను సైతం నేర్పిస్తారు.

వలంటీర్లుగా అక్షరాస్యులు

డీఆర్‌డీవో, సెర్ప్ ఆధ్వర్యంలో నిరక్షరాస్యులను గుర్తించే ప్రక్రియ పూర్తికాగానే నిరక్షరాస్యులతో 15నుంచి 20మంది చొప్పున గ్రూపులు ఏర్పాటు చేస్తారు. గ్రామంలో మహిళా సంఘాల్లో అక్షరాస్యులైన వారిని వలంటీర్లుగా ఎంపిక చేసి నిరక్షరాస్యుల గ్రూపులను కేటాయించి వారికి చదువు చెప్పిస్తారు. గ్రూపులో ఉన్న వారందరికీ చదవడం, రాయడం వచ్చేవరకు వీరికి చదువు చెప్పే బాధ్యత వలంటీర్లదే. వారికి ఎలాంటి పారితోషికం, గౌరవవేతనం లేకుండానే కేవలం సేవాభావంతో మాత్రమే వలంటీర్లు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ పుస్తకాలు అందించడంతోపాటు పథకం విజయవంతం అయ్యేవరకు ఆయా గ్రామాల్లోని ఉపాధ్యాయుల ద్వారా సహకారం అందించనుంది.

తల్లి చదువుతో కుటుంబాల్లో వెలుగులు



తల్లి చదువు ద్వారా ఆ కుటుంబంలో వెలుగులు నిండుతాయి. చదువు విలువ తెలిసి కుటుంబంలో అక్షరాస్యులుంటే కుటుంబాల ద్వారా గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధిపథంలో పయనించేందుకు దోహదపడుతుంది. బడికి వెళ్లే పిల్లల సంఖ్య పెరగడంతో డ్రాప్ అవుట్ తగ్గితే బాల్య వివాహాలపై అవగాహన పెరుగుతుంది. అక్షరాస్యులుగా మారడం ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన పెరిగి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతాయి. - బాలకృష్ణ, డీఆర్‌డీవో పీడీ

నిరక్షరాస్యుల గుర్తింపు

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరక్షరాస్యులను గుర్తించేపనిలో ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగే ఉల్లాస్ పథకం ద్వారా నిరక్షరాస్యులను గుర్తించే కార్యక్రమాన్ని సెర్ప్ అధికారులు మండలాల పరిధిలోని గ్రామాల్లో వీవోఏలు, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్‌ల ద్వారా గుర్తిస్తున్నారు. ఈనెల చివరి నాటికి సంఘంలో నిరక్షరాస్యులను, చదువు మధ్యలో మానేసిన వారిని గుర్తించి నివేదిక సమర్పించనున్నారు. సమావేశాలు ఏర్పాటు చేసి పథకానికి సంబంధించిన విధివిధానాలను సెర్ప్ అధికారులు, సిబ్బందికి సమగ్రంగా వివరాలను డీఆర్‌డీవో అధికారులు తెలుపుతారు.



విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

- నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అనురాధ



వరంగల్ వ్యవసాయం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమైంది. కొద్ది రోజులుగా వానలు లేకపోవడంతో వరిసాగు చేసేందుకు రైతు లు వెనుకంజ వేశారు. జిల్లాలో లక్షా 43వేల ఎకరా ల్లో సాగు కావాల్సిన వరి పంట ఇప్పటికి కేవలం 10వేల ఎకరాలు దాటలేదు. ప్రస్తుతం నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లోకి నీరు వస్తోంది. దీంతో నారు పోసేందుకు రైతు లు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాశాఖ అధికారి కె.అనురాధ రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. సరైన విత్తనాల ఎంపిక, తెగుళ్ల నివారణ, నారుమడి యాజమాన్య పద్ధతులు పాటించాలని, ఆగస్టు చివరి వరకు నాట్లు వేసుకోవచ్చని సూచిస్తున్నారు.

విత్తనాల ఎంపిక..

ఆర్ఎన్ఆర్ 15048, ఆర్ఎన్ఆర్.10754, ఆర్ఎన్ఆర్. 28361, ఆర్ఎన్ఆర్ 29325, కెఎన్ఎం.1638, కెఎన్ఎం 118, డబ్ల్యూజిఎల్ 44, భద్రకాళి (డబ్ల్యూజిఎల్ 3962), బీపీటీ. 5204, ఎంటియు 1010, అమన్ గోల్డ్, సూపర్ అమన్, అంకూర్ సోన, చిట్టి పొట్టి విత్తనాలు ఇవి కాక పలు ప్రైవేటు కంపెనీల కు చెందిన విత్తనాలను ఎంపిక చేసుకోవచ్చు. దీం తో పాటు నారుమడిలో మంచి యాజమాన్య పద్ధతులు, సస్య సంరక్షణ చర్యలు చేపట్టాలి.

ఎకరానికి 30 కిలోల విత్తనాలు..

ఎకరానికి 30 నుంచి 40 కిలోల వరి విత్తనాలు అవసరమవుతాయి. 1.5 మీటర్ల వెడల్పుతో ప్లాట్స్‌లా చేసు కుని విత్తనాన్ని వేయాలి. విత్తనం వేసే ముందు కిలో విత్తనానికి 3-4 గ్రాముల కాప్టన్ లేదా థైరంతో విత్త న శుద్ధి చేసుకోవాలి. దుక్కిలోనే హెక్టారుకి టన్ను పశువుల ఎరువు లేదా సేంద్రియ ఎరువును వేసుకోవాలి. మూడు కిలోల భాస్వరం, రెండు కిలోల పోటాష్‌ను కలుపుకుని వేయాలి. ఈ పద్ధతిలో ముఖ్యంగా ఐరన్, పోటాషియం లోపం కనిపిస్తుంది. దీనిని నివారించుకోవడానికి సూక్ష్మపోషకాలను పిచికారి చేసుకోవాలి.

నారుమడి తయారీ..

నారు పోయాల్సిన మడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు సార్లు దున్ని చదును చేసుకోవాలి. నీరు పెట్టేందుకు, ఎక్కువైతే తీసేందుకు అనుకూలం గా తయారు చేసుకోవాలి. వడ్లను 24 గంటలు నీళ్లలో నానబెట్టాలి. అనంతరం మరో 24 గంటల పాటు మండె కట్టాలి. చిన్నగా మొలకెత్తగానే వడ్ల గింజలను(స్ప్రౌట్స్) దమ్ముచేసిన మడిలోవెదజల్లాలి.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కె.అనురాధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని నారు పోసుకుని సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. వడ్లను ముందే విత్తన శుద్ధి చేసుకుంటే తెగుళ్లను నివారించుకోవచ్చు. నారు మళ్లలో సరైన విధానంగా ప్లాట్స్ తయారు చేసుకుని విత్తనాలను చల్లుకోవాలి.


బొగ్గు, విద్యుత్ కేటాయింపులపై చర్యలు తీసుకోండి..

- లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి

హనుమకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రానికి బొగ్గు, విద్యుత్ కేటాయింపుల విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని లోక్‌సభలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య కోరారు.

తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన వనరులు, కేటాయింపుల విషయంలో అన్యాయం జరగడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇప్పటికే పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఇంధన కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దీనికి పరిష్కారంగా సింగరేణి సంస్థకు కొత్త బ్లాకులు తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రానికి న్యాయం జరిగేంతవరకు తాను కేంద్రాన్ని వదలనని డాక్టర్ కావ్య అన్నారు. ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థ అయిన ఎస్‌సీసీఎల్‌ను బలోపేతం చేయడం ద్వారానే తెలంగాణ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించగలమని ఆమె స్పష్టం చేశారు.

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ మేరకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఇతర రాష్ట్రాల మాదిరిగానే, తెలంగాణాలోనూ బొగ్గు కేటాయింపుల విధానం పారదర్శకంగా, నిబంధనల ప్రకారమే జరుగుతోందని పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాల అభ్యర్థనలను కేంద్రం పరిగణలోకి తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఎస్‌సీసీఎల్ వంటి సంస్థలు మరింత సమర్థవంతంగా పని చేసేలా నిబంధనలు రూపొందించాలన్న డాక్టర్ కావ్య సూచనలను కేంద్రం పరిగణలోకి తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.



మెడికల్ క్యాంప్‌ను సందర్శించిన డీఎంహెచ్ఓ



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య

వరంగల్ మెడికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావుపూలే, తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను బుధవారం హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎ.అప్పయ్య సందర్శించారు. పెద్దాపూర్‌లోని వసతి గృహాల్లో ఆర్‌బీఎస్‌కే టీం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. పిల్లలకు పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, దోమలు, ఈగల వల్లే వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవీందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అభినందన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అథ్లెటిక్స్‌లో విలియం కేరి విద్యార్థుల ప్రతిభ

హనుమకొండ సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): అండర్-12 జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో హనుమకొండ లష్కర్ బజార్‌లోని విలియం కేరి బాపిస్టు స్కూల్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. చాన్ బాషా, చైతన్యతోపాటు మరో 25మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలను సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ప్రాంగణంలో అభినందన కార్యక్రమం జరిగింది. కరస్పాండెంట్ విద్యాకర్ విద్యార్థులను అభినందించి క్రీడలతోపాటు విద్యలో ఉన్నత స్థాయిని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీఎం ప్రభాకర్, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా అవకాశమివ్వండి..

మీనాక్షిని కలిసిన వెంకట్రాం నరసింహారెడ్డి



తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో ఎమ్మెల్యే నాగరాజు, పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి

హనుమకొండ సిటీ, జూలై 30(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పింగళి వెంకట్రాం నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి హైదరాబాద్‌లో ఆమెను కలిశారు. 35 ఏళ్లుగా పార్టీకి చేసి న సేవలు, నిర్వహించిన పదవులు తదితర అంశాలను వివరించారు. జిల్లా అధ్యక్షుడిగా అవకాశమిస్తే చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహిస్తాంటూ పరిశీలించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు సబ్‌స్టేషన్‌ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ సాంబరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్‌పూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ వాటర్ ట్యాంక్, సంఘమిత్ర కాలనీ, ఖబరస్థాన్, శ్రీలక్ష్మీనగర్ రాజ్‌కిరాణం, మజీద్ ఏరియాలో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు, కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని నయీంనగర్, శ్రీనగర్‌కాలనీలో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు, ఈద్గా, పోచమ్మకుంట ఏరియాలో సాయంత్రం 3గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

బహిరంగంగా మద్యం తాగొద్దు



మద్యం షాపు నిర్వాహకులకు సూచనలు చేస్తున్న సీఐ శివకుమార్

వరంగల్ క్రైం, జూలై30(ఆంధ్రజ్యోతి): బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్స్ షాపుల ఎదుట బహిరంగంగా మద్యం తాగకుండా ఆయా షాపుల యజమానులు చర్యలు తీసుకోవాలని హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని మద్యం షాపుల నిర్వాహకులతో బుధవారం స్టేషన్ ఆవరణంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సమయపాలన పాటిస్తూ షాపులను నడిపించాలని, ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

అనారోగ్యంలో శానిటరీ జవాన్ మృతి



సంతాపం వ్యక్తం చేస్తున్న సీఎంహెచ్‌వో, శానిటేషన్ సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలోని శానిటేషన్ విభాగంలో ప్రభుత్వ జవాన్‌గా పనిచేస్తున్న కొత్తకొండ వెంకటేశ్ (35) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. వెంకటేశ్ 26వ డివిజన్ వరంగల్ కూరగాయల మార్కెట్ పరిధిలో జవాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్ మృతి పట్ల శానిటేషన్ విభాగం సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబాన్ని మునిపల్ శానిటేషన్ విభాగం సీఎంహెచ్‌వో బొమ్మన డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, జవాన్లు జన్నుప్రకాశ్, జీవన్, కుమార్, శ్రీనివాస్, పిండి రవి కలిసి పరామర్శించారు. మృతుడి కుటుంబానికి శాఖాపరమైన బెనిఫిట్లు అందేలా సహకరిస్తామని సీఎంహెచ్‌వో రాజారెడ్డి హామీ ఇచ్చారు.

పల్లె నర్సింహకు సన్మానం

హనుమకొండ కలెక్టరేట్, జూలై30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యుడిగా నియమితులైన తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహను హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బుధవారం సీపీఐ నాయకులు, ప్రజానాట్యమండలి నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, ప్రజానాట్య మండలిజిల్లా ప్రధానకార్యదర్శి కొట్టపాక రవిఉన్నారు.



నర్సింహను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు



వరంగల్ బట్టలబజార్‌లో డ్రైనేజీ పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

డ్రెయిన్స్ జంక్షన్‌ల వద్ద జాగ్రత్త

- ప్రమాదాలు జరగకుండా మెష్‌లు ఏర్పాటు చేయాలి
- నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో పలు ప్రాంతాల్లో ఉన్న డ్రెయిన్ జంక్షన్లపై మెష్‌లను ఏర్పాటు చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ బట్టలబజార్, కృష్ణకాలనీ, పోచమ్మమైదాన్, కాశిబుగ్గ, డీమార్ట్ ప్రాంతం, చార్‌బౌళి, ఎల్లమ్మగుడి ప్రాంతాల్లో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రధాన రహదారులపై వ్యాపారాలు చేసే నిర్వాహకులు షాపుల నుంచి వెలువడే చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. చెత్తను డ్రైనేజీలలో వేయడంవల్ల మురుగునీరు నిలిచిపోయి వర్షాకాలంలో స్టోరేజీ ఏర్పడుతుందని అన్నారు. మునిసిపల్ నిబంధనలు పాటించని వ్యాపారులకు జరిమానా విధించాలన్నారు. వరంగల్ నగరంలో వంద మురుగుకాల్వల జంక్షన్లు ఉన్నాయని, వాటిపై అధికారులు దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈలు, ఏఈలు శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి..



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి

హనుమకొండ చౌరస్తా, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 3న హనుమకొండ అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీఓఎస్ భవన్‌లో నిర్వంచనున్న తెలంగాణ గ్రామపంచాయతీ కార్మికుల మహాసభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు చక్రపాణి పిలుపునిచ్చారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చక్రపాణి పాల్గొని మా ట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులకు నష్టదాయకమైన పనిభారాన్ని పెంచి బానిసలుగా మార్చే మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, కేటగిరీలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి రెండో పీఆర్సీ పరిధిలోకి వేతనాలు తీసుకరావడంతోపాటు కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భ ద్రత, అర్హత కలిగిన వారికి పదోన్నతులు కల్పించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ లాంటి చట్టబద్ధహక్కులు కల్పించాలని చక్రపాణి కోరారు. కారోబార్, బిల్లు కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ లాంటి అనేక సమస్యలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ సమస్యలపైన మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిండం, నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమవేశంలో జిల్లా కార్యదర్శి గబ్బెట యాకయ్య, జిల్లా నాయకులు బండ సాంబయ్య, బోగం రమేష్, ఈసంపెల్లి ఐలయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వరంగల్ జిల్లా లీగల్ సెల్ న్యాయవాదులు

వరంగల్ లీగల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా ఏఐసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా లీగల్‌సెల్ చైర్మన్ శ్యామంతుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం బార్ అసోసియేషన్ హాల్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆగస్టు 2న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాజ్యాంగ సవాళ్లపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సును ఏఐసీసీ లీగల్ సెల్ చైర్మన్ అభిషేక్‌సింగ్ పర్యవేక్షణలోజరుగుతుందని, ఈ సదస్సును విజయవంతం చేయాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నాయకులు రాహుల్‌గాంధీ హాజరు కానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కొక్కొండ రమేష్, రాష్ట్ర కన్వీనర్లు ముదసర్ అహ్మద్, ఖయూమ్, పోశిని రవీందర్, రాజోజు వేణుగోపాల్, కూనూరు రంజిత్‌గౌడ్, రాష్ట్ర వైస్‌చైర్మన్లు నల్ల మహాత్మా, తోట రాజ్‌కుమార్, నిమ్మాని శేఖర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల రమేష్, డాక్టర్ పసుల యాకస్వామి, గునిగంటి శ్రీనివాస్, రఘుపతి, హరిహర కుమార్, నర్సింహస్వామి, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి నిత్య అన్నదానం పెంచుతూ జీవో జారీ

మంత్రికి, ఎమ్మెల్యేలకు ధర్మకర్తల ధన్యవాదాలు

వరంగల్ కల్చరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవాలయంలో అన్నదానం సంఖ్యను పెంచుతూ రాష్ట్ర అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి బుధవారం జీవో జారీ చేశారు. గతంలో ప్రతీ రోజు 100 మందికి, శుక్రవారం, ఆదివారం రోజుల్లో 200 మందికి అన్నదానం కొనసాగేది. పెరిగిన భక్తుల రద్దీ దృష్ట్యా మధ్యాహ్న సమయంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ సంఖ్యను పెంచాలని దేవస్థానం రాష్ట్ర కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపింది. మంత్రి కొండా సురేఖ, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి కూడా అన్నదాన సంఖ్యను పెంచాలని తెలియజేయగా సానుకూలంగా స్పందించారు. కాగా, అన్నప్రసాదం సంఖ్యను పెంచేలా జీవో జారీ చేయడంపై ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు, ఆలయ ఈవో శేషు భారతి, ధర్మకర్తలు ఓరుగంటి పూర్ణచందర్, గాదె శ్రవన్ కుమార్‌రెడ్డి, రవితో పాటు ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కూచన హరినాథ్, శ్యాంసుందర్, నవీన్‌లు మంత్రి, ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులకు చదువు కంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యం

ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎ.వరదారెడ్డి



జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్, విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ వరదారెడ్డి

హసన్‌పర్తి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు కంటే క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని, క్రమశిక్షణతో కూడిన విద్య ద్వారానే విద్యార్థి ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చని ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో 2025 విద్యా సంవత్సరం నూతనంగా చేరిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు బుధవారం ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, ప్రో వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, అడ్మిషన్స్ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ రాందేశ్‌ముఖ్‌లతో కలిసి ముఖ్య అతిథి ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థి సమయపాలన పాటించాలన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యకు అధిక ప్రాముఖ్యతనివ్వాలన్నారు. వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. ఎస్సార్‌యూలో ఓపెన్ డోర్ పాలసీ అములులో ఉందని విద్యార్థులు తమ సమస్యల్ని స్వేచ్ఛగా యాజమాన్యానికి తెలియజేయవచ్చన్నారు. అనంతరం రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనరెడ్డి మాట్లాడుతూ.. యూనివర్సిటీ సాధించిన జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు శేషగిరిరావు, శరత్‌తో పాటు అన్ని స్కూల్ డీన్లు, డిపార్టుమెంట్ హెడ్స్, ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ సిబ్బందితో పాటు దేశం నలుమూలల నుండే కాకుండా అంతర్జాతీయ విద్యార్థులు పాల్గొన్నారు.



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మడికొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రవీందర్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాజీపేట మండలం కడిపికొండలోని స్కూల్ కాంప్లెక్స్‌లో భోజన విరామ సమయంలో మండల విద్యాశాఖ అధికారి బండారు మనోజ్‌కుమార్ ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 5న హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్క్ వద్ద నిర్వహించే ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సదానందం, రాజగోపాల్, సురేందర్‌రెడ్డి, వెంకటరమణ, జయశ్రీ, విజయశ్రీ, సునిత, ఉమాదేవి, రాజ్‌కుమార్, రంగనాయకి పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, జూలై30(ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి తెలిపారు.

మిగతా 15మందికి రూ.12,500 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 7గురు వాహనదారులకు రూ.7,800 జరిమానా విధించినటు తెలిపారు.

జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా సాగరికరావు



కాజీపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా కాజీపేటకు చెందిన తక్కళ్లపల్లి సాగరిక రావు మరోసారి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరి కేసీ వేణుగోపాల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె గతంలో జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షురాలిగా, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ అధ్యక్షురాలిగా పనిచేశారు. జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ఎన్నికయ్యారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కుల రమాకాంత్ రెడ్డి సతీమణి, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జాతీయ కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సాగరిక రావు ప్రస్తుతం తమిళనాడు, అండమాన్ నికోబార్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు.

వరంగల్ నగరాభివృద్ధికి బాటలు

హైదరాబాద్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ తాజ్‌బంజారా హోటల్‌లో జరిగిన స్టే హోల్డర్ వర్క్‌షాప్‌లో వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో పాటు కుడా అధికారులు పాల్గొన్నారు. డైరెక్టర్ జనరల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ నిర్వహించిన కార్యక్రమంలో మునిపల్ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ నగర అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. 'రిజోనేషన్ ఆఫ్ ఎగ్జిస్టింగ్ వర్స్ మ్యాపింగ్ ఆఫ్ మునిపల్ అసెట్స్ సిటీ గ్రీన్ అండ్ అర్బన్ ఫారెస్ట్ పార్ట్‌వేర్ స్పాంజ్ సిటీ ఇన్ షెడ్యూల్ అనే అంశంపై సమీక్ష నిర్వహించారు.

ఇంకా వరంగల్ నగరంలో స్పాంజ్ పార్క్‌ల ఏర్పాటుపై రాష్ట్ర ఉన్నతాధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్, ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఏసీపీలు నస్రీన్‌బాను, రజిత, ఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, కుడా సీపీవో అజిత్‌రెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ వర్గాలకు ఊడిగం

(5వ పేజీ తరువాయి)

ముందుకు సాగుతోందన్నారని విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ఆదివాసీలను హత్య చేస్తున్నదని, కమ్యూనిస్టులను అంతం చేయాలని కుట్ర చేస్తున్నదన్నారు. మవోయిస్టులపై చేపట్టిన మారణకాండను నిలిపివేయాలని సీపీఐ మొదటి నుంచి పోరాడుతోందన్నారు. కమ్యూనిస్టులను అంతం చేయలేరని, కమ్యూనిజం ప్రపంచవ్యాప్త సిద్ధాంతం అన్నారు.

కమ్యూనిస్టులు అన్ని దేశాలలో ఉన్నారన్న విషయం రాష్ట్రంలో బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్‌రావు గుర్తెరగాలని, అసలు కమ్యూనిస్టులకు బద్ధశత్రువే బీజేపీ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి ప్రజలను ఆదుకోవాలని, పేదలు వేసుకున్న గుడిసేలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి పక్కా ఇళ్లు నిర్మించాలన్నారు. సీపీఐ రాష్ట్ర షహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ రాలేదని, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ పనులు పూర్తికాలేదన్నారు. వరంగల్ జిల్లాలో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న పేదలకు ఇళ్ళ పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, పల్లె నర్సింహా, వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కే బాషుమియా, పనాస ప్రసాద్, నాయకులు గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, అక్కనపెల్లి రమేష్, బుస్సా రవిందర్, తోట చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా నగరంలో భారీ ర్యాలీని నిర్వహించారు. శివనగర్‌లోని సీపీఐ కార్యాలయం తమ్మెరభవన్ నుంచి అండర్‌బ్రిడ్జి మీదుగా వరంగల్ పోస్టాఫీస్, చౌరస్తా, మండిబజార్, పోచమ్మమైదాన్ అబ్బాస్ ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీ కొనసాగింది.

కౌన్సెలింగ్

ఈ సమస్యతో గర్భం దాల్చేదెలా?

నాకు పి.సి.ఓ.డి (పాలీసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్) సమస్య ఉంది. గర్భం దాల్చడానికి చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. నా సమస్య తీరేదెలా?

- ఓ సోదరి, విశాఖపట్నం



పి.సి.ఓ.డి మహిళలను శారీరకంగా, మానసికంగా కుంగదీసే సమస్య! ఈ సమస్యతో వచ్చే ఇన్‌ఫర్టిలిటీని సమర్థంగా అధిగమించాలంటే అందుకు అన్ని విధాలుగా సంసిద్ధులు కావాలి. శరీరంలో అవకతవకలకు గురయ్యే హార్మోన్ల ప్రభావం మూలంగా నెలసరి క్రమం తప్పి గర్భధారణకు తగిన సమయాన్ని కనిపెట్టే వీలివ్వని పరిస్థితి తలెత్తుతుంది. ఇలాంటప్పుడు ధైర్యం కోల్పోకుండా వైద్యులను కలవడంతోపాటు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే....

- శరీర బరువును తగ్గించుకోవాలి
- ఆరోగ్యకరమైన ఆహార, జీవనశైలులను అనుసరించాలి
- ఒత్తిడిని తగ్గించుకోవాలి
- వైద్యులు సూచించే ఇతరత్రా పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలి
- ఈస్ట్రోజెన్ మెటాబాలిజంను పెంచే ఆహారం తీసుకోవాలి.
- సమర్థమైన మందులతో హార్మోన్లు సక్రమంగా, సమంగా స్రవించేలా, క్రమం తప్పక అండం విడుదలయ్యేలా చూసుకోవాలి

డాక్టర్ షర్మిలా మజుందార్
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్
హైదరాబాద్.

స్ఫూర్తి

చాలామంది పిల్లలు చేతిలో ఫోన్ ఉంటే చాలు సామాజిక మాధ్యమాలు చూస్తూ సమయం వృథా చేస్తారు. కానీ చండీగఢ్‌కు చెందిన జాన్వీ జిందాల్ అలా కాదు. యూట్యూబ్ వీడియోలు చూసి ఫ్రీస్టైల్ స్కేటింగ్‌లో మెలకువలు నేర్చుకుని 17 ఏళ్లకే అయిదు గిన్నిస్ రికార్డులు సొంతం చేసుకుంది. అతిచిన్న వయసులోనే ఈ ఘనత సాధించిన జాన్వీ జర్నీ ఇది!

గిన్నిస్ రికార్డుల జాన్వీ!



జాన్వీకి బాల్యం నుంచి చదువుతో పాటే క్రీడలంటే ఇష్టం. దాంతో తరచూ సాహస క్రీడల్లో పాల్గొనేది. అలా చిన్నప్పటి నుంచే స్కేటింగ్ మీద మక్కువ పెంచుకుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడవడంతో ఎనిమిదేళ్ల వయసులోనే రోలర్ స్కేట్స్‌తో సాధన ప్రారంభించింది. 'రోలర్ స్కేట్స్ కొనివ్వమని నాన్నను అడిగాను. ఆయన వెంటనే కొనిచ్చారు. తరువాత యూట్యూబ్ వీడియోల ద్వారా సొంతంగా మెలకువలు నేర్చుకోవడం ప్రారంభించా. అది చూసి నాన్నే నాకు కోచ్‌గా మారారు' అని చెబుతోంది జాన్వీ.

ఆమె తండ్రి మునీష్ జిందాల్ పగలంతా ఉద్యోగం చేసి రాత్రి యూట్యూబ్ వీడియోలు చూసి జాన్వీకి మెలకువలు నేర్పేవారు. అలా తండ్రి సాయంతో ఫ్రీస్టైల్ స్కేటింగ్‌లో పట్టు సాధించారు ఆమె. 2019లో తొలిసారి జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో పాల్గొన్నారు జాన్వీ జిందాల్. 2019లో 57వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో తొలిపతకం గెలుచుకున్నారు. ఆ తరువాత పలు జాతీయస్థాయి పోటీల్లో స్వర్ణ, కాంస్య పతకాలు తన ఖాతాలో వేసుకున్నారు. స్కేటింగ్ చేస్తూ 'భాంగ్రా' నృత్యం చేసిన మొదటి వ్యక్తిగాను జాన్వీ ఘనత సాధించారు. ఈ విన్యాసానికి గాను ఆమెకు 2021 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్'లో స్థానం దక్కింది. గతేడాది స్కేటింగ్‌లో ఐదు గిన్నిస్ రికార్డులను తన పేరిట లిఖించుకున్నారు. 'పతకాలు గెలిచే కొద్దీ నాలో ఆత్మవిశ్వాసం పెరుగుతూ వచ్చింది. దాంతో సరికొత్త విన్యాసాలు సాధన చేయడం మొదలుపెట్టా. అయితే ఈ విన్యాసాలు అంత సులభం కాదు. బ్యాలెన్సింగ్ కోసం శారీరక దృఢత్వం ఎంతో అవసరం. కాబట్టి వ్యాయామాలు చేస్తాను' అంటున్నారామె. ప్రస్తుతం జాన్వీ ఇంటర్ రెండో ఏడాది చదువుతున్నారు.

నా లక్ష్యం అదే


"స్కేటింగ్‌లో ఇప్పటికే ఎన్నో జాతీయస్థాయి పతకాలు సాధించా. ఐదు గిన్నిస్ రికార్డులు కూడా సొంతం చేసుకున్నా. ఈ రికార్డులను నా తల్లిదండ్రులకు అంకితమిస్తున్నా. ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకం సాధించాలన్నది నా లక్ష్యం. అయితే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనాలంటే చాలా ఖర్చవుతుంది. అంత డబ్బు సమకూర్చుకోవడం కూడా పెద్ద సవాలే. ఎన్ని ఇబ్బందులు, సవాళల ఎదురైనా నా లక్ష్యం సాధించే వరకు విశ్రమించను."



కష్టపడితే ఏదైనా సాధ్యమే...

ఇష్టంగా కష్టపడితే ఏదైనా సాధించవచ్చని అంటున్నారు జాన్వీ జిందాల్. తాను ఫుట్‌పాత్ మీద ప్రాక్టీస్ చేసేదాన్నని గుర్తు చేసుకున్నారామె. మొదట్లో ప్రాక్టీస్ చేసేటప్పుడు రోజుకు 40-50 సార్లు కిందపడేదాన్నని, అయినా సరే లేచి సాధన కొనసాగించానని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఇష్టం, కష్టం.. ఇవి రెండు మనల్ని ఎంతటి ఎత్తులకైనా చేర్చుతాయని చెబుతున్నారామె.

విజేత



నాన్న భవన నిర్మాణ కూలీ. అమ్మ.. ముగ్గురు సంతానం.. అందరూ ఆ సంపాదనతోనే బతకాలి. కష్టాలు... సమస్యలు... సవాళ్లు... ఒకవైపు బతుకు పోరాటం. మరోవైపు... ఏదిఏమైనా సాధించి తీరాలన్న మహోన్నత ఆశయం. అదే ఆమెను విజేతగా నిలిపింది. 'ఆసియా యూత్ అండ్ జూనియర్ చాంపియన్‌షిప్స్' వెయిట్ లిఫ్టింగ్‌లో మూడు స్వర్ణ పతకాలు నెగ్గి... కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించింది. **రెడ్డి భవానీ**... మారుమూల పల్లె నుంచి ట్రిపుల్ గోల్డ్ వరకు సాగిన ఆమె జైత్రయాత్ర 'నవ్య'కు ప్రత్యేకం.

భవానీ... బంగారం

వదిలేద్దామని అనుకున్నా...

మా ఇల్లు అమ్మినప్పుడు వెయిట్‌లిఫ్టింగ్ వదిలేద్దామని అనుకున్నా. ఏదైనా పని చేసి నాన్నకు కాస్తయినా భారం తగ్గిద్దామనే ఆలోచన. కానీ కోచ్ ప్రోత్సాహంతో ఆ ఆలోచన విరమించుకున్నా. మా కుటుంబ పరిస్థితి తెలుసుకున్న విజయనగరం కలెక్టర్ అంబేడ్కర్... మానవతా హృదయంతో స్పందించారు. మాకు ఓ ఇంటిని మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పరంగా నాకు అవసరమైన సాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

"రోజంతా కష్టపడితే నాన్నకు వచ్చేది ఐదారు వందల రూపాయలు. అదికూడా పని ఉన్నప్పుడే. దాంట్లోనే మా కుటుంబం నడవాలి. అంతులేని కష్టాలు... వచ్చేది సరిపోక పస్తులు... ఇవేవీ మాకు కొత్త కాదు. అయినా క్రీడల పట్ల నాకున్న ఆసక్తిని గమనించి, ప్రోత్సహించింది అమ్మ మాధవి. మా నాన్న ఆదినారాయణ కూడా అందుకు అడ్డు చెప్పలేదు. తిన్నా తినకపోయినా... ఇంట్లో ఎన్ని ఇబ్బందులు పడినా... ఏ రోజూ నన్ను నిరుత్సాహపరచలేదు. విజయనగరం జిల్లా కొండకరకం గ్రామంలో ఓ పేద కుటుంబం మాది. నాన్న భవన నిర్మాణ కూలీ. అక్క, చెల్లి, నేను... మేం ముగ్గురు సంతానం.

అమ్మతో స్టేడియానికి...

మా ప్రాంతంలో కె.వెంకటలక్ష్మి, మొయిదా రామకృష్ణ తదితరులు వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణించారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆ స్ఫూర్తితో అమ్మ నన్ను కూడా వెయిట్‌లిఫ్టర్‌ను చేయాలని కలలు కన్నది. వాళ్లకు శిక్షణ ఇచ్చిన కోచ్ చల్లా రాము వద్ద నన్ను చేర్పించింది. అప్పుడు నాకు పదేళ్లు. అమ్మ రోజూ నన్ను వెంటబెట్టుకొని స్టేడియానికి తీసుకువెళ్లేది. శిక్షణ అయ్యేవరకూ వేచి ఉండేది. ఒక పక్క ఇంటి పనంతా చేసుకొంటూ... మరోవైపు నా కోసం గంటలకు గంటలు సమయం కేటాయించేది. అలా నాలుగేళ్లు అక్కడే శిక్షణ తీసుకున్నా.

ఇల్లు అమ్మి...

2021 నా కెరీర్‌లో మరపురాని సంవత్సరం. ఆ ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాను. కాంస్య పతకం సాధించాను. అది నాలో ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. మరుసటి ఏడాది ఏలూరులోని స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌కు ఎంపిక అవ్వడానికి దోహదపడింది. అదేసమయంలో మా అక్క పెళ్లి కుదిరింది. నా కోచింగ్, పెళ్లి ఖర్చులు... నాన్నకు తలకు మించిన భారమైంది. దిక్కుతోచని స్థితి. చివరకు నాన్న ఇల్లు అమ్మేశారు. అయినా ఆర్థిక ఇబ్బందులు తీరలేదు. దీంతో వెయిట్‌లిఫ్టింగ్ ఆపేద్దామని అనుకున్నా. కానీ నా పరిస్థితిని గమనించిన కోచ్ గడిపల్లి ఆనంద్ నాకు అండగా నిలిచారు.



సాధన ఒక్కటే సరిపోదు...

ఏ క్రీడాకారుడైనా సరే.. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే సాధన ఒక్కటే సరిపోదు. సరైన పౌష్టికాహారం కూడా ఎంతో ముఖ్యం. దానికి నెలకు కనీసం రూ.30 వేలు ఖర్చవుతుంది. మా నాన్న ఎన్నో అవస్థలు పడి ఐదు వేల వరకు సమకూరుస్తున్నారు. అంతకు మించి భరించలేని నిస్సహాయత. ఆ సమయంలోనే కోచ్ ఆనంద్ నా ప్రతిభను గుర్తించి, అండగా నిలిచారు. నా శిక్షణ కోసం తన డబ్బు ఖర్చు చేశారు. మరోవైపు తరచూ పోటీలు, శిక్షణవల్ల నా చదువు సరిగ్గా సాగలేదు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాశాను.

మరో మెట్టు పైకి...

నా కోసం అమ్మానాన్నలు ఎన్నో త్యాగాలు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే చూడాలని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు అహర్నిశలూ శ్రమించాను. ఒక్కో అడుగు ముందుకు వేశాను. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాను. దాంతో ఔరంగాబాద్ 'స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా' (సాయ్) ఆధ్వర్యంలోని 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు ఎంపికయ్యాను. 2022, 2024లో మెక్సికోలో జరిగిన అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నాను. కానీ పతకం సాధించలేకపోయాను. మరింత కసితో సాధన చేశాను. గత ఏడాది జాతీయ పాఠశాల క్రీడా పోటీల్లో రజతం గెలవడంతో నాలో ఉత్సాహం నింపింది.

ఆసియా యూత్ చాంపియన్‌షిప్...

నా కెరీర్‌లో అతిపెద్ద విజయం... ఈ ఏడాది జూలై 4న కజకిస్తాన్‌లో జరిగిన 'ఆసియా యూత్ అండ్ జూనియర్ చాంపియన్‌షిప్' వెయిట్‌లిఫ్టింగ్‌లో మూడు స్వర్ణ పతకాలు సాధించడం. దీనికి ముందు మెరుగైన శిక్షణ కోసం మెక్సికోలో ఐడబ్ల్యూఎఫ్ ట్రైనింగ్ క్యాంప్‌కు వెళ్లాల్సి వచ్చింది. దాంతో చదువు దెబ్బతింది. కానీ ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ తరపున ట్రిపుల్ గోల్డ్ మెడల్స్ సాధించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. అంతేకాదు... ఈ విజయం స్కాట్‌లాండ్‌లోని గ్లాస్గోలో జరిగే 2026 కామన్వెల్త్ గేమ్స్‌కు అర్హత సాధించిపెట్టింది. ఇప్పుడు పాటియాలాలోని 'నేతాజీ సుభాష్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్'లో గేమ్స్ కోసం సన్నద్ధమవుతున్నాను. భారత్‌కు పతకం తేవాలన్న ఏకైక లక్ష్యంతో సాధన చేస్తున్నాను."

• **బి. శ్రీనివాసరావు,** విజయనగరం

సబ్జా గింజలతో అందం... ఆరోగ్యం!

సబ్జా గింజలు శరీరంలో వేడిని తగ్గిస్తాయని తెలిసిందే. అయితే వాటి వలన మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, అందానికి వన్నెలద్దడంతోనూ అవి ఉపయోగపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం...



- సబ్జా గింజలోని యాంటీ ఫంగల్, యాంటీ బయోటిక్, యాంటీ మైక్రోబియల్ లక్షణాలు చర్మ ఇన్ఫెక్షన్లను దరి చేరనీయవు.
- డీటాక్స్ గుణాలు చర్మంలోని టాక్సిన్లకు బయటకు పంపుతాయి. దాంతో చర్మం మెరుస్తుంది.
- ఈ గింజల్లో విటమిన్ ఎ, సి పుష్కలంగా ఉంటాయి. చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి.
- సబ్జా గింజల్లోని ప్రొటీన్లు, బీటా కెరోటిన్, విటమిన్ కె- కురులకు పోషణ అందించి దృఢంగా మార్చుతాయి.

ఆరోగ్యం కూడా

- సబ్జా గింజల్లోని అధిక పీచు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని నియంత్రించి బరువు తగ్గడంలో సహాయపడుతుంది.
- సబ్జా గింజలు ఎడిడిటిని దరిచేరనీయవు. శరీరంలోని వేడిని తగ్గిస్తాయి.
- రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రిస్తాయి.
- ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి.

ఆమె నేపథ్యం... పేదరికం. భారం దించుకొందామని తల్లిదండ్రులు చిన్న వయసులోనే పెళ్లికి బలవంతం పెట్టినా... తలొగ్గలేదు. సామాజిక కట్టుబాట్లను కాదని... మధ్యలో ఆగిన చదువును కొనసాగించి... నేడు తన కాళ్లపై తాను నిలబడింది. రచన కుమారి... 23 ఏళ్ల ఈ యువతి చిత్రకళలో వినూత్న పంథాను చొప్పించి... విజయవంతమైన వ్యాపారవేత్తగా ఎదిగి... మరికొందరికి ఉపాధి మార్గమైంది.



బతుకు చిత్రాన్ని మార్చుకుంది



"ఊహ తెలిసినప్పటి నుంచీ ఒకటే కల... బాగా చదువుకోవాలి. నేను, నా కుటుంబం ఉన్నతంగా బతకాలి. కానీ పేదరికం ప్రతి అడుగులోనూ అవరోధంగా మారింది. దానికి సామాజిక కట్టుబాట్లు తోడై... చదువుకోవాలన్న నా ఆకాంక్షను మధ్యలోనే తుంచేశాయి. ఉత్తరప్రదేశ్ బహ్రైచ్ జిల్లా చితాన్‌పూర్వ గ్రామం మాది. అమ్మానాన్న చిన్న చిన్న పనులు చేసేవారు. కానీ వారి సంపాదన ఏమాత్రం సరిపోయేది కాదు. తినడానికి తిండి లేక పస్తులున్న సందర్భాలు ఎన్నో. అవాంతరాలు ఎన్ని ఎదురైనా ఏ రోజూ నేను బడి మానేయలేదు. పదో తరగతిలోకి వచ్చేసరికి... ఉన్నట్టుండి ఇంట్లోవాళ్లు బడి మాన్పించేశారు. కారణం... స్కూలు కోసం వేరే ఊరు వెళ్లాలి. పెరుగుతున్న అమ్మాయిని అంత దూరం పంపించడానికి మా కమ్యూనిటీ అభ్యంతరం చెప్పింది. నేను ఎంత మొరపెట్టుకున్నా మా పెద్దలు కూడా ఒప్పుకోలేదు. అలాగని ఊళ్లో ఉన్న ప్రైవేటు పాఠశాలలో చదివించే స్థోమత మాకు లేదు. చేసేది లేక ఇంటికే పరిమితమయ్యాను.

పెళ్లి తప్పించుకొని...

పదిహేడేళ్ల వయసులో అమ్మానాన్న నాకు పెళ్లి చేద్దామని నిర్ణయించుకున్నారు. నేను ససేమిరా అన్నాను. ఇప్పుడే పెళ్లి వద్దని, ఒకరిపై ఆధారపడకుండా జీవించే స్థాయికి ఎదగాలని కోరుకొంటున్నానని చెప్పాను. అవేవీ వాళ్లు వినలేదు. పెళ్లి చేసుకోవాల్సిందేనని బలవంతం పెట్టారు. ఎన్నో ఘర్షణల తరువాత... నా దారిన నన్ను వదిలేశారు. అదే సమయంలో 'అగాఖాన్ ఫౌండేషన్' (ఏకేఎఫ్) వారు మా ఊళ్లో పలు వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారని తెలిసింది. వారిని సంప్రతించాను. గోధుమ గడ్డితో రూపొందించే కళాకృతులు నన్ను బాగా ఆకర్షించాయి. అందులో శిక్షణ తీసుకున్నా.

కళాకృతులు చేసి...

శిక్షణ పూర్తయ్యాక మా ఊళ్లోని మార్కెట్ ప్రాంతంలో ఒక చిన్న షాపు అద్దెకు తీసుకున్నా. అందులో గోధుమ గడ్డితో తయారైన కళాకృతుల విక్రయం ప్రారంభించాను. చూడగానే విభిన్నంగా ఉండటంతో మార్కెట్‌కు వచ్చిపోయే వారందరినీ నా చిత్రాలు విశేషంగా ఆకర్షించాయి. దాంతో కొద్ది కాలంలోనే చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా దీని గురించి తెలిసింది. ఊహించిన దానికంటే తక్కువ సమయంలోనే మంచి డిమాండ్ ఏర్పడింది. ఖర్చులు పోనూ కొంత మిగులు కనిపించింది. ఇది నాలో ఎనలేని ఉత్సాహాన్ని ఇచ్చింది.

నాలాంటివారి కోసం...

చిత్రాల ద్వారా ఆదాయం పెరగడంతో కొత్త ఆలోచన వచ్చింది. నాలానే పేదరికంలో మగ్గుతూ, ఏ ఆధారం లేక ఇబ్బందులు పడుతున్న ఔత్సాహిక బాలికలకు ఈ కళలో శిక్షణ ఇవ్వాలని అనుకున్నా. అదే సమయంలో చదువు కొనసాగించాలని నిర్ణయించుకున్నా. బీఏలో చేరా. ప్రస్తుతం మూడో సంవత్సరం. చదువుకొంటూనే షాపు చూసుకొంటున్నా. ఆసక్తి గల అమ్మాయిలకు చిత్రకళ నేర్పిస్తున్నా. వారి నుంచి నామమాత్రపు ఫీజు తీసుకొంటున్నా. వారానికి ఆరు రోజులు శిక్షణ ఇస్తున్నా. పన్నెండు నుంచి పదిహేడేళ్ల మధ్య వయసుగల ఇరవైమంది బాలికలు ఇప్పుడు నా దగ్గర నేర్చుకొంటున్నారు. నెల రోజుల ఈ శిక్షణ పూర్తిచేసుకున్న కొందరు తమ చిత్రాల ద్వారా ఆదాయం కూడా పొందుతున్నారు. ఇలాంటి మార్పే నేను కోరుకున్నది. ఆడపిల్ల ఒకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదగాలి. కట్టుబాట్ల పేరుతో తల్లిదండ్రులు వారి ఆశయాలు, ఆలోచనలను మొగ్గలోనే చిదిమేయకుండా... ప్రోత్సహిస్తే అసాధ్యమనేది ఏదీ ఉండదని అర్థం చేసుకోవాలి."

రెండు వందలకు పైనే...

"గత ఏడాది షాపు ప్రారంభించాను. ఇప్పటివరకు నేను తయారు చేసిన రెండు వందలకు పైగా చిత్రాలు అమ్ముడయ్యాయి. ఒక్కొక్కటీ వెయ్యి నుంచి మూడు వేల రూపాయల వరకు ధర పలికింది. ఒక చిత్రం రూపొందించడానికి పది గంటలకు పైనే సమయం పడుతుంది. గోధుమ గడ్డిని సన్నని తీగల్లా చేసి, దాన్ని వస్త్రంపై చిత్రంలా తీర్చిదిద్దాలి. ఎంతో శ్రమతో కూడుకున్న పని ఇది. నా ప్రతిభను, విజయాలను గుర్తించిన అగాఖాన్ ఫౌండేషన్ వారు నన్ను తమ సంస్థలో శిక్షకురాలిగా నియమించారు. ఈ జీతం, నా షాపుపై వచ్చే ఆదాయంతో మా కుటుంబం ఇప్పుడు ఎంతో సంతోషంగా జీవిస్తోంది."




అభిరుచులకూ ఇవ్వాలి సమయం...

మనందరికీ పుస్తక పఠనం, సంగీతం, రచనా వ్యాసాంగం, ఆటలు... ఇలా ఏదో ఒక అభిరుచి ఉండే ఉంటుంది. కానీ సమయాభావం అంటూ వాటిని పక్కన పెట్టేస్తూ ఉంటాం. అలాకాకుండా రోజూ కొన్ని చిట్కాలు పాటించి కొంత సమయాన్ని అభిరుచుల కోసం కేటాయించుకోవచ్చు.

- ముందుగా అవసరం లేని పనులు చేయకూడదు. ఉదాహరణకు ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడడం, తరచూ షాపింగ్ కోసమని వెళ్లడం, ఎక్కువగా టీవీ చూడడం లాంటివి. దీనివల్ల రోజూ కొంత సమయం మిగులుతుంది.
- బొమ్మలు గీయడం, నృత్యం చేయడం, సంగీత పరికరాలు వాయించడం ఇలా ఆసక్తి ఉన్న అంశం మీద రోజూ అరగంట సాధన చేయాలి. అవసరమైతే శిక్షణ కూడా తీసుకోవచ్చు. ఇలా చేస్తూ ఉంటే క్రమంగా ఒకప్పుడు అనుకున్న లక్ష్యం సాధించవచ్చు.
- రోజూ చేయాల్సిన పనులను పక్కన పెట్టడం, వాయిదా వేయడం లాంటివి చేయకూడదు. దీనివల్ల వాటికి సంబంధించిన ఆలోచనలతో ఏకాగ్రత కుదరదు. సమయానుసారం పనులు పూర్తిచేసిన తరవాత మాత్రమే మీకిష్టమైన అంశాలమీద దృష్టి నిలపాలి.
- ఒకేసారి గంటల సమయం కాకుండా పావుగంటతో మొదలుపెట్టి క్రమంగా సమయాన్ని పెంచుకోవాలి. వారాంతాల్లో కనీసం రెండు గంటలు అభిరుచులకోసం కేటాయించుకోవాలి.
- అన్ని పనులనూ ఒక్కరమే చేయాలన్న భావనతో ఉండకుండా కుటుంబసభ్యుల సహాయం తీసుకుంటూ ఉండాలి. అప్పుడే రోజూ కొంత సమయం దొరుకుతుంది.
- ఏ పనికి ఎంత సమయం పెట్టాలో ముందుగానే నిర్ణయించుకోవాలి. అత్యవసరమైనవాటిని త్వరగా పూర్తిచేయాలి. సమయం వృథాకాకుండా చూసుకోవాలి. అప్పుడే అభిరుచులకూ సమయం దొరుకుతుంది.









మెగా మాస్

చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విశ్వంభర'. ఇటీవలే చివరి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తి చేశారు. ఈ షెడ్యూల్‌లోనే ఓ ప్రత్యేక గీతాన్ని తెరకెక్కించారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన మాస్ బీట్‌కు చిరుతో బాలీవుడ్ భామ మౌనీరాయ్ స్టెప్పులేశారు. ఈ గీతానికి గణేశ్ ఆచార్య నృత్యరీతులు సమకూర్చారు. ఈ సందర్భంగా సెట్స్‌లో చిరంజీవితో దిగిన ఫొటోలను మౌనీ రాయ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. చిరంజీవి సర్‌తో కలసి డాన్స్ చేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని ఆమె తెలిపారు. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. త్వరలో విడుదల తేదీని ప్రకటించనున్నారు.

పరాటా చేయడం నేర్చుకున్నా



విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి, నిత్యా మీనన్ జంటగా పాండిరాజ్ తెరకెక్కించిన చిత్రం 'సార్ మేడమ్'. సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మించారు. ఇటీవలె తమిళ్‌లో విడుదలైందీ చిత్రం. ఈ శుక్రవారం తెలుగులో విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ వేడుకలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ "ఈ సినిమాకు తమిళ్‌లో మంచి విజయం దక్కింది. తెలుగులోనూ పెద్ద విజయం సాధిస్తుందని నమ్మకముంది. ఈ సినిమా కోసం పరాటా చేయడం నేర్చుకున్నాను. కథను నమ్మి చేసిన చిత్రమిది" అని అన్నారు. "ఇది యూనివర్సల్ సబ్జెక్ట్. అందరూ రిలేట్ చేసుకుంటారు" అని నిర్మాత త్యాగరాజన్ చెప్పారు. "ఇది ప్రేక్షకులకు మంచి హోమ్ ఫుడ్ లాంటి సినిమా" అని దర్శకురాలు నందినీ రెడ్డి తెలిపారు. "భార్యాభర్తల మధ్య జరిగే అందమైన ప్రేమకథ ఈ చిత్రం" అని పాండిరాజ్ అన్నారు.



బుకింగ్స్‌కు అద్భుత స్పందన

విజయ్ దేవరకొండ

'థియేటర్‌కు వచ్చిన ప్రతి ప్రేక్షకుడికీ 'కింగ్‌డమ్' చిత్రం మంచి అనుభూతిని ఇస్తుంది. కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో కథ సాగుతుంది. సినిమా మొదలైన రెండు నిమిషాలకే ప్రేక్షకులు కింగ్‌డమ్ ప్రపంచంలోకి వెళ్తారు. 'జెర్సీ' లాంటి గుర్తుండిపోయే చిత్రాన్ని అందించిన గౌతమ్ తిన్ననూరి తనదైన శైలిలో తెరకెక్కించారు. సినిమా అవుట్‌పుట్ పట్ల మేం పెట్టుకున్న నమ్మకం నిజమైంది. బుకింగ్స్‌కు వస్తున్న అద్భుత స్పందన వస్తోంది' అని విజయ్ దేవరకొండ అన్నారు. ఆయన కథానాయకుడిగా సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన 'కింగ్‌డమ్' చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'రోమాంచిత పోరాట ఘట్టాలతో భారీ హంగులతో సినిమాను రూపొందించాం. మనసుకు హత్తుకునే భావోద్వేగాలున్న కథ ఇది' అన్నారు. సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ 'ఈ మధ్యకాలంలో సినిమాలకు భారీ ఓపెనింగ్స్ రావడం కష్టమైంది. 'కింగ్‌డమ్' చిత్రం ఆ పరిస్థితిని అధిగమించింది. మంచి వసూళ్లతో సినిమా ఘన విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు.

పవన్‌కల్యాణ్ అభినందనలు...

అన్నపూర్ణ స్టూడియోలోనే పవన్‌కల్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' పాట చిత్రీకరణ జరుగుతుండడంతో 'కింగ్‌డమ్' యూనిట్ సభ్యులు ఆయన్ని కలిశారు. సినిమా విజయం సాధించాలని టీమ్‌ను అభినందించారు పవన్‌కల్యాణ్.

వినోదాత్మక చిత్రం



లావణ్య త్రిపాఠి లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'సతీ లీలావతి'. తాతినేని సత్య దర్శకత్వంలో నాగ మోహన్ నిర్మిస్తున్నారు. సినిమా త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ చిత్ర టీజర్‌ని రిలీజ్ చేశారు. భార్యాభర్తల కథతో తీసిన వినోదాత్మక చిత్రంగా టీజర్‌ని చూస్తే అర్థమవుతోంది. భార్యగా లావణ్య, భర్తగా దేవ్ మోహన్ నటించారు. పెళ్లి చేసుకొన్న కొన్నాళ్లకే ఇక మనం కలిసుండలేం అని భర్త అంటే.. అతన్ని ఇంట్లోనే తాళ్లతో కట్టిపడేస్తుంది భార్య. ఆ తరవాత ఏం జరిగిందనేది ఆసక్తికరం. టీజర్‌లో లావణ్య, దేవ్‌మోహన్‌తో పాటు వీటీవీ గణేశ్, సప్తగిరి తదితరులు కనిపించారు. కాగా, ఈ సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు.

అలరించే ప్రేమకథా చిత్రం

హెబ్బా పటేల్, ధనుష్ రఘుముద్రి జంటగా నటించిన చిత్రం 'థాంక్యూ డియర్'. తోట శ్రీకాంత్ కుమార్ దర్శకత్వంలో పప్పు బాలాజీ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం బుధవారం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. శ్రీకాంత్ కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథా చిత్రం ఇది. తెరపై అందమైన ప్రణయ భావనల్ని ఆవిష్కరి




స్తుంది. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన ఓ ముఖ్యమైన పాయింట్‌ను తీసుకొని ఈ సినిమా తెరకెక్కించాం' అన్నారు. బాలాజీ మాట్లాడుతూ 'మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. ప్రేక్షకులు ఆశించే అంశాలతో అలరిస్తుంది' అని తెలపారు. ఈ చిత్రంలోని ఎమోషన్స్ చాలా కాలం పాటు ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోతాయి అని కథానాయిక రేఖా నిరోషా చెప్పారు.

నటి పాయల్ రాజ్‌పుత్ ఇంట విషాదం



నటి పాయల్ రాజ్‌పుత్ ఇంట విషాదం నెలకొంది. ఆమె తండ్రి విమల్ కుమార్ (67) కన్నుమూశారు. కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన సోమవారం తుదిశ్వాస విడిచినట్లు పాయల్ రాజ్‌పుత్ తెలిపారు. ఈ మేరకు సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. 'ప్రతీక్షణం నిన్ను మిస్ అవుతూనే ఉంటా నాన్నా. మీరు క్యాన్సర్‌ను జయిస్తారని అనుకున్నాను. మీకు మనోధైర్యం ఇవ్వడానికి నేను చేయాల్సిందల్లా చేశాను. మిమ్మల్ని కాపాడుకోలేకపోయాను, క్షమించండి" అని పేర్కొన్నారు.





సమం చేస్తారా?

జోష్‌లో యువ భారత్



- సూపర్ ఫామ్‌లో గిల్, జడేజా, రాహుల్
- బుమ్రాపై కొనసాగుతున్న సస్పెన్స్
- స్టోక్స్ దూరం
- డీలాపడిన ఇంగ్లండ్

ఆఖరి టెస్ట్ నేటి నుంచే
మ. 3.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

లండన్: మాంచెస్టర్ టెస్ట్‌లో అద్భుత పోరాటాన్ని ప్రదర్శించిన భారత జట్టు.. ఇంగ్లండ్ పర్యటనను విజయంతో ముగించాలనుకొంటోంది. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో 1-2తో వెనుకంజలో ఉన్న శుభ్‌మన్ గిల్ సేన.. గురువారం నుంచి ఓవల్‌లో జరిగే ఐదో, ఆఖరి మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో ఉంది. లార్డ్స్‌లో క్రాలేతో గిల్ వాగ్వాదం.. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో స్టోక్స్ డ్రా ప్రతిపాదనకు జడేజా నో చెప్పడం.. తాజాగా క్యూరేటర్ లీ ఫోర్టిస్‌పై గంభీర్ ఆగ్రహం లాంటి ఘటనలతో సిరీస్ హాట్‌హాట్‌గా మారింది. రోహిత్, కోహ్లీ, అశ్విన్ లాంటి స్టార్లు లేకుండా.. యువ ఆటగాడు గిల్ సారథ్యంలో ఇంగ్లండ్ వెళ్లిన భారత్ కొన్నిసార్లు తడబడినా.. ఓవరాల్‌గా ఢీ అంటే ఢీ అన్నట్టుగానే ఎదురు నిలిచింది. పైగా, స్టోక్స్ గైర్హాజరీలో డీలాపడ్డ ఇంగ్లండ్‌కు నాకౌట్ పంచ్ ఇచ్చేందుకు గిల్ సేనకు ఇదో సువర్ణావకాశం.


ఇంగ్లండ్ సారథి పోప్

గిల్ మరో 52 పరుగులు సాధిస్తే.. ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు స్కోరు చేసిన భారత ఆటగాడిగా సునీల్ గవాస్కర్‌ను అధిగమిస్తాడు. ఈ సిరీస్‌లో గిల్ ఇప్పటి వరకు 722 రన్స్ చేశాడు.

బ్యాటర్లు అదరహో..

నాలుగో టెస్ట్‌లో చాలా భాగం ఆతిథ్య జట్టుదే ఆధిపత్యమే అయినా.. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటర్ల అసాధారణ పోరాటంతో భారత్ డ్రాతో గట్టెక్కింది. ముఖ్యంగా కీలక బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉండడం టీమిండియా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. ఓపెనర్ రాహుల్ నిలకడగా రాణిస్తుండగా.. గిల్ మళ్లీ టచ్‌లోకి రావడం శుభపరిణామం. అయితే, మరో ఓపెనర్ జైస్వాల్ వరుస వైఫల్యాలు జట్టును దెబ్బ తీస్తున్నాయి. సాయి సుదర్శన్ క్రీజులో నిలిచేందుకు ప్రయత్నించాలి. గత మ్యాచ్‌లో చిరస్మరణీయ శతకాలు సాధించిన జడేజా, సుందర్ నుంచి జట్టు అదే తరహా ప్రదర్శనను కోరుకొంటోంది. గాయంతో రిషభ్ పంత్ చివరి మ్యాచ్‌కు దూరమవడంతో.. ధ్రువ్ జురెల్ కీపర్‌గా తుది జట్టులోకి రానున్నాడు. పంత్ లేకపోవడంతో బ్యాటింగ్ డెప్త్ కోసం శార్దూల్ ఠాకూర్‌ను కొనసాగించడానికే మేనేజ్‌మెంట్ మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. అంటే, స్పిన్నర్ కుల్దీప్‌కు మరోసారి నిరాశే. పేస్ గన్ బుమ్రా విషయంలో ఇంకా సస్పెన్స్ వీడలేదు. మ్యాచ్ ఆరంభానికి ముందు పిచ్‌ను బట్టి నిర్ణయం తీసుకొంటామని గిల్ చెప్పాడు. సిరాజ్, ఆకాశ్‌దీప్ ప్రధాన బౌలర్లు కాగా.. బుమ్రా దూరమైతే అర్ష్‌దీప్‌కు చాన్స్ దక్కొచ్చు.

మరోసారి బాజ్‌బాల్?

మరోవైపు కెప్టెన్ స్టోక్స్ దూరం కావడంతో పాటు పేసర్ జోఫ్రా ఆర్చర్, కార్స్‌కు విశ్రాంతి నివ్వడంతో ఇంగ్లండ్ కొంత బలహీనంగా కనిపిస్తోంది. బెన్ గైర్హాజరీలో ఓలీ పోప్ జట్టును నడిపించనున్నాడు. ఇంగ్లండ్ మొత్తంగా నాలుగు మార్పులతో బరిలోకి దిగుతోంది. బాజ్‌బాల్ ఆడాలనే వ్యూహంతోనే స్పిన్నర్ డాసన్‌ను తప్పించి హిట్టర్ జాకబ్ బెథల్‌ను జట్టులోకి తీసుకొన్నట్టుగా కనిపిస్తోంది. గస్ అట్కిన్సన్, ఓవర్టన్, జోష్ టంగ్ జట్టులోకి వచ్చారు. స్టోక్స్ దూరం కావడంతో జట్టు భారం మొత్తం బ్యాటర్లే మోయాల్సిన పరిస్థితి.

జట్లు

భారత్ (అంచనా): జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), సుందర్, జడేజా, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), శార్దూల్, అర్ష్‌దీప్/ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్, ఆకాశ్‌దీప్.

ఇంగ్లండ్: జాక్ క్రాలే, బెన్ డకెట్, ఓలీ పోప్ (కెప్టెన్), రూట్, హ్యారీ బ్రూక్, జాకబ్ బెథల్, జేమీ స్మిత్ (వికెట్ కీపర్), క్రిస్ వోక్స్, అట్కిన్సన్, ఓవర్టన్, జోష్ టంగ్.

పిచ్/వాతావరణం: వికెట్‌పై పచ్చిక కనిపిస్తుండడంతో పేసర్లకు సహకరిస్తుందని భావిస్తున్నారు. టాస్ గెలిచిన టీమ్ బౌలింగ్ ఎంచుకొనే అవకాశం ఉంది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. ఇటీవలే ఇక్కడ జరిగిన కౌంటీ మ్యాచ్‌లో సర్రే 820/9 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. మూడు వారాల క్రితం వాతావరణం వేడిగా ఉన్నా.. ప్రస్తుతం చల్లగా మారింది. తొలి రోజు మధ్యాహ్నం మళ్లీ చివరి రెండు రోజులు ఓ మోస్తరు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ చెబుతోంది.

స్టోక్స్‌కు గాయం..



ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ భుజం గాయంతో చివరి టెస్ట్‌కు దూరమయ్యాడు. మాంచెస్టర్ టెస్ట్‌లో తొలి ఇన్నింగ్స్‌లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన స్టోక్స్. రెండో ఇన్నింగ్స్‌లో భుజం నొప్పితో బాధపడుతూనే బౌలింగ్ చేశాడు. కండర గాయం కావడంతో కోలుకోవడానికి సుమారు ఆరు వారాల సమయం పట్టే అవకాశం ఉంది.



ఇంకా సందిగ్ధమే..

కీలక మ్యాచ్‌కు పేస్ గన్ బుమ్రా అందుబాటులో ఉంటాడా? లేదా? అనే దానిపై సందిగ్ధం కొనసాగుతోంది. పని భారం నేపథ్యంలో బుమ్రాకు విశ్రాంతి నివ్వాలని నిర్ణయించినట్టు ఊహాగానాలు బలంగా వినిపించాయి. వెన్నునొప్పితో ఇబ్బందిపడుతున్న బుమ్రా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అతడిని దూరంగా ఉంచాలని మెడికల్ టీమ్ సూచించినట్టు సమాచారం. కానీ, మ్యాచ్ రోజు ఉదయం పిచ్‌ను పరిశీలించిన తర్వాత బుమ్రాపై తుది నిర్ణయం తీసుకొంటామని గిల్ తెలిపాడు.

గంభీర్‌కు ఆ హక్కుంది: గిల్

ఓవల్ చీఫ్ క్యూరేటర్ ఫోర్టిస్‌తో ఘర్షణ విషయంలో కోచ్ గంభీర్‌కు గిల్ మద్దతుగా నిలిచాడు. పిచ్‌ను పరిశీలించడానికి భారత కోచ్‌కు హక్కుందన్నాడు. ఇదో అనవసర వివాదమని అభిప్రాయపడ్డాడు. భారత సహాయ సిబ్బంది వికెట్‌ను పరిశీలించడానికి వెళ్లినప్పుడు.. దూరం నుంచే చూడాలని ఫోర్టిస్ చెప్పడంతో అతడిపై గౌతీ ఫైర్ అయ్యాడు. 'ఇలా దూరం నుంచే చూడాలని చెప్పడం ఇంతకుముందు ఎన్నడూ జరగలేదు. వికెట్‌ను పరిశీలించడం కెప్టెన్, కోచ్ బాధ్యత' అని గిల్ చెప్పాడు. ఇతర వేదికలపై ఎటువంటి ఆంక్షలు విధించలేదని తెలిపాడు. కాగా, ఇంగ్లండ్ తాత్కాలిక కెప్టెన్ ఓలీ పోప్, రూట్ బుధవారం పిచ్‌పై నిలుచొని షాడో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడం కనిపించింది. దీంతో టీమిండియా పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారని ఫ్యాన్స్ విమర్శిస్తున్నారు. మాజీ ఆటగాళ్లు పార్థివ్ పటేల్, ఇర్ఫాన్ పఠాన్ కూడా గంభీర్‌ను సమర్థించారు.

పాకిస్థాన్‌తో సెమీస్ ఆడం

- టోర్నీ నుంచి వైదొలగిన భారత్
- ఆడకుండానే ఫైనల్‌కు పాక్
- లెజెండ్స్ వరల్డ్ చాంపియన్‌షిప్



బర్మింగ్‌హామ్: పాకిస్థాన్‌తో గురువారం జరగాల్సిన టీ20 లెజెండ్స్ వరల్డ్ చాంపియన్‌షిప్ సెమీఫైనల్ మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్టు భారత జట్టు ప్రకటించింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన భారత్.. పాకిస్థాన్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడకూడదన్న నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు పాక్‌తో మ్యాచ్ నుంచి వైదొలగుతున్నట్టు భారత లెజెండ్స్ తెలిపారు. ఈ టోర్నీ లీగ్ దశలో పాకిస్థాన్‌తో మ్యాచ్‌నూ భారత్ బహిష్కరించింది. శిఖర్ ధవన్, యువరాజ్ సింగ్ (కెప్టెన్), ఇర్ఫాన్ పఠాన్, హర్భజన్ సింగ్, సురేష్ రైనా వంటి మాజీ స్టార్లు భారత జట్టులో ఉన్నారు. భారత జట్టు వైదొలగాలన్న నిర్ణయంతో పాక్ ఆడకుండానే టోర్నీ ఫైనల్‌కు చేరుకుంది. ఇక ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా జట్ల మధ్య గురువారం జరిగే సెమీఫైనల్ విజేతతో పాక్ ఫైనల్లో తలపడుతుంది. భారత్ సహా మొత్తం ఆరు జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి.



మర్చండ్ ప్రపంచ రికార్డు

స్విమ్మింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్

సింగపూర్: ఒలింపిక్ చాంపియన్, ఫ్రెంచ్ స్విమ్మర్ లియోన్ మర్చండ్ ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లోనూ తనకు తిరుగులేదని చాటాడు. 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లే ఈవెంట్‌లో మర్చండ్ ఒక నిమిషం 52.61 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకొని సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో 2011లో అమెరికా స్విమ్మర్ ర్యాన్ లోచెట్ నమోదుచేసిన ఒక నిమిషం 54 సెకన్ల ప్రపంచ రికార్డును మర్చండ్ బద్దలుకొట్టాడు. గతేడాది పారిస్ ఒలింపిక్స్‌లో నాలుగు స్వర్ణ పతకాలు కొల్లగొట్టిన 23 ఏళ్ల మర్చండ్.. ఇంకా 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లేతో పాటు రిలే ఈవెంట్‌లో పోటీపడాల్సి ఉంది.

టీ20 నెం.1 బ్యాటర్.. అభిషేక్



దుబాయ్: ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో అదరగొడుతున్న ఆల్‌రౌండర్ జడేజా తన నెం:1 ర్యాంక్‌ను మరింత పదిలం చేసుకోగా.. టీ20 ఫార్మాట్‌లో అభిషేక్ శర్మ తొలిసారి అగ్రస్థానాన్ని కైవసం చేసుకొన్నాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్ టీ20 బ్యాటర్ల విభాగంలో టాప్‌లో ఉన్న హెడ్‌ను అభిషేక్ వెనక్కినెట్టాడు. వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు దూరం కావడంతో హెడ్ రెండో స్థానానికి పడిపోయాడు. ఆల్‌రౌండర్ల విభాగంలో జడ్డూ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. మాంచెస్టర్ టెస్ట్‌లో సెంచరీ బాదిన సుందర్ ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని 65వ ర్యాంక్‌లో నిలిచాడు. మెహ్దీ హసన్, స్టోక్స్ రెండు, మూడు ర్యాంకుల్లో ఉన్నారు.

తరుణ్, లక్ష్య ముందంజ

మకావు ఓపెన్‌లో ప్రణయ్‌కు షాక్

మకావు: తెలుగు యువ షట్లర్ తరుణ్ మన్నెపల్లి మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశాడు. తరుణ్‌తో పాటు స్టార్ ఆటగాడు లక్ష్యసేన్, ఆయుష్ శెట్టి కూడా ముందంజ వేశారు. సింగిల్స్ ఆరంభ రౌండ్లో తరుణ్ 21-19, 21-13తో సహచరుడు మన్‌రాజ్ సింగ్‌పై, లక్ష్య 21-8, 21-14తో జియోన్ హ్యాక్ జిన్ (కొరియా)పై, ఆయుష్ 21-10, 21-11తో హువాంగ్ యు కాయి (తైపీ)పై గెలిచారు. ప్రణయ్ 21-18, 15-21, 15-21తో యొహానెస్ (ఇండోనేసియా) చేతిలో కంగుతిన్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో 21-10, 21-15తో థాయ్ జంట రచాపోల్/నటామోన్‌ను ఓడించగా, మహిళల సింగిల్స్‌లో ఉన్నతి హుడా తొలిరౌండ్లోనే వెనుదిరిగింది.

ఇటీవల ఇండోనేసియాలో జరిగిన ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో కాంస్యం గెలిచిన హైదరాబాద్ క్రీడాకారిణి వెన్నెల కలగొట్లకు లక్ష రూపాయల ప్రోత్సాహకాన్ని అందిస్తున్న హైదరాబాద్ బ్యాడ్మింటన్ సంఘం చీఫ్ చాముండేశ్వర్‌నాథ్



'హండ్రెడ్స్'లో నాలుగు ఐపీఎల్ ఫ్రాంచైజీలు

లండన్: నాలుగు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీలు ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిర్వహించే 'హండ్రెడ్స్' లీగ్‌లోనూ అడుగుపెట్టాయి. ముంబై ఇండియన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యాలు హండ్రెడ్స్ టోర్నీ జట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మాంచెస్టర్ ఒరిజినల్స్ జట్టులో లఖ్‌నవూ, నార్తర్న్ సూపర్ చార్జర్స్‌లో సన్‌రైజర్స్, సదరన్ బ్రేవ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, ఓవల్ ఇన్విజిబుల్స్‌లో ముంబై ఇండియన్స్ వాటాలు కొనుగోలు చేశాయి.

బిజినెస్



రొయ్యల ఎగుమతీ సమస్యే

హైదరాబాద్/భీమవరం (ఆంధ్రజ్యోతి): ట్రంప్ సుంకాల ప్రభావం ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడుల్లోని రొయ్యల ఎగుమతులపైనా పడనుంది. మన దేశం నుంచి ఏటా 11 లక్షల టన్నుల రొయ్యలు ఎగుమతి అవుతుంటే అందులో ఎనిమిది లక్షల టన్నులు ఆంధ్రప్రదేశ్ నుంచే ఎగుమతి అవుతున్నాయి. రాష్ట్రం నుంచి ఎగుమతయ్యే రొయ్యల్లో 70 శాతం అమెరికాకే వెళ్తాయి. ట్రంప్ తాజా సుంకాలతో రైతులతో పాటు, ఇటు ఎగుమతిదారులూ తీవ్రంగా నష్టపోతారని జగదీశ్ మెరైన్ ప్రొడక్ట్స్ అధినేత జగదీశ్ చెప్పారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదిరే వరకు ఈ తిప్పలు తప్పవన్నారు.

సగం వాటా రొయ్యలదే: మన దేశం నుంచి ఏటా 480 కోట్ల డాలర్ల విలువైన మత్స్య ఎగుమతులు జరుగుతుంటే అందులో సగానికిపైగా వాటా రొయ్యలదే. ఇపుడు ట్రంప్ సర్కార్ మన దేశానికి చెందిన మత్స్య ఎగుమతులపైనా 25 శాతం దిగుమతి సుంకం విధించింది. దీనికి తోడు రష్యా నుంచి చమురు, ఆయుధాలు దిగుమతి చేసుకుంటే జరిమానాలూ తప్పవని ట్రంప్ ప్రకటించారు. ఇదే సమయంలో అమెరికాకు అతి సమీపంలో ఉన్న ఈక్వెడార్ నుంచి అతి తక్కువ సుంకాలతో రొయ్యలతో సహా అనేక మత్స్య దిగుమతులను అనుమతించనుంది. దీంతో భారత రొయ్యలకు అతి పెద్ద మార్కెట్ అయిన అమెరికా మార్కెట్ దాదాపు మూసుకు పోయినట్టేనని భావిస్తున్నారు. ఈ ప్రభావం వ్యాపారులు రొయ్యల రైతులకు చెల్లించే ధరలపైనా పడుతుందని మార్కెట్ వర్గాల అంచనా.

మార్కెట్ పైనా ట్రంప్ పిడుగు



నష్టాల్లో భారత కంపెనీల ఏడీఆర్‌లు
మూడేళ్ల కనిష్ఠానికి రూపాయి

'బేర్'మన్న గిఫ్ట్ నిఫ్టీ

అమెరికా తాజా సుంకాలు, పెనాల్టీలతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్ లాభాలకు బ్రేక్ పడే సూచనలు కనిపిస్తున్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై ఆగస్టు 1 నుంచి 25 శాతం సుంకాలు, పెనాల్టీలు విధించబోతున్నట్టు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. దీంతో గురువారం నిఫ్టీ 24,700 పాయింట్ల దిగువకు పడిపోయే అవకాశం ఉందని టెక్నికల్ విశ్లేషకుల అంచనా. ముఖ్యంగా ఆటోమొబైల్ విడిభాగాలు, టెక్స్‌టైల్స్, ఫార్మా, జువెలరీ, రొయ్యల ఎగుమతి కంపెనీల షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు. గురువారం నాటి నిఫ్టీ ఓపెనింగ్‌కు సూచికగా భావించే గిఫ్ట్ నిఫ్టీ, ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే 24,700 పాయింట్ల దిగువకు పడిపోయింది. దీనికి తోడు గురువారం నాటి ఎఫ్ అండ్ ఓ సెటిల్‌మెంట్ భయాలూ మార్కెట్‌ను వెంటాడుతున్నాయి.

నష్టాల్లో ఏడీఆర్‌లు: ట్రంప్ సుంకాల ప్రకటనతో అమెరికా స్టాక్ మార్కెట్‌లో భారత కంపెనీలు జారీ చేసిన ఏడీఆర్‌లూ నష్టాల్లోకి జారుకున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ (1.2%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (1.06%), విప్రో (1.7%), ఇన్ఫోసిస్ (0.78%), డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ (3.83%) ఏడీఆర్‌లు భారీగా నష్టపోయాయి.

రూపాయి ధమాల్: డాలర్ మారకంలో రూపాయి విలువ మూడేళ్ల కనిష్ఠ స్థాయికి దిగజారింది. బుధవారం ఉదయం 19 పైసల నష్టంతో రూ.87.10 వద్ద ప్రారంభమైన రూపాయి చివరికి 89 పైసల నష్టంతో రూ.87.80 వద్ద ముగిసింది. ట్రంప్ ప్రకటనతో గురువారం రూపాయి మారకం రేటు మరింత పతనమయ్యే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. 'అమెరికా-భారత వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి ఇంకా కొనసాగుతోంది. చమురు ధర కూడా పెరుగుతోంది. వీటికి తోడు ఎఫ్‌పీఐల అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీంతో డాలర్‌తో రూపాయి మారకం రేటు మరింత పతనమవుతుందని మా అంచనా' అని మిరాసె అసెట్ షేర్‌ఖాన్ సంస్థ రీసెర్చ్ అనలిస్టు అనూజ్ చౌదరి చెప్పారు. వచ్చే కొద్ది రోజుల్లో డాలర్‌తో రూపాయి 87 - 87.90 మధ్య ట్రేడయ్యే అవకాశం ఉందన్నారు. నెలాఖరులో దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం సైతం ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకం రేటును కుంగదీస్తోంది.

రెండో రోజూ లాభాల్లో సెన్సెక్స్

ట్రంప్ సుంకాల భయం వెంటాడడంతో బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్ పెద్దగా లాభాలు నమోదు చేయలేదు. సెన్సెక్స్ 143.91 పాయింట్ల లాభంతో 81,481.86 వద్ద, నిఫ్టీ 50 ఇండెక్స్ 33.95 పాయింట్ల లాభంతో 24,855.05 వద్ద ముగిశాయి. అమెరికా సుంకాల భయం, ఎఫ్‌పీఐల కొనుగోళ్ల జోరు తగ్గడం బుధవారం సూచీల జోరుకు పగ్గాలు వేశాయి. అయితే ఎల్ అండ్ టీ షేర్లలో భారీ కొనుగోళ్లు సూచీలను లాభాలవైపు నడిపించాయి. సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, మారుతీ, ఎయిర్‌టెల్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంకు షేర్ల కొనుగోళ్లు ఇందుకు దోహదం చేశాయి.

టాటా మోటార్స్ చేతికి ఇటలీ కంపెనీ ఇవెకో!

డీల్ విలువ రూ.38,240 కోట్లు

న్యూఢిల్లీ: టాటా గ్రూప్ మరో భారీ టేకోవర్ చేసింది. ఇటలీ కేంద్రంగా పనిచేసే ట్రక్కుల తయారీ కంపెనీ ఇవెకో ఎన్‌వీ కంపెనీని 450 కోట్ల డాలర్లకు (సుమారు రూ.38,240 కోట్లు)కు కొనుగోలు చేసింది. టాటా గ్రూప్ చరిత్రలోనే ఇది అతి పెద్ద కొనుగోలు. ఇందుకోసం గత నెలన్నర రోజులుగా జరుగుతున్న చర్చలు కొలిక్కి వచ్చి నట్టు టాటా మోటార్స్ బోర్డు బుధవారం ప్రకటించింది. ఈ డీల్‌లో భాగంగా ఇవెకో ఈక్విటీలో నూరు శాతం వాటాను పూర్తి నగదు చెల్లింపు పద్దతిలో టాటా గ్రూప్ కొనుగోలు చేస్తోంది. అయితే ఆ గ్రూప్‌లోని రక్షణ పరి కరాల విభాగం మాత్రం ఈ టేకోవర్ పరిధిలోకి రాదు. యూరప్, అమెరికా మార్కెట్లలో ఇవెకో గ్రూప్ ట్రక్కుల కు మంచి డిమాండ్ ఉంది. ఇది వ్యూహాత్మక కొనుగోలు అని, దీని ద్వారా జాతీయ-అంతర్జాతీయ మార్కెట్లలోనూ పోటీపడగలుగుతాం అని టాటా మోటార్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్ అన్నారు

మహీంద్రా లాభం రూ.4,083 కోట్లు

దేశీయ వాహన దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా వర్తమాన ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 24% వృద్ధితో రూ.4,083 కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన లాభం రూ.3,283 కోట్లు. మొత్తం ఆదాయం రూ.37,218 కోట్ల నుంచి రూ.45,529 కోట్లకు పెరిగింది. ఆటో, వ్యవసాయ ఉపకరణాల విభాగం ఎప్పటివలెనే మంది వృద్ధిని నమోదు చేసిందని, ఈ విభాగంలో లాభాల మార్జిన్ 20% పెరిగిందని కంపెనీ తెలిపింది. ఆర్థిక సర్వీసుల విభాగం నిర్వహణలోని ఆస్తుల విలువ 15% వృద్ధిని నమోదు చేసింది. ఐటీ సర్వీసుల విభాగం టెక్ మహీంద్రా డీల్స్ సంఖ్య గణనీయంగా పెరిగిందని గ్రూప్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అనిష్ షా తెలిపారు.

ఫార్చ్యూన్ గ్లోబల్ 500లో రిలయన్స్@88



న్యూఢిల్లీ: ఈ ఏడాదికిగాను ప్రపంచంలోని 500 అతిపెద్ద కంపెనీల జాబితాను ప్రముఖ అమెరికన్ మ్యాగజైన్ ఫార్చ్యూన్ బుధవారం విడుదల చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు ఈ లిస్ట్‌లో 88వ స్థానం దక్కింది. గత ఏడాది 86వ స్థానంలో ఉండగా.. ఈసారి ర్యాంకింగ్ రెండు స్థానాలు జారుకుంది. 2021లో 155వ స్థానంలో నిలిచిన ఆర్‌ఐఎల్.. గడిచిన నాలుగేళ్లలో 67 స్థానాలు ఎగబాకింది. ఈ లిస్ట్‌లో రిలయన్స్‌కు చోటు దక్కడం వరుసగా ఇది 22వ సంవత్సరం. కాగా, '2025 ఫార్చ్యూన్ గ్లోబల్ 500' జాబితాలో భారత్ నుంచి 9 కంపెనీలకు స్థానం దక్కింది. వాటిలో 5 ప్రభుత్వ రంగానివి కాగా.. మిగతా నాలుగు ప్రైవేట్ కంపెనీలు. ఈ మార్చి 31 నాటికి కంపెనీల వార్షికాదాయం ఆధారంగా ఫార్చ్యూన్ ఈ జాబితాను రూపొందించింది. అమెరికన్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ మరోసారి ప్రపంచ నం.1గా కొనసాగగా.. అంతర్జాతీయ ఈ-కామర్స్ కంపెనీ అమెజాన్ రెండో స్థానంలో ఉంది. టాప్-10లో 3 చైనా కంపెనీలకు చోటు దక్కింది. సౌదీ అరేబియాకు చెందిన చమురు ఉత్పత్తి దిగ్గజం సౌదీ అరామ్కో నాలుగో స్థానంలో నిలిచింది. ఐఫోన్ల తయారీ సంస్థ యాపిల్‌కు 8వ స్థానం లభించింది.

జియో రూ.52,000 కోట్ల ఐపీఓ!?

వచ్చే ఏడాదిలో ఇష్యూకు..

న్యూఢిల్లీ: ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం సంస్థ రిలయన్స్ జియో సహా అన్ని డిజిటల్ సేవల విభాగమైన జియో ఇన్ఫోకామ్.. దలాల్ స్ట్రీట్ చరిత్రలో అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌కు సిద్ధమవుతోంది. 5 శాతం వాటా విక్రయం ద్వారా 600 కోట్ల డాలర్ల (సుమారు రూ.52,200 కోట్లు) వరకు సమీకరించాలని జియో ఇన్ఫోకామ్ భావిస్తున్నట్లు బ్లూంబర్గ్ కథనం వెల్లడించింది. ప్రస్తుతం మార్కెట్ చరిత్రలో అతిపెద్దదైన రూ.28,000 కోట్ల హ్యుండయ్ ఐపీఓతో పోలిస్తే జియో దాదాపు రెండింతల అధిక నిధులు సమీకరించనుందన్నమాట. ఐపీఓకు అనుమతి కోసం సెబీతో రిలయన్స్ ఇప్పటికే అనధికారిక చర్చలు కూడా ప్రారంభించినట్లు ఆ నివేదికలో తెలిపారు. సంస్థ వచ్చే ఏడాదిలో పబ్లిక్ ఇష్యూకు రావచ్చని సమాచారం. ఈ ఆగస్టులో ఆర్‌ఐఎల్ నిర్వహించబోయే వాటాదారుల వార్షిక సమావేశంలో జియోతోపాటు రిలయన్స్ రిటైల్ ఐపీఓలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. జియో ఇన్ఫోకామ్‌లో 2020లో పెట్టుబడులు పెట్టిన మెటా ప్లాట్‌ఫామ్స్, గూగుల్ వంటి అమెరికన్ టెక్ దిగ్గజాలు, ప్రైవేట్ ఈక్విటీ ఇన్వెస్టర్లు ప్రతిపాదిత ఐపీఓ ద్వారా తమ వాటాలను కొంత మేర ఉపసంహరించుకునే అవకాశాలున్నాయి. మెటా, గూగుల్ పెట్టుబడులు పెట్టిన సమయంలో జియో మార్కెట్ విలువను 5,800 కోట్ల డాలర్ల స్థాయిలో లెక్కగట్టగా.. ప్రస్తుతం 10,000 కోట్ల డాలర్లు (రూ.8.7 లక్షల కోట్లు) దాటింది.

జియో ఫైనాన్షియల్‌కు రూ.15,825 కోట్లు : రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి వేరు చేసి ప్రత్యేక సంస్థగా ఏర్పాటు చేసిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌ను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ముకేశ్ అంబానీ, ఆయన కుటుంబం, ప్రమోటర్ గ్రూప్ సంస్థలు కలిసి రూ.15,825 కోట్ల మూలధన నిధులు సమకూర్చాలని బుధవారం జరిగిన కంపెనీ బోర్డు సమావేశంలో నిర్ణయించారు. ప్రస్తుతం జేఎఫ్‌ఎస్‌ఎల్‌లో వీరందరికీ కలిపి 47.12 శాతం వాటా ఉండగా.. నిధులు సమకూర్చిన అనంతరం వాటా 54.19 శాతానికి పెరగనుంది.

ఇండిగో లాభంలో 20% క్షీణత

న్యూఢిల్లీ: ప్రైవేట్ విమానయాన దిగ్గజం ఇండిగో లాభాలకు గగనతల ఆంక్షలు గండి కొట్టాయి. వర్తమాన ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లాభం 20% క్షీణించి రూ.2176.3 కోట్లకు పరిమితమయింది. అయితే వివిధ గమ్యాలకు చేర్చిన ప్రయాణికుల సంఖ్య మాత్రం 12% పెరిగి 3.1 కోట్లుగా నమోదయింది. గత ఏడాది ఇదే కాలంలో ఇండిగో లాభం రూ.2,728.8 కోట్లుంది. మొత్తం ఆదాయం 6.4% వృద్ధితో రూ.20,248.9 కోట్ల నుంచి రూ.21,542.6 కోట్లకు పెరిగింది. జూన్ నెలలో ఇండిగో 64.5% మార్కెట్ వాటా సాధించింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	109
వరంగల్	110	గుంటూరు	114
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	102
కర్నూలు	110	నెల్లూరు	107
విశాఖపట్నం	97	అనంతపురం	107
గోదావరి	109		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

31వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	475
వరంగల్	412	గోదావరి	455
చిత్తూరు	483	విశాఖపట్నం	455
		డజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,480 ▲	92,100 ▲	1,27,000 ▲
విజయవాడ	1,02,300 ▲	96,500 ▲	1,17,600 ▲
విశాఖపట్నం	1,02,300 ▲	92,100 ▲	1,27,000 ▲
రాజమండ్రి	1,00,470 ▲	92,100 ▲	1,17,300 ▲
ప్రొద్దుటూరు	99,650 ▲	91,680 ▲	1,16,800 ▲
ముంబై	99,020 ▲	90,700 ▲	1,13,400 ▲

రిజర్వేషన్ల కోసం జాతీయస్థాయిలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు పొన్నం, సురేఖ, శ్రీహరి
- ఓబీసీ జాతీయ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు దక్కేవరకు బీసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరిలు పిలుపునిచ్చారు. ఆగస్టు 7న గోవాలో జరుగనున్న ఓబీసీ జాతీయ మహాభలను విజయవంతం చేయాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రచార వాల్ పోస్టర్లను బుధవారం మహేశ్ కుమార్ గౌడ్, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకాటి శ్రీహరిలు వేర్వేరుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబీసీ మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరు కావాలని కోరుతూ జాజుల శ్రీనివాస్ గౌడ్ వారికి ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచుకునే అధికారం రాష్ట్రాలకే ఉండేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి జాతీయస్థాయిలో బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థలు 42 శాతం రిజర్వేషన్ల పెంపుతో పాటు చట్టసభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు, కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రైవేట్ రంగంలో బీసీలకు రిజర్వేషన్లు కల్పించే విధంగా బీసీ ఉద్యమ పోరాట కార్యాచరణను జాతీయ మహాసభలలో రూపొందించుకోవాలని సూచించారు.

మేడారానికి రైల్వేలైన్‌ను నిర్మించండి: ఈటల

న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క సారలమ్మ జాతర జరిగే మేడారం ప్రాంతానికి రైల్వేలైన్ నిర్మించాలని కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విన్నవించారు. బుధవారం లోక్‌సభలో 377 నియమం కింద ఆయన మాట్లాడారు. 'ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. ఇది ఆసియాలోని అతిపెద్ద గిరిజన పండుగ. మేడారానికి రైల్వే లైన్ లేకపోవడం వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందువల్ల మేడారానికి నుంచి దగ్గరలో ఉన్న వరంగల్ రైల్వే జంక్షన్, సిర్పూర్ కాగజ్‌నగర్, లేదా మణుగూరుకు రైల్వే లైన్ ఏర్పాటు చేయడం ం కాబట్టి ఈ రైల్వే లైన్ సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలి' అని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఎంపీ ఈటల విన్నవించారు. మరోవైపు, కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ అయిన ఎంపీ ఈటల.. జాతీయ రహదారి 65 చింతకుంట సర్కిల్ నుంచి ఆటోనగర్ చౌరస్తా వరకు ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని కోరారు.

జియో ట్యాగ్ కార్మికులందరికీ భరోసా ఇవ్వాలి

- చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జియో ట్యాగ్‌ఉన్న చేనేత కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా చేనేత భరోసా ఇవ్వడంతో పాటు లక్ష రూపాయల రుణమాఫీ తక్షణం అమలుచేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు చేనేత జౌళి శాఖ అదనపు సంచాలకులు శ్రీనివాస్ రెడ్డికి చేనేత కార్మిక సంఘం ప్రతినిధులతో కలిసి వినతి పత్రం సమర్పించారు. చేనేతవృత్తి రక్షణ, వృత్తిదారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత భరోసా పథకం ద్వారా జియో ట్యాగ్ వేసిన ప్రతి మగ్గానికి చెందిన చేనేత కార్మికునితో పాటు అనుబంధ వృత్తుల కార్మికులకు పథకం వర్తింపజేయాలని మురళీధర్ కోరారు. తక్షణం చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ఆగస్టు 4 నుంచి సీపీగెట్-2025 పరీక్షలు

హైదరాబాద్ సిటీ, జూలై30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే తెలంగాణ కామన్ పోస్టు గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ సీపీగెట్)-2025 ప్రవేశ పరీక్షలు ఆగస్టు 4వ తేదీ నుంచి 11 తేదీ వరకు జరుపుతామని కన్వీనర్ ప్రొఫెసర్ పాండు రంగారెడ్డి తెలిపారు. ఈ మేరకు మొత్తం 44 పోస్టు గ్రాడ్యుయేట్ సబ్జెక్టులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని ఒక ప్రకటనలో చెప్పారు.

అబద్ధాల్లో అగ్రగణ్యులు మోదీ, కేసీఆర్: నారాయణ

న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అబద్ధాలు ఆడడంలో ప్రధాని మోదీ, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ అగ్రగణ్యులని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ఆరోపించారు. ప్రపంచంలో గోబెల్స్ తర్వాత ఆ స్థానం వారిద్దరిదేనని అన్నారు. పహల్గాం ఉగ్రవాదులను ముందే పట్టుకుని పథకం ప్రకారం హతం చేసినట్టు కనిపిస్తోందన్నారు. పార్లమెంటులో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ జరిగే క్రమంలో ఉగ్రవాదులను హతం చేశామని ప్రకటించడం పలు సందేహాలకు తావిస్తోందని తెలిపారు.

విజయ్ దేవరకొండ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సినీహీరో విజయ్ దేవరకొండ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన ఓ బహిరంగ సమావేశంలో విజయ్ దేవరకొండ ఎస్టీలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినట్లు రాయదుర్గం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. విజయ్ దేవరకొండ తరఫు న్యాయవాది వాదిస్తూ.. సమావేశం జరిగిన 2 నెలల తరువాత ఫిర్యాదు చేశారని, విపరీతమైన ఆలస్యం చోటుచేసుకున్నప్పటికీ పోలీసులు ఫిర్యాదును స్వీకరించడం చెల్లదని పేర్కొన్నారు. గిరిజన వర్గాల పట్ల తనకు ఎనలేని గౌరవ మర్యాదలు ఉన్నాయని, తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా ఇబ్బంది పడి ఉంటే అది బాధాకరమని ఆయన ఎక్స్ ద్వారా వివరణ ఇచ్చారని గుర్తు చేశారు. ఫిర్యాదుదారుల తరఫు న్యాయవాది వాదిస్తూ.. ట్విట్టర్ ద్వారా క్షమాపణలు కోరడం వల్ల సమస్యకు పరిష్కారం లభించదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

నేడు జేఎన్‌టీయూలో 'ఈసెట్' స్పాట్ అడ్మిషన్లు

హైదరాబాద్ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో నేరుగా బీటెక్, ఫార్మసీ సెకండియర్‌లో ప్రవేశానికి నిర్వహించే ఈసెట్‌లో.. కౌన్సెలింగ్ అనంతరం మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం గురువారం 'స్పాట్ అడ్మిషన్ల' ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అడ్మిషన్ల విభాగం డైరెక్టర్ బాలు నాయక్ తెలిపారు. ఈసెట్‌కు అర్హత కలిగిన అభ్యర్థులంతా.. హైదరాబాద్ క్యాంపస్‌లో జరిగే సెంట్రలైజ్డ్ కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావచ్చని తెలిపారు. వర్సిటీకి అనుబంధంగా ఉన్న పాలేరు, మహబూబాబాద్, వనపర్తి, సిరిసిల్ల, సుల్తాన్‌పూర్, జగిత్యాల, మంథనిలలోని ప్రభుత్వ కళాశాలల్లో మిగిలిన 180 సీట్లను స్పాట్ అడ్మిషన్లకు(అర్హులైన) వచ్చిన అభ్యర్థులతో భర్తీ చేస్తామని డైరెక్టర్ వెల్లడించారు.

ఆ 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చండి

- కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ ఎంపీల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉండి కేంద్రంలో ఓబీసీ జాబితాలో లేని 28 కులాలను ఆ జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి బీజేపీ ఎంపీలు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో తెలంగాణ రాష్ట్ర ఓబీసీ సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఓబీసీ సెమినార్‌కు బీజేపీ ఎంపీలు ఆర్.కృష్ణయ్య, ఈటల రాజేందర్, గోడం నగేష్, డీకే అరుణ, రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ నేతలు మాట్లాడుతూ.. 28 కులాలను ఓబీసీ జాబితాలో చేర్చే అంశాన్ని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ కులాల్లో 16 కులాలు సంచార జాతులే ఉన్నాయన్నారు. సొండి, వీరశైవ లింగాయత్, గొంగిడి, అరె మరాఠి, భైరికమ్మరి, భాగవతుల, కాటిపాపల తదితర 28 కులాలను 20 ఏళ్ల కిందటే రాష్ట్ర బీసీ కులాల జాబితాలో చేర్చారని పేర్కొన్నారు. కేంద్రంలో ఓబీసీ జాబితాలో చేర్చకపోవడంతో ఈ 28 కులాలకు చెందిన యువత విద్య, ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారని చెప్పారు.



నిశ్చితార్థ వేడుకలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ, ఆంధ్రజ్యోతి డైరెక్టర్ వేమూరి ఆదిత్య, వైస్ ప్రెసిడెంట్ శృతికీర్తి, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి డైరెక్టర్లు భానుప్రకాశ్, అనూష

హైదరాబాద్‌లో ఘనంగా ఏజీ దమ్మాలపాటి కుమార్తె నిశ్చితార్థం

కాబోయే జంటను ఆశీర్వదించిన భువనేశ్వరి, మాజీ సీజేఐ రమణ, 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణ

రాయదుర్గం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, నాగరాణి దంపతుల కుమార్తె మానస.. ఆర్ఎస్ కన్‌స్ట్రక్షన్ అధినేత శ్రీనివాస్, రాగిణిల కుమారుడు సిద్ధార్థల వివాహ నిశ్చితార్థం బుధవారం సాయంత్రం హైదరాబాద్ నానక్‌రాంగూడలో ఘనంగా జరిగింది. ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, మంత్రి లోకేశ్ భార్య బ్రాహ్మణి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఆయన కుటుంబ సభ్యులు, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఇతర ప్రముఖులు హాజరై.. కాబోయే జంటను ఆశీర్వదించారు.

మరిన్ని మైక్రోబ్రూవరీలు

హైదరాబాద్‌లో 25కి పెరగనున్న బ్రూవరీలు.. మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ అవకాశం

- నిబంధనల సవరణకు సర్కారు ఆమోదం
- వచ్చే నెలలో నోటిఫికేషన్ జారీకి సిద్ధం

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరిన్ని మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు నిబంధనల సవరణకు పచ్చజెండా ఊపింది. దీంతో హైదరాబాద్‌కే పరిమితమైన మైక్రోబ్రూవరీలు ఇకపై రాష్ట్రంలోని మునిసిపల్ కార్పొరేషన్లకు విస్తరించనున్నాయి. కార్పొరేషన్లలో ఒకటి కంటే ఎక్కువ బ్రూవరీలు ఏర్పాటుకానున్నాయి. నిజానికి వరంగల్ కార్పొరేషన్ పరిధి నుంచి 2017లోనే దరఖాస్తులు వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం ఇతర ప్రాంతాల్లో.. ముఖ్యంగా మునిసిపల్ కార్పొరేషన్ల పరిధుల్లో మైక్రోబ్రూవరీలకు అనుమతివ్వాలని నిర్ణయించింది. దీంతో ఆగస్టులో నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఏమిటీ మైక్రోబ్రూవరీలు?

మైక్రోబ్రూవరీల్లో చిన్న స్థాయిలో బీరు ఉత్పత్తి అవుతుంది. ఇవి భారీ వాణిజ్య బ్రూవరీల్లా కాకుండా పరిమిత పరిమాణంలో తరచుగా వినూత్నమైన, ప్రత్యేక రుచులతో బీర్లను తయారు చేస్తాయి. ఈ బీర్‌ను తరచుగా అదే ప్రాంగణంలో, స్థానికంగానే విక్రయిస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో(హైదరాబాద్‌లో) 18 మైక్రోబ్రూవరీలున్నాయి. ఇవి నగరంలోని క్రాఫ్ట్ బీర్ ప్రియులకు, యువతకు ప్రధాన వినోద కేంద్రాలుగా మారాయి. లైవ్ మ్యూజిక్, రుచికరమైన ఆహారం, ఆహ్లాదకరమైన వాతావరణం వంటివి వీటి ప్రధాన ఆకర్షణలు. పండుగలు, ప్రత్యేక సీజన్లను బట్టి సీజనల్ బ్రూస్ తయారు చేయడం ఇక్కడి ప్రత్యేకత. బ్రూవరీస్‌లో బీర్ తయారీ ప్రక్రియను దగ్గరగా చూసే అవకాశం కొన్నిచోట్ల కల్పించారు.



ఇది కస్టమర్లకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తుంది. మరిన్ని బ్రూవరీలను ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన ఎక్సైజ్‌శాఖ హైదరాబాద్‌లోనే 25 మైక్రోబ్రూవరీలు ఏర్పాటు చేసుకోవచ్చనే ప్రతిపాదనను ప్రభుత్వం ముందు ఉంచింది. హైదరాబాద్ అంటే కేవలం జీహెచ్ఎంసీ పరిధి మాత్రమే కాకుండా.. ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) లోపల వరకు పెంచడం వల్ల ఇంకా ఎక్కువగా బ్రూవరీల సంఖ్య పెంచుకోవచ్చనే మరో ప్రతిపాదనను ప్రభుత్వానికి పంపింది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్రతో పోలిస్తే.. తెలంగాణలోనే బీర్ల అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. బీరు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో బ్రూవరీల విస్తరణ ద్వారా ఆదాయం లభిస్తుందని ఎక్సైజ్‌శాఖ అంచనా వేస్తోంది. ఢిల్లీ, ముంబై, బెంగళూరులో అధిక సంఖ్యలో మైక్రో బ్రూవరీలున్నాయి. డిమాండ్ ఎక్కువగా ఉండే హైదరాబాద్‌లోనూ వీటి సంఖ్యను పెంచుకోవడంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

పదేళ్ల క్రితమే..?

నిజానికి 2015-16లో మైక్రోబ్రూవరీల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. 2017లో వరంగల్‌లోనూ వీటిని ఏర్పాటు చేసేందుకు ముగ్గురు వ్యాపారులు ఆసక్తిని కనబరుస్తూ దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లోనూ అదనంగా ఆరేడు కంపెనీలు బ్రూవరీలను ఏర్పాటు చేస్తామంటూ ముందుకొచ్చాయి. ఈ వివరాలను ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ మైక్రోబ్రూవరీల విస్తరణ విషయం ప్రస్తావనకు వచ్చింది. ముఖ్యమంత్రితో సహా పలువురు మంత్రులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎక్సైజ్‌శాఖ రూపొందించిన ప్రతిపాదనలపై చర్చ జరగ్గా.. బ్రూవరీస్‌ను ఓఆర్ఆర్ లోపల మాత్రమే ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పిద్దామని తొలుత నిర్ణయానికి వచ్చారు. మిగిలిన ప్రాంతాల్లోనూ నడిపించుకోవడానికి డిమాండ్ ఉందని.. వాళ్లకు కూడా అవకాశం కల్పించడం వల్ల ఇబ్బంది ఏంటనేదానిపైనా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడంతో.. మునిసిపల్ కార్పొరేషన్లలోనూ విస్తరించుకోవడానికి అవకాశమివ్వాలని నిర్ణయించారు. గతంలో ఉన్న నిబంధనలు సవరించడానికి ఆమోదం తెలిపారు.

హైదరాబాద్ దాటి..

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ గచ్చిబౌలి, కొండాపూర్ వంటి ప్రాంతాల్లో మైక్రోబ్రూవరీలు ఉన్నాయి. నిబంధనల సవరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో మరిన్ని మైక్రోబ్రూవరీలు వచ్చే అవకాశం ఉంది. వరంగల్,నిజామాబాద్, కరీంనగర్, రామగుండం, ఖమ్మం తదితర మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో స్థానిక ఆసక్తిని బట్టి ఒకటికంటే ఎక్కువ సంఖ్యలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు మార్గం సుగమం కానుంది. త్వరలోనే దీనిపైన తుది నిర్ణయం తీసుకుని, కొత్త లైసెన్సుల జారీకి మార్గదర్శకాలు రూపొందించే అవకాశం ఉంది. ఆగస్టులోనే నోటిఫికేషన్ జారీ చేయడానికి ఎక్సైజ్‌శాఖ సన్నాహాలు చేస్తోంది.

గురుకుల విద్యార్థుల గోస కనిపించడం లేదా రేవంత్..!

- మీనాక్షి.. విద్యార్థుల పాదయాత్రపై దృష్టిపెట్టండి: హరీశ్‌రావు



హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పరిపాలనను గాలికి వదిలేసి నిత్యం రాజకీయాలుచేసే రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు గురుకుల విద్యార్థుల గోస కనిపించకపోవడం అమానవీయమని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. స్థానిక ఎన్నికల రాజకీయం కాదు.. రాష్ట్రంలో దిగజారుతున్న గురుకుల వ్యవస్థను సీఎం కాపాడాలని బుధవారం 'ఎక్స్' వేదికగా ఆయన డిమాండ్ చేశారు. ప్రశ్నించిన వారిపై, ప్రతిపక్షాలపై జులుం ప్రదర్శించే రేవంత్.. తమ సమస్యలు పరిష్కరించాలంటూ పాదయాత్ర చేస్తున్న అలంపూర్ గురుకుల విద్యార్థులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. చదువుకునే పిల్లలు పట్టెడన్నం, తాగునీళ్ల కోసం పాదయాత్రలు చేసే దుస్థితి కల్పించారని, ఇది మీ అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసం మరోసారి పాదయాత్ర డ్రామాలు మొదలుపెడుతున్న కాంగ్రెస్.. గురుకుల విద్యార్థుల పాదయాత్రలపై ముందుగా దృష్టిసారించాలని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు సూచించారు. తరగతి గదుల్లో ఉండాల్సిన భావిభారత పౌరులను నడిరోడ్డు ఎక్కించిన చరిత్ర ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదని, ముందు దీనికి పరిష్కారం చూపాలని ఆమెను కోరారు. పోలీసులను పెట్టి, బలవంతంగా డీసీఎంలలో విద్యార్థులను తరలించిన నీచమైన చరిత్ర ఈ ఇందిరమ్మ రాజ్యానిదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ చౌరస్తా నుంచి పాదయాత్రగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు ఇవ్వాలనుకున్న విద్యార్థులకు తక్షణం పరిష్కారం చూపించాలన్నారు. రేవంత్ ఇప్పటికైనా కళ్లు తెరవాలని, రోజురోజుకీ పతనమవుతున్న గురుకుల వ్యవస్థను గాడిన పెట్టాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



కులగణన రాహుల్ ఆదేశం

- రేవంత్, మహేష్‌గౌడ్ అమలు చేశారు
- కేసీఆర్, కేటీఆర్ కవితను వెళ్లగొట్టారు
- ఉనికి కోసమే ఆమె డ్రామాలు ఆడుతోంది
- నాడు కవితకు బీసీలు గుర్తుకు రాలేదా?
- బీజేపీ తెలంగాణ ఎంపీలు.. మోదీకి చెప్పి బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయించండి
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన రాహుల్‌గాంధీ నినాదమని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. ఆయన ఆదేశం మేరకు రాష్ట్రంలో కులగణనను సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్‌లు అమలు చేశారని కితాబునిచ్చారు. రాహుల్ ఆలోచన మేరకే విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కోసం వారు కృషి చేస్తున్నారన్నారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి బీజేపీ తెలంగాణ ఎంపీలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ప్రధాని మోదీకి చెప్పి.. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు బీసీ బిల్లులను ఆమోదింపచేయాలని, తెలంగాణలో బీసీలకు 42% రిజర్వేషన్ అమలు చేయించాలని సూచించారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌లతో మంగళవారం భేటీ అయిన జగ్గారెడ్డి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌లు కవితను ఇంట్లోంచి వెళ్లగొట్టారని, దీంతో బీసీ రిజర్వేషన్ల పేరుతో ఉనికి కోసం ఆమె డ్రామాలు ఆడుతోందన్నారు. "కవిత కూడా ఒక లీడరా? ఆమె కెపాసిటీ ఎంత? కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఆమెకు బీసీలు ఎందుకు గుర్తుకు రాలేదు? ఇంట్లోంచి వెళ్లగొట్టాక బీసీ రిజర్వేషన్లు గుర్తుకొచ్చాయా?" అంటూ నిలదీశారు. కన్న తండ్రి, సొంత అన్నే ఇంట్లోంచి వెళ్లగొట్టాక.. ఇంక కవిత గురించి మాట్లాడటం అనవసరమన్నారు. బీసీ రిజర్వేషన్ల గురించి ఇప్పుడు మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు.. అధికారంలో ఉన్న పదేళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. కాగా.. కాంగ్రెస్ బలోపేతం, పార్టీ జిల్లా కమిటీల కూర్పు తదితర అంశాలపైన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సమీక్ష చేశారని చెప్పారు. జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ నేతలకు ప్రభుత్వ, పార్టీ పోస్టులలో ప్రాధాన్యత ఇవ్వాలని తాను సూచించానని జగ్గారెడ్డి చెప్పారు.

మైహోమ్ నుంచి ఏ హోమ్‌కు!?

- ఏపీలో 919 ఎకరాల సున్నపురాయి నిక్షేపాలు
- 2016లో మైహోమ్ సంస్థకు కేటాయింపు
- సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టాలనే షరతు
- గడువులు దాటినా ఏర్పాటుకాని ఫ్యాక్టరీ
- ఇప్పుడు 'రాధాంగ ఇండస్ట్రీస్'కు లీజులు
- ఏపీ సర్కారు ఉత్తర్వులు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

అవే భూములు! అవే సున్నపురాయి గనులు! కానీ.. కంపెనీ మారింది! షరతులు మాయమయ్యాయి. సిమెంటు ఫ్యాక్టరీ పెట్టి, దానికోసమే సున్నపురాయి వాడాలంటూ ఏపీ సర్కారు.. ఉమ్మడి గుంటూరుజిల్లా దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలో 919 ఎకరాల మేర నిక్షేపాలను 2016 డిసెంబరు 12న 'మైహోమ్' సంస్థకు కేటాయించింది! ఇప్పుడా గనులను.. 'రాధాంగ ఇండస్ట్రీస్' అనే మరో కంపెనీకి బదిలీ చేశారు. అందులో... 'క్యాప్టివ్' అనే షరతూ లేదు. మరో విశేషమేమిటంటే.. రాధాంగ ఇండస్ట్రీస్ చిరునామా కూడా 'మైహోమ్ హబ్'లోనే ఉంది. అంటే.. మైహోమ్ సంస్థకు షరతులతో కేటాయించిన సున్నపు రాయి గనులను అదే కంపెనీ ఏర్పాటు చేసుకున్న అనుబంధ సంస్థకు కేటాయించారనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ సున్నపురాయి నిక్షేపాల విలువ వేల కోట్లలోనే ఉంటుంది! మూడేళ్లలో అంటే 2019 డిసెంబరు నాటికి ఈ ప్లాంట్‌ను ప్రారంభించేలా గనుల శాఖతో మైహోమ్ ఇండస్ట్రీస్ ఒప్పందం కుదుర్చుకుంది. కానీ.. గడువులోపు ఆ సంస్థ ప్లాంటు ఏర్పాటు చేయలేదు. దీంతో 2020 వరకు.. ఆ తర్వాత 2023 వరకూ.. అప్పట్నుంచీ 2024 జూలై 7వరకూ మరోసారి.. గడువును పొడిగించారు. అయినా ప్లాంటు ఏర్పాటుపై అడుగు కూడా ముందుకు పడలేదు సరికదా.. గనులశాఖతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు సిమెంటు కంపెనీ ప్రారంభించాల్సిన మైహోమ్ సంస్థ.. 'రాధాంగ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను తెరపైకి తెచ్చింది. "మాకు ఇచ్చిన సున్నపురాయి లీజును రాధాంగ ఇండస్ట్రీస్‌కు బదిలీ చేయండి' అంటూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్సీఎల్టీ)ని ఆశ్రయించింది. అక్కడ.. అందుకు అనుకూలంగా అనుమతులు వచ్చాయి. దీంతో లీజుబదిలీ చేయాలని.. లీజు కాలపరిమితిని 2067గా నిర్ణయించాలని గనుల శాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. వాటిని ఆమోదిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో141 జారీ చేసింది.

బాలికపై ఐదుగురు బాలుర అత్యాచారం

నిందితుల్లో నలుగురు 4, 5వ తరగతి విద్యార్థులు కాగా.. మరొకరు ఇంటర్ విద్యార్థి

జడ్చర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో తొమ్మిదేళ్ల బాలికపై ఐదుగురు బాలురు అత్యాచారానికి పాల్పడ్డారు. మూడు రోజుల క్రితం ఈ దారుణ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసు వర్గాల ద్వారా తెలిసిన సమాచారం మేరకు... జడ్చర్ల మునిసిపాలిటీలోని ఓ కాలనీలో ఆ బాలిక కుటుంబం నివసిస్తోంది. ఆమెకు సోదరి, సోదరుడు ఉన్నారు. ఆ రోజు తండ్రి ఉదయమే బయటికి వెళ్లాడు. తల్లి అస్వస్థతకు గురైన పెద్ద కుమార్తెను ఆస్పత్రికి తీసుకెళ్లింది. అదే సమయంలో నలుగురు బాలురు ఇంటికి వచ్చారు. బాలికపై ఆ నలుగురితో పాటు ఆమె సమీప బంధువు కూడా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన తల్లి ముభావంగా ఉన్న చిన్న కుమార్తెను ప్రశ్నించడంతో జరిగిన దారుణాన్ని తెలిపింది. వెంటనే చికిత్స కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అనంతరం బాలికను సఖి కేంద్రానికి తరలించారు. అత్యాచారానికి పాల్పడిన ఐదుగురు బాలురలో 4వ, 5వ తరగతి చదువుతున్న 12 సంవత్సరాల వయస్సున్న వారు నలుగురు కాగా ఇంటర్ చదువుతున్న 16 ఏళ్ల మరో బాలుడు ఉన్నాడు. వారిపై గ్యాంగ్‌రేప్, పోక్సో కేసు నమోదు చేశారు.

ఆ పార్టీల పాపం

మాపై తోస్తే ఎట్లా?

- ఏపీ నుంచి ఐదు పంచాయతీలను వెనక్కి తీసుకురావడంపై పార్టీ పరంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- భద్రాద్రి ఆలయానికి కేంద్రం నిధులిచ్చింది
- రాష్ట్ర ప్రభుత్వం కూడా అభివృద్ధి చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



భద్రాద్రి రామాలయంలో రాంచందర్ రావు, పలువురు నేతలు

భద్రాచలం/ఇల్లెందు రూరల్/ పాల్వంచ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన పాపాన్ని తమ మీదకు తోస్తే ఎట్లా? అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రశ్నించారు. విభజన సమయంలో ఏపీలోకి వెళ్లిన కొన్ని ప్రాంతాల విషయంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పటి కేంద్ర సర్కారు, తెలంగాణ ఆవిర్భవిస్తున్న సమయంలో బీఆర్ఎస్ తీసుకున్న నిర్ణయాలనే కేంద్రంలో తాము అధికారంలో వచ్చాక అమలు చేశాం అని చెప్పారు. అయితే భద్రాద్రి జిల్లా వాసుల మనోభావాలను గుర్తించి ఏపీలోకి వెళ్లిన ఆ ఐదు పంచాయతీలను వెనక్కి తీసుకొచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని, ఈ విషయాన్ని పార్టీ పరంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. బుధవారం కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సీతారామచంద్రస్వామిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం అక్కడ, ఇల్లెందు, పాల్వంచల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న పార్టీగానీ, ప్రస్తుత ప్రభుత్వం గానీ భద్రాద్రి ఆలయ అభివృద్ధికి కృషి చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వమే రామాలయ అభివృద్ధికి ప్రసాద్ పథకంలో భాగంగా రూ.98 కోట్లు కేటాయించిందని, తొలి విడతలో రూ.43 కోట్లు విడుదల చేసిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే రీతిలో రామాలయాన్ని అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. హిందూ ఆలయాలు, సంస్థలపై ఇటీవల దాడులు జరుగుతున్నాయని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రభుత్వం మాట్లాడేందుకు కూడా సాహసించడం లేదని.. ఇది మంచిపద్ధతి కాదని విమర్శించారు. ఏపీలోని పురుషోత్తపట్నంలో భద్రాద్రి ఆలయ భూముల ఆక్రమణను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై దాడి జరిగితే తొలుత తానే స్పందించానన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్ల పేరిట కాంగ్రెస్ డ్రామాలాడుతోందని, గతంలో బీసీలకు 50% రిజర్వేషన్లు ఇస్తామని బీఆర్ఎస్ చెప్పిందని.. ఈ రెండు పార్టీలు బీసీలను మోసగించాయని విమర్శించారు. బీసీ రిజర్వేషన్ పేరుతో ముస్లింలకు 10% రిజర్వేషన్ ఇవ్వాలనే ప్రతిపాదనను బీజేపీ వ్యతిరేకిస్తోందని, కాంగ్రెస్‌లోనే కొంతమంది అగ్రనాయకులు ఈ బీసీ రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై లోక్‌సభలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన తీరు పాకిస్థాన్‌కు మద్దతు పలుకుతున్నట్లుగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో 19నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని బీజేపీపట్ల సామాన్య ప్రజలు, మేధావులు కూడా ఆకర్షితులవుతున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



కార్మికశాఖ మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న వెట్టిచాకిరి బాధితురాలు

వెట్టిచాకిరి నిర్మూలిద్దాం: మంత్రి వివేక్

» మీ బాధలు కదిలించాయి.. అండగా ఉంటా: అమల అక్కినేని

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని వెట్టిచాకిరి నుంచి నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందిన కార్మికులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించడంతో పాటు ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. జాతీయ వెట్టిచాకిరి విముక్తి దినోత్సవం సందర్భంగా బుధవారం బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో జరిగిన సదస్సులో మంత్రి పాల్గొన్నారు. వెట్టిచాకిరి, అక్రమ రవాణా సంబంధిత ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబరును 8069 434343 ఆయన ఆవిష్కరించారు. ఇక నుంచి ఫిబ్రవరి 9న వెట్టి చాకిరి విముక్తి దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ఈ సమావేశంలో 200మందికి పైగా వెట్టి చాకిరి నుంచి విముక్తులైన కార్మికులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న ప్రతి ఒక్కరి మాటలు తన మనసును కదిలించాయని బ్లూ క్రాస్ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని భావోద్వేగానికి లోనయ్యారు. వీరందరికి తన పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు.

బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం:దుద్దిళ్ల

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అభివృద్ధికి ఇప్పటికే రూ. 25 కోట్లు కేటాయించామని, భవిష్యత్తులో మరిన్ని నిధులు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గౌలిదొడ్డిలోని బ్రాహ్మణ సదనంలో సెంటర్ ఫర్ బ్రాహ్మిణ్ ఎక్సలెన్స్ (సీబీఈ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. బ్రాహ్మణుల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. సమాజ సేవతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని, ప్రజల సమస్యలను పరిష్కరించడం తనకు ఎల్లప్పుడూ ఆనందాన్నిస్తుందని మంత్రి అన్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్లకు సమాన వేతనం

» గ్రూప్ ఇన్సూరెన్స్, హెల్త్‌కార్డుల జారీ: మంత్రి సీతక్క

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు అందరినీ ఒకే కేటగిరీలో చేర్చి ఒకే రకమైన వేతనం ఇవ్వాలని, ప్రస్తుతం విధుల్లో ఉన్న 7,111 మందికి సమాన వేతనం అమలుచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ఆమెను బుధవారం కలిసిన ఫీల్డ్‌అసిస్టెంట్లు తమ సమస్యలను వినిపించారు. దీనిపై స్పందించిన సీతక్క.. ఫీల్డ్ అసిస్టెంట్లను స్థిరమైన కాల పరిమితి ఉద్యోగులుగా మార్చే అంశం, వేతనాల పెంపు తదితర న్యాయమైన, ఆర్థికపరమైన అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలని సంబంధిత విభాగాలకు సూచించారు. అదేవిధంగా ఫీల్డ్ అసిస్టెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్, ఆరోగ్య బీమా, ఆరోగ్య కార్డులు మంజూరు చేస్తామన్నారు.

382 కోట్లతో జోగులాంబ ఆలయం అభివృద్ధి

» మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్/ కందుకూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శక్తిపీఠం జోగులాంబ అమ్మవారి ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని మంత్రి కొండా సురేఖ తెలిపారు. జోగులాంబ ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌పై ఉన్నతాధికారులతో సచివాలయంలో మంత్రి బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించి అధికారులకు కీలక సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రూ. 382.5 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మొత్తం మూడు విడతల్లో ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని గుమ్మడవెల్లి అటవీ ప్రాంతంలో వన మహోత్సవంలో భాగంగా ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ సీడ్‌బాల్స్ (విత్తనాలను) విసిరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

పట్టణ సంస్కరణల్లో తెలంగాణ భేష్

» కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ అధికారుల కితాబు

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కొత్త రాష్ట్రం అయినా పట్టణ సంస్కరణల అమల్లో దేశ వ్యాప్తంగా ముందు ఉందని కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు ప్రశంసించారని పురపాలక శాఖ అధికారులు తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్, పురపాలక శాఖ సంచాలకుల కార్యాలయం(సీడీఎంఏ) సంయుక్తంగా నగర ప్రణాళికలు, సంస్కరణలపై హైదరాబాద్‌లోని తాజ్ దక్కన్‌లో బుధవారం సమావేశం నిర్వహించినట్లు పురపాలక శాఖ కార్యదర్శి, సీడీఎంఏ టీకే శ్రీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూలధన పెట్టుబడి కింద రాష్ట్రాలకు ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందించే పథకం(ఎస్ఏఎస్‌సీఐ) ద్వారా నిధుల సేకరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా నిధులు రాబట్టుకునేందుకు తెలంగాణ పురపాలక శాఖ అమలు చేస్తున్న విధానాలు, పట్టణ ప్రగతి కోసం అమలు చేస్తున్న సంస్కరణల విషయంలో ఇతర రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ ముందు ఉన్నట్లు కేంద్ర అధికారులు కితాబిచ్చారని సీడీఎంఏ తెలిపారు. బిల్డ్‌నౌ వంటి నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకంటే తెలంగాణలో వేగంగా అమలు చేస్తున్నారని, సంస్కరణల అమలు, ట్రాకింగ్ విధానం బాగుందని కేంద్ర అధికారులు ప్రత్యేకంగా అభినందించారన్నారు.

3 రోజుల పాటు తేలికపాటి వర్షాలు

తెలంగాణలో రాగల మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే బలమైన ఉపరితల గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ వీచే అవకాశం ఉందని తెలిపింది. ఆగస్టు 3వ తేదీ వరకు తెలంగాణలో ఇదే పరిస్థితి నెలకొంటుందని పేర్కొంది. ఇక హైదరాబాద్‌లో పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం, రాత్రి వేళల్లో తేలికపాటి వర్షం, చినుకులు పడే అవకాశం ఉందని తెలిపింది. ఉదయం వేళ పొగమంచుతో కూడిన పరిస్థితులుంటాయని వెల్లడించింది.

ఆపరేషన్ సిందూర్ సైనిక పరాక్రమానికి నిదర్శనం

» రాజ్యసభలో ఎంపీ కె.లక్ష్మణ్



న్యూఢిల్లీ, హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టికల్ 370 రద్దుతో జమ్ము, కశ్మీర్ వేగంగా అభివృద్ధి చెందుతోందని.. అది ఓర్వలేకనే పాకిస్థాన్ ఏప్రిల్ 22న పర్యాటకులపై దాడి చేసిందని రాజ్యసభలో బీజేపీ ఎంపీ కె. లక్ష్మణ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ మన దేశ సైనిక పరాక్రమానికి, ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమనే మోదీ ప్రభుత్వ స్పష్టతకు నిదర్శనమని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో బుజ్జగింపు విధానాలను అనుసరించిందని విమర్శించారు. రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై బుధవారం చర్చ జరిగిన సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ పాక్ ఉగ్రవాద స్థావరాలను నాశనం చేయడానికి చాలా కచ్చితత్వంతో చేసిన లక్షిత దాడి అని చెప్పారు. హైదరాబాద్ గోకుల్ చాట్‌లో బాంబు పేలుళ్లు సంభవించినప్పుడు రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, అయినా ఉదాసీనంగా వ్యవహరించిందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్రం చర్యలు తీసుకొన్న ప్రతీసారి కాంగ్రెస్ పాకిస్థాన్ అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తోందని లక్ష్మణ్ విమర్శించారు.

బీజేపీ నేతలది అవివేకం!

» ఖరీఫ్ ఎరువుల గురించి అడుగుతుంటే గత యాసంగిపై వారు మాట్లాడుతున్నారు..

» రామచందర్‌రావు వ్యాఖ్యలు అర్థరహితం: తుమ్మల



హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ ఎరువుల గురించి తెలంగాణ ప్రభుత్వం అడుగుతుంటే.. బీజేపీ నేతలు గత యాసంగి గురించి మాట్లడటం వారి అవివేకానికి అద్దం పడుతోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎద్దేవా చేశారు. 2024-25 యాసంగి మిగులు యూరియా 1.92 లక్షల మెట్రిక్ టన్నులు సర్కారు వద్ద ఉన్నందువల్లే.. ఈ ఖరీఫ్‌లో కేంద్రం కేటాయింపుల ప్రకారం ఇవ్వకపోయినా సర్దుబాటు చేశామని చెప్పారు. ఎరువుల లెక్కలపై బీజేపీ అధ్యక్షుడు రామచందర్‌రావు చేసే అర్థరహిత వ్యాఖ్యలను ఏమాత్రం సహించేది లేదన్నారు. 'మీకు లెక్కలు తెలియకుంటే.. తెలుసుకొని మాట్లాడాలి. కానీ.. ఎవరో రాసిచ్చింది కాదు. మీ అధ్యక్ష పదవిపై మీ పార్టీ నేతలకు చాలా మందికి కోరిక.. అందుకే మీతో ఇలాంటి మాటలు మాట్లాడించి.. రాజీనామా చేయించాలని చూస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. 'ఈ ఖరీఫ్ సీజన్ కోసం కేంద్రాన్ని 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అడిగితే.. రాష్ట్రం వద్ద గత యాసంగి మిగులు 1.92 మెట్రిక్ లక్షల టన్నులు ఉండటంతో 9.80 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించింది. ఇందులో ఇప్పటివరకు 4.36 లక్షల మెట్రిక్ టన్నులే సరఫరా చేసింది. జూలై వరకు 2.24 లక్షల టన్నుల లోటు ఏర్పడింది. ఇక ఖరీఫ్ మొత్తానికి 5.44 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉంది. రైతుల అవస్థల దృష్ట్యా ఈ మొత్తాన్ని కూడా ఆగస్టులోనే సరఫరా చేయాలని కేంద్రాన్ని కోరుతూ లేఖలు రాశాం' అని వివరించారు. ఇప్పటికైనా రామచందర్‌రావు నిజాలు తెలుసుకొని రాష్ట్రానికి యూరియాను సకాలంలో తెప్పించడానికి కృషి చేస్తారని ఆశిస్తున్నానంటూ తుమ్మల పేర్కొన్నారు.

కాళేశ్వరం రుణాలను రీషెడ్యూల్ చేయండి

» వడ్డీ రేటు తగ్గించి.. కాలపరిమితిని పెంచండి : ఉత్తమ్



హైదరాబాద్/న్యూఢిల్లీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌కు ఇచ్చిన రుణాలను రీషెడ్యూల్ చేయాలంటూ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) సీఎండీ జితేంద్ర శ్రీవాస్తవను నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో జితేంద్ర శ్రీవాస్తవతో ఆయన భేటీ అయ్యారు. రూ.16 వేల కోట్ల రుణాలను కాళేశ్వరంలోని ఎలక్ట్రో మెకానికల్ కాంపోనెంట్ కోసం ఇచ్చారని, రుణాలను తక్కువ వ్యవధిలో అధిక వడ్డీతో కట్టాల్సి ఉండటంతో నిధులన్నీ రుణ చెల్లింపులకే పోతున్నాయని మంత్రి నివేదించారు. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా గాడిన పడుతున్న తెలంగాణకు ఇది ఇబ్బందిగా మారుతోందన్నారు. వడ్డీరేట్లను తగ్గించి రుణ చెల్లింపు కాలపరిమితిని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జితేంద్ర శ్రీవాస్తవ సానుకూలంగా స్పందించారు. ఇక ముందు తీసుకోబోయే రుణాలను తక్కువ వడ్డీకే ఇస్తామని ఆర్ఈసీ హామీనిచ్చినట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో మరో డిస్కం

(మొదటిపేజీ తరువాయి)



ఇంధన శాఖపై సమీక్షలో సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్‌తో సమీక్ష నిర్వహించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, ఇళ్లకు 200 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్తు అందించే గృహజ్యోతి, విద్యాసంస్థలకు ఉచిత విద్యుత్తును అందించే కనెక్షన్లన్నీ కొత్తగా ఏర్పాటు చేసే డిస్కమ్ పరిధిలోకి తేవాలని సూచించారు. ఉత్తర, దక్షిణ డిస్కమ్‌లను వాణిజ్య కార్యకలాపాల కోసమే వినియోగించుకునే దిశగా ఆలోచన చేయాలని చెప్పారు. రాష్ట్రమంతా ఒకే యూనిట్‌గా కొత్త డిస్కమ్ పరిధి ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం టీజీ ఎస్పీడీసీఎల్ (హైదరాబాద్), టీజీ ఎన్పీడీసీఎల్ (వరంగల్) ఉండగా.. కొత్తగా మరో డిస్కమ్ రానుంది. దీనివల్ల ప్రస్తుత డిస్కమ్‌ల పనితీరు మెరుగుపడి, జాతీయ స్థాయిలో పరపతి పెరుగుతుందని సీఎం అన్నారు. డిస్కమ్‌ల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు సంస్కరణలు తప్పనిసరని స్పష్టం చేశారు.

రుణ భారాన్ని తగ్గించాలి..

డిస్కమ్‌ల పునర్వ్యవస్థీకరణతో పాటు విద్యుత్తు సంస్థలపై ఇప్పుడున్న రుణ భారాన్ని తగ్గించాలని సూచించారు. రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు వెంటనే ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. 10 శాతం వరకు వడ్డీతో తీసుకున్న రుణాల వల్ల డిస్కమ్‌లు డీలా పడ్డాయని.. ఈ రుణాలను 6 శాతం వరకు వడ్డీ ఉండేలా రీ స్ట్రక్చర్ చేసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు పెట్టాలని ఆదేశించారు. సౌర విద్యుత్తును అందుబాటులోకి తేవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జిల్లాలవారీగా అనువైన భవనాలను గుర్తించే బాధ్యతను కలెక్టర్లకు అప్పగించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో కూడా సౌర విద్యుత్తును అందుబాటులోకి తేవాలని చెప్పారు. సచివాలయంలో నీడ లేకపోవడంతో వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. విద్యుత్తు అవసరాలతో పాటు పార్కింగ్ ఇబ్బందులు తొలగేలా సచివాలయం చుట్టూ సోలార్ ఫెన్సింగ్, సోలార్ రూఫ్ టాప్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఇందుకోసం యుద్ధప్రాతిపదికన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఇందిర సౌర గిరి జలవికాసం పథకాన్ని అన్ని గిరిజన, ఆదివాసీ గూడేలు, ఏజెన్సీ ప్రాంతాల్లో అమలు చేయాలని చెప్పారు. రానున్న మూడేళ్లలో 2.10 లక్షల మంది ఎస్టీ రైతులకు పథకాన్ని వర్తింపజేయాలని, 6 లక్షల ఎకరాలకు సౌరవిద్యుత్తు పంపుసెట్లు అందించాలని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్‌ను అధికారులు వివరించారు. 2020 ఫిబ్రవరి 20న 13168 మెగావాట్ల డిమాండ్ ఏర్పడగా.. 2021 మార్చి 26న 13,688 మెగావాట్లు, 2022 మార్చి 29న 14,163 మెగావాట్లు, 2023 మార్చి 30న 15,497 మెగావాట్లు, 2024 మార్చి 8న 15623 మెగావాట్లు, 2025 మార్చి 20న అత్యధికంగా 17,162 మెగావాట్ల డిమాండ్ ఏర్పడిందని అధికారులు సీఎంకు నివేదించారు. వార్షిక విద్యుత్తు వినియోగం ఏటా 9.8 శాతం దాకా పెరుగుతోందని గుర్తుచేశారు. కొన్ని ప్రాంతాల్లో వినియోగ వృద్ధి 15 శాతం ఉండగా.. మరికొన్ని ప్రాంతాల్లో 30 శాతంగా ఉందన్నారు. డిమాండ్‌ను బట్టి విద్యుత్తు వినియోగ ప్రాంతాలను నాలుగు కేటగిరీలుగా విభజించినట్లు తెలిపారు.

జీఎస్టీ ఎగవేతలకు అడ్డుకట్ట వేయాలి

» పొరుగు రాష్ట్రాల విధానాలను అధ్యయనం చేయాలి

» అధికార్లకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్టీ) ఎగవేతలకు అడ్డుకట్ట వేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వాణిజ్య పన్నుల శాఖ అధికారులను ఆదేశించారు. వాణిజ్య పన్నుల శాఖపై మంగళవారం రాత్రి ఆయన సమీక్ష నిర్వహించారు. జీఎస్టీ పరిధిలోని సంస్థలు పన్ను సక్రమంగా చెల్లించేలా చూడాలని సీఎం చెప్పారు. పన్ను చెల్లింపుదారుల సందేహాల నివృత్తికి కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీఎస్టీ, ఇతర పన్నుల విషయంలో పొరుగు రాష్ట్రాలు అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేసి మేలైన విధానాలను స్వీకరించాలన్నారు.

రాహుకాలానికి ముందే
'కాళేశ్వరం'పై నివేదిక!

» నేడు ఉదయం 9:57 గంటల్లోపు సర్కారుకు అందజేత

» ఆలోపు రావాలని నీటిపారుదలశాఖ అధికారులకు సమాచారం

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరిపిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గురువారం ప్రభుత్వానికి నివేదిక అందించనుంది. ఈ నివేదికను రాహుకాలం రాకముందే అందించాలని కమిషన్ నిర్ణయించింది. ఉదయం 7:15 గంటల నుంచి 9:01 గంటల మధ్య వర్జ్యం ఉండగా.. దుర్ముహూర్తం ఉదయం 9:58 నుంచి 10:45 గంటల మధ్య ఉందని, దీంతో ఉదయం 9:02 గంటల నుంచి 9:57 గంటల మధ్య నివేదికను తీసుకెళ్లడానికి రావాలంటూ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులకు కమిషన్ కార్యాలయం సమాచారం ఇచ్చింది. స్వతహాగా కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్ర ఘోష్‌కు రాహుకాలంపై నమ్మకం లేదు. కానీ, కమిషన్ కార్యాలయం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై గత ఏడాది మార్చిలో ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయగా.. అదే ఏడాది జూన్ నుంచి విచారణ ప్రారంభమైంది. కమిషన్ చివరిగా గత నెల 6న ఈటల రాజేందర్‌ను, 9న మాజీ మంత్రి హరీశ్‌ను, 11న మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించింది. విచారణ ప్రక్రియ పూర్తికావడంతో నివేదిక సమర్పించడమే తరువాయిగా మారింది. కమిషన్ నివేదిక సమర్పించడానికి ఇచ్చిన గడువు గురువారంతో ముగియనుండగా.. ప్రొటోకాల్ వంటి ప్రక్రియల కోసం ఆగస్టు 3 దాకా గడువు పెంచారు. గురువారం ఉదయం ప్రభుత్వానికి నివేదిక అందించనుండడంతో అందులో ఏముంది? బాధ్యులు ఎవరు? ఏయే చర్యలకు ఉపక్రమించాలని కమిషన్ సిఫారసు చేసింది? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది.



జీఎస్టీలో ఇదో నయా మోసం

» రూ.33.20 కోట్ల ఐటీసీని కొల్లగొట్టిన 'కేషాన్ ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పీ'

» మహారాష్ట్రకు ఖాళీ వాహనాలు నడిపి సరుకుల రవాణా జరిగినట్లు బురిడీ

హైదరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-మహారాష్ట్ర మధ్య ఖాళీ వాహనాలను నడిపి.. పత్రాల్లో మాత్రం భారీగా సరుకుల రవాణా జరిగినట్లు కేషాన్ ఇండస్ట్రీస్ ఎల్ఎల్‌పీ అనే ప్రైవేటు కంపెనీ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖను బురిడీ కొట్టించింది. ఏకంగా రూ.33.20 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను కాజేసింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) నుంచి టోల్‌ప్లాజాల డేటాను పరిశీలించగా అసలు బండారం బయటపడింది. కేషాన్ ఇండస్ట్రీస్‌కు సికింద్రాబాద్ బన్సీలాల్‌పేట్‌లో గోదాం, మెదక్ జిల్లాలోని కలకల్ ఆటోమేటివ్ పార్క్, ముప్పిరెడ్డిపల్లి గ్రామంలో తయారీ యూనిట్లు ఉన్నాయి. ఈ కంపెనీ తెలంగాణ నుంచి మహారాష్ట్రకు రాగి వస్తువులను తరలించకపోయినా తరలించినట్లు దొంగ ఇన్వాయిస్‌లను సృష్టించింది. జీఎస్టీ కౌన్సిల్ వెబ్‌సైట్ నుంచి ఈ-వేబిల్లులు జనరేట్ చేసింది. వీటి ఆధారంగా భారీగా రాగి సంబంధిత వస్తువులు, సరకులు మహారాష్ట్రకు తరలించినట్లు వాణిజ్య పన్నుల శాఖను నమ్మించింది. దాదాపు రూ.100 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లను సృష్టించింది. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఎన్‌హెచ్ఏఐ నుంచి వాహనాల రాకపోకల డేటాను తీసుకుని పరిశీలించారు. వాహనాల రాకపోకలు రికార్డులు ఉన్నప్పటికీ కంపెనీ జనరేట్ చేసిన ఈ-వేబిల్లుల్లోని సరకు భౌతికంగా లేనట్లు కనుగొన్నారు. ఇది జీఎస్టీలో కొత్త రకం మోసమని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కె.హరిత ఓ ప్రకటనలో తెలిపారు. తనిఖీల సందర్భంగా ఖాతా పుస్తకాలు, రిజిస్టర్లు, హార్డ్ డిస్కులు, సీసీటీవీ ఫుటేజ్‌లను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. సంస్థ డైరెక్టర్లు వికాశ్‌కుమార్ కేషాన్, రజనీశ్ కేషాన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలంటూ నగరంలోని సెంట్రల్ క్రైమ్ స్టేషన్(సీసీఎస్) డీసీపీకి ఫిర్యాదు చేశామని తెలిపారు.

మరో రకం మోసం

మెహిదీపట్నంలో మరో రకమైన మోసాన్ని అధికారులు గుర్తించారు. ఏపీ 29 టీఏ 7213 నెంబరు కల వాహనం ఈ ఏడాది జూన్ నుంచి ఎటూ కదలకుండా ఒకే దగ్గర ఉంది. కానీ ఈ వాహన రిజిస్ట్రేషన్ నెంబరును ఉపయోగించి, కొంత మంది పన్ను చెల్లింపుదారులు ఈ-వేబిల్లులను జనరేట్ చేశారు. వాహనంలో సరకులు రవాణా అయినట్లు నమ్మించారు. ఇది కేంద్ర వస్తు సేవల పన్ను(సీజీఎస్టీ) చట్టం-2017 నిబంధనలకు విరుద్ధమని హరిత తెలిపారు. ప్రభుత్వానికి రావాల్సిన న్యాయమైన పన్ను ఆదాయాన్ని ఎగవేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏడుగురు అధికారుల వల్లే
ఉద్యోగులు-సర్కారు మధ్య దూరం!

సమస్యలు పరిష్కరించకుంటే ప్రత్యక్ష ఆందోళనలే.. సీఎస్ రామకృష్ణారావుకు ఉద్యోగుల ఐకాస నోటీసు



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నోటీసు అందజేసిన ఉద్యోగుల ఐకాస ప్రతినిధులు

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ప్రత్యక్ష ఆందోళనలు చేపడతామంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) రామకృష్ణారావుకు ఉద్యోగుల ఐకాస నోటీసు ఇచ్చింది. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఆగస్టు 15 తర్వాత ఆందోళనలకు దిగుతామని ఐకాస ఇప్పటికే వెల్లడించిన సంగతి తెలిసిందే. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కాకపోవడంతో విధి లేని పరిస్థితుల్లోనే నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల తరఫున 63 డిమాండ్లను మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి, సీఎస్ రామకృష్ణారావుకు, అధికారుల కమిటీకి అందజేసినా సమస్యల పరిష్కారం దిశగా ఎలాంటి పురోగతి లేదని పేర్కొన్నారు. ఉద్యోగుల వైద్యం కోసం ఆరోగ్య ట్రస్టు ఏర్పాటుపై అనేక పర్యాయాలు వైద్య శాఖ కార్యదర్శి క్రిస్టినాను కలిసినా స్పందించడం లేదన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాను కలిసి కోరామని, ఆయనా స్పందించలేదని తెలిపారు. ప్రతి నెలా రూ.700 కోట్లు ఇస్తామని ప్రభుత్వం చెబితే.. కేవలం రూ.180 కోట్లు మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు. రెండో పీఆర్సీ సిఫారసులను ప్రభుత్వానికి ఇవ్వడంలో కమిటీ ఛైర్మన్ శివశంకర్ జాప్యం చేశారన్నారు. నవీన్ మిత్తల్ నేతృత్వంలోని అధికారుల కమిటీ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికను ఉద్యోగుల ఐకాసకు అందజేస్తామని చెప్పి.. ఇంత వరకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రికి ఉద్యోగుల సమస్యలపై పలు పర్యాయాలు విజ్ఞాపనలు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. జీవో 317 వల్ల నాలుగేళ్లుగా ఇబ్బంది పడుతున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించినా జీఏడీ ముఖ్య కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా స్పందించడం లేదని ఆక్షేపించారు. సీఎస్ సహా ఏడుగురు ఉన్నతాధికారులు సహకరించకపోవడం వల్లే ఉద్యోగ సంఘాలకు, ప్రభుత్వానికి మధ్య దూరం పెరుగుతోందని ఆరోపించారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు 15 లక్షల మంది తరఫున ఆందోళనలకు సిద్ధమవుతున్నామని తెలిపేందుకే నోటీసు ఇచ్చినట్లు ఐకాస నాయకులు తెలిపారు.

6వ తేదీనే ఢిల్లీలో బీసీ ధర్నా

బీసీ రిజర్వేషన్లపై జంతర్‌మంతర్ వద్ద తలపెట్టిన ధర్నా యథాతథం.. కాంగ్రెస్ పాదయాత్ర షెడ్యూల్‌లో మార్పు

» నేటి నుంచే జనహిత యాత్ర షురూ..

» వచ్చే నెల 4 తర్వాత విరామం.. ఢిల్లీ టూర్

» 5న ఢిల్లీకి సీఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు

» బీసీ బిల్లుల ఆమోదం కోసం ఉభయసభల్లో వాయిదా తీర్మానాలు

» 6న ధర్నా.. 7న రాష్ట్రపతికి వినతిపత్రం

» సీఎం రేవంత్, మీనాక్షి, మహేశ్‌గౌడ్ భేటీలో నిర్ణయం

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యాచరణ ముందుగా నిర్ణయించుకున్న ప్రణాళిక ప్రకారమే జరగనుంది. వచ్చే నెల (ఆగస్టు) 5న పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలతో బీసీ బిల్లులపై వాయిదా తీర్మానాలు ఇప్పించి చర్చ కోసం పట్టుబట్టడం, 6న జంతర్‌మంతర్ వద్ద ధర్నా, 7న రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించడం యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ మేరకు గురువారం నుంచి ఆగస్టు 6 వరకు టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో నిర్వహించాల్సిన పాదయాత్ర షెడ్యూల్‌లో మార్పులు చేశారు. 4వ తేదీ తర్వాత యాత్రకు విరామం ఇవ్వాలని, ఢిల్లీ పర్యటన ముగిశాక తిరిగి కొనసాగించాలని బుధవారం తన నివాసంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో నిర్వహించిన భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. నిజానికి ఆపరేషన్ సిందూర్ సహా కీలక అంశాలపై పార్లమెంటులో చర్చ కొనసాగుతుండటం, మరోవైపు 6వ తేదీ వరకు రాష్ట్రంలో పాదయాత్ర నేపథ్యంలో ఢిల్లీలో చేపట్టాల్సిన కార్యాచరణను 11వ తేదీకి వాయిదా వేయాలని భావించారు. కానీ ఆపరేషన్ సిందూర్‌పై చర్చ మంగళవారమే ముగియడంతో ఢిల్లీలో కార్యాచరణ యథాతథంగా నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చారు.

ప్రత్యేక రైల్లో ఢిల్లీకి బీసీ నేతలు

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నాలో పాల్గొనేందుకు రాష్ట్రం నుంచి బీసీ ప్రతినిధులు ఈ నెల 5న ప్రత్యేక రైల్లో వెళ్లనున్నారు. రాష్ట్రంలో నియోజకవర్గానికి 50మంది చొప్పున బీసీ నేతలను సమీకరించి తీసుకెళ్లాలని మీనాక్షి, మహేశ్‌గౌడ్, సీఎం రేవంత్‌ల భేటీలో నిర్ణయించారు. సీఎం, మంత్రులు, ప్రజా ప్రతినిధులు కూడా 5వ తేదీనే ఢిల్లీకి వెళ్లి మూడు రోజులు మకాం వేయనున్నారు. ధర్నాలో సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ముఖ్యనేతలు, బీసీ సంఘాల నాయకులు పాల్గొంటారు. 7న రాష్ట్రపతిని కలిసి హైదరాబాద్‌కు రానున్నారు.

వీలైనంత త్వరగా నామినేటెడ్ పోస్టుల భర్తీ!

సీఎం రేవంత్, మీనాక్షి, మహేశ్‌గౌడ్‌ల భేటీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ, పార్టీ కమిటీల ఏర్పాటుపైనా చర్చించారు. మంగళవారం ఉమ్మడి జిల్లాల వారీగా అబ్జర్వర్లు, పార్టీ ముఖ్య నేతలు ఇచ్చిన నివేదికలపై సమీక్షించారు. వీలైనంత త్వరగా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించారు.

నేటి నుంచే జనహిత పాదయాత్ర

మహేశ్‌గౌడ్ నేతృత్వంలో మీనాక్షి నటరాజన్ ముఖ్యఅతిథిగా జనహిత పేరిట టీపీసీసీ తలపెట్టిన పాదయాత్ర గురువారం పరిగిలో ప్రారంభం కానుంది. 4వ తేదీన ఖానాపూర్‌లో శ్రమదానం, కార్యకర్తలతో సమావేశం తర్వాత విరామం ఇవ్వనున్నారు. ఢిల్లీ పర్యటన ముగిశాక చొప్పదండి, వర్ధన్నపేటల్లో పాదయాత్ర నిర్వహించి మళ్లీ విరామం ఇస్తారు. ఆగస్టు 15 తర్వాత పాదయాత్ర తిరిగి ప్రారంభం కానుంది.

ఈడీ ముందుకు ప్రకాశ్‌రాజ్

- బెట్టింగ్ యాప్స్ కేసులో 5 గంటలు విచారణ
- రూపాయి తీసుకోకుండా ప్రమోషన్ చేసా!
- బాధ్యత గల పౌరుడిగా విచారణకు వచ్చా..
- ఇకపై ప్రమోషన్ చేయను ప్రకాశ్‌రాజ్



హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసుకు సంబంధించి సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముందు తన న్యాయవాదితో కలిసి బుధవారం విచారణకు హాజరయ్యారు. ఆయన్ను ఈడీ అధికారులు దాదాపు ఐదు గంటలు విచారించి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. 2016లో ప్రకాశ్‌రాజ్ జంగిల్ రమ్మీ అనే యాప్‌కు ప్రమోషన్ చేసిన నేపథ్యంలో.. అందుకు ఎంత పారితోషికం తీసుకున్నారు? నగదు రూపంలోనా.. ఆన్‌లైన్‌లోనా? అని ఈడీ అధికారులు ఆయన్ను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. విచారణ అనంతరం ప్రకాశ్‌రాజ్ మీడియాతో మాట్లాడుతూ.. జంగిల్ రమ్మీ యాప్ ప్రమోషన్ చేసినందుకు తనకు ఒక్క రూపాయి కూడా రాలేదన్నారు. వారు డబ్బు ఇస్తానని చెప్పినా తాను తీసుకోలేదని పేర్కొన్నారు. జంగిల్ రమ్మీ యాప్ యాజమాన్యానికి తనకు మధ్య ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరగలేదని ఆయన తెలిపారు. డబ్బు తీసుకోకుండా జంగిల్ రమ్మీ ప్రమోషన్ ఎందుకు చేశారన్న ప్రశ్నకు ఆయన సమాధానం దాటవేశారు. బాధ్యత గల పౌరుడిగా ఈడీ అధికారుల నోటీసు ప్రకారం విచారణకు హాజరయ్యానని, వారు అడిగిన సమాచారం ఇచ్చానని, తనను మళ్లీ విచారణకు రావాలని ఈడీ అధికారులు కోరలేదని ఆయన వివరించారు. ఇదిలా ఉండగా బెట్టింగ్ యాప్స్ కేసులో మనీలాండరింగ్ కోణంలో విచారణ జరుపుతున్న ఈడీ అధికారుల ముందుకు వచ్చే నెల 11వ తేదీన విజయ్ దేవరకొండ, దగ్గుబాటి రాణా రానున్నారు. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేసిన సెలబ్రిటీలకు దుబాయ్ రూట్‌లో హవాలా మార్గంలో డబ్బు చెల్లించినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఈడీ అధికారులు పలు కోణాల్లో విచారణ సాగిస్తున్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లు, యూట్యూబర్లు బెట్టింగ్ యాప్‌లను తమ సోషల్ మీడియా ఖాతాల ద్వారా ప్రమోట్ చేసి భారీగా ఆదాయాన్ని సంపాదించినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్న నేపథ్యంలో అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని ఈడీ అధికారులు పేర్కొన్నారు.

'డ్రంకెన్ డ్రైవ్ కేసు' ఘటనలో వ్యక్తి మృతి

- నాపైనే కేసు పెడతారా అంటూ ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ మృతి.. ఈ నెల 28న నల్లగొండలో ఘటన
- స్టేషన్ ఎదుట కుటుంబసభ్యుల ధర్నా

నల్లగొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నాపైనే డ్రంకెన్ డ్రైవ్ కేసు పెడతారా అంటూ.. పెట్రోల్‌తో నిప్పంటించుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతన్ని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగింది. నల్లగొండ దేవరకొండ రోడ్డులో ఈ నెల 28వ తేదీన వన్‌టౌన్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో రావిళ్ల నర్సింహ (40) డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలో దొరకగా పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. దీన్ని అవమానంగా భావించిన నర్సింహ అదే రోజు రాత్రి పోలీసు స్టేషన్ వద్దకు వచ్చి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. పోలీసులు వెంటనే స్పందించి నిప్పును ఆర్పి అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ నర్సింహ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనలో ఎస్సైను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట నర్సింహ కుటుంబసభ్యులు ధర్నా చేశారు. పోలీసులు వారితో చర్చించి సమస్యను సద్దుమణిగేలా చేశారు. ఈ ఘటనపై విచారణ జరుపుతామని జిల్లా ఎస్పీ తెలిపారు.

లిక్కర్ స్కామ్.. 11 కోట్ల డంప్

లిక్కర్ స్కామ్‌లో 11 కోట్లు సీజ్.. ఇంత భారీ నగదు పట్టుబడటం దేశ చరిత్రలోనే తొలిసారి

- హైదరాబాద్ సమీపంలోని ఫామ్‌హౌస్‌లో సిట్ స్వాధీనం
- 12 అట్ట పెట్టెల్లో నోట్ల కట్టలు
- ఫామ్‌హౌస్ యజమాని కసిరెడ్డి మిత్రుడే
- విజయవాడకు నగదు, వరుణ్ తరలింపు
- ఏసీబీ కోర్టుకు సిట్ సమాచారం



అమరావతి/రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/శంషాబాద్ రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయి. కానీ మొట్టమొదటసారిగా స్కామ్‌కు సంబంధించిన నగదు పెద్ద మొత్తంలో దర్యాప్తు అధికారులకు దొరికిపోయింది. కేసులో నిందితుడు ఇచ్చిన సమాచారంతో జరిపిన సోదాల్లో నోట్ల కట్టలు వెలుగు చూశాయి. జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో ముడుపులు వసూలు చేసి దాచిన రూ.11 కోట్ల నగదు డంప్ బయటపడింది. హైదరాబాద్ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఏడాది కాలంగా దాచిన ఈ నగదును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. లిక్కర్ కేసులో నిందితుడైన వరుణ్ పురుషోత్తం(ఏ-40) ఇచ్చిన సమాచారం ఆధారంగా బుధవారం వేకువజామున సిట్ అధికారులు అధికారులు సోదాలు చేశారు. రాజ్ కసిరెడ్డి సూచన మేరకు ఫామ్‌హౌస్‌లో 12 బాక్సుల్లో జాగ్రత్తగా భద్రపరిచిన 11 కోట్ల రూపాయల నగదును సీజ్ చేశారు. లిక్కర్ స్కామ్‌లో కసిరెడ్డి దాచి ఉంచిన ముడుపులేనని సిట్ ఆధారాలతో బయటపెట్టింది. నాడు తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని వేల కోట్ల అవినీతికి పాల్పడిన జగన్‌పై 11 కేసులు నమోదు చేసిన సీబీఐ, ఆరు కేసులు పెట్టిన ఈడీ కూడా ఇన్ని కోట్ల రూపాయల నగదు సీజ్ చేయలేదు. దేశ చరిత్రలోనే ఇదే మొదటిసారి.

అరెస్ట్ చేసిన గంటల వ్యవధిలోనే...

మద్యం కుంభకోణంలో దాదాపు రూ.3,500 కోట్ల ముడుపులు చేతులు మారినట్లు సిట్ ప్రాథమికంగా నిర్ధారించిన విషయం తెలిసిందే. మద్యం కుంభకోణం బయటకు రాగానే ఇందులో కీలకంగా ఉన్న కొందరిని పెద్దలు విదేశాలకు పంపించేశారు. వీరిలో కొందరికి దుబాయ్‌లో గోల్డ్ కార్డు కూడా ఇప్పించినట్లు తెలుస్తోంది. ఇలా విదేశాలకు పరారైన వారిలో ఏ-40 వరుణ్ పురుషోత్తంపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. అలాగే విజయవాడ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉన్న నిందితులను బయటకు రప్పించే యత్నాలను అధికారులు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా వరుణ్ పురుషోత్తం మంగళవారం రాత్రి దుబాయ్ నుంచి వస్తున్నట్లు తెలుసుకున్న అధికారులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అతడ్ని అరెస్ట్ చేశారు. వరుణ్ ఇచ్చిన సమాచారంతో బుధవారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో శంషాబాద్ మండలం కాచారంలోని ఫామ్‌హౌస్‌లో దాడులు నిర్వహించారు. నగదును స్వాధీనం చేసుకుని విజయవాడకు తరలించారు. మరింత సమాచారం కోసం సిట్ అధికారులు వరుణ్‌ను విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు.

ఫైళ్లు, బియ్యం బస్తాల మాటున..

నగదు బయటపడ్డ ఫామ్ హౌస్ యజమాని కుటుంబానికీ, రాజ్ కసిరెడ్డి కుటుంబానికీ మధ్య సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ ఫామ్ హౌస్ వర్ధమాన్ ఇంజనీరింగ్ కాలేజీ యజమాని తీగల బాల్‌రెడ్డి కుటుంబానికి చెందినది. ఆయన భార్య పేరిటే ఈ ఫామ్ హౌస్ ఉంది. తీగల బాల్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి సతీమణి దివ్యా రెడ్డి.. ఇద్దరూ ఆరేట్ ఆస్పత్రిలో భాగస్వాములు కావడం విశేషం. ఈ పరిచయంతోనే.. లిక్కర్ స్కామ్ నగదు దాచేందుకు వీరి ఫామ్‌హౌస్‌ను వాడుకున్నట్లు తెలుస్తోంది. ఫామ్ హౌస్‌లోని స్టోర్ రూమ్‌లో ఫైళ్లు, బియ్యం బస్తాల మధ్య అట్టపెట్టెల్లో ఈ నగదును దాచి ఉంచారు. పక్కా సమాచారంతో వెళ్లిన సిట్ అధికారులు రూ.11 కోట్ల నగదు గుర్తించి జప్తు చేశారు. ఈ వివరాలను ఈడీకి సిట్ తెలియజేసింది.

కాఫీ షాపు నుంచి దుబాయి వరకు...

కేసు విచారణలో కీలకంగా ఉన్న వరుణ్ బయట పెడుతున్న విషయాలతో మద్యం కేసు మలుపులు తిరుగుతోంది. ఇప్పుడు వరుణ్ ఎవరనే దానిపై చర్చ జరుగుతోంది. సికింద్రాబాద్‌కు చెందిన వరుణ్ ఇంజనీరింగ్ చదివాడు. తరువాత హైదరాబాద్‌లోని ఓ కాఫీ షాపులో నెలకు రూ.32 వేల వేతనంతో పనిచేసేవాడు. తర్వాత రాజ్ కసిరెడ్డి డెన్‌లోకి ప్రవేశించిన వరుణ్ మద్యం ముడుపుల వసూళ్లలో కీలకంగా మారాడు. లిక్కర్ గ్యాంగ్‌లో కీలక సూత్రధారి రాజ్ కసిరెడ్డి.. ఎంపీ మిథున్ రెడ్డితో కలిసి ఆయన బినామీగా నడిపించిన ఆదాన్ డిస్టిలరీస్‌తో పాటు పుదుచ్చేరికి చెందిన లీలా డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వరుణ్‌ను మొత్తం వ్యాపారానికి ఇన్‌చార్జిగా నియమించారు. ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ నుంచి లీలా డిస్టిలరీస్‌కు భారీగా మద్యం సరఫరా ఆర్డర్లు కట్టబెట్టారు. లీలా డిస్టిలరీస్ ద్వారా రూ.453.97 కోట్ల వరకు మద్యం వ్యాపారం చేశారు. అందుకు ప్రతిఫలంగా 16 ఖాతాల్లోకి 52.78 కోట్ల వరకూ ముడుపులు జమ చేశారు. అందులో 11 కోట్ల సొమ్ము అందుకున్న పొట్లూరి అంజిరెడ్డి, పియూష్ గడోడియా అనే వ్యక్తులు నోట్ల కట్టలు అట్ట పెట్టెల్లో పెట్టి రాజ్ కసిరెడ్డికి అందజేశారు. అప్పటికే నమ్మకస్తుడిగా ఉన్న వరుణ్ ద్వారా తన ఎదురు విల్లాలో ఉండే తీగల విజయేందర్‌రెడ్డి, ఉపేందర్ రెడ్డికి చెందిన వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో భద్ర పరిచారు. తర్వాత సులోచన వ్యవసాయ క్షేత్రంలోకి తీసుకెళ్లారు. ఎవరికీ అనుమానం రాకుండా ఏ-4 సైజ్ పేపర్లంటూ లోపల దాచారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయాక డబ్బులు భద్రంగా దాచేసిన రాజ్ కసిరెడ్డి.. వరుణ్ పురుషోత్తంను దుబాయ్‌కి పంపించేశాడు. వీటికి సంబంధించిన ఆధారాలను సిట్ సంపాదించింది. కాగా, మద్యం కుంభకోణం సొమ్ము రూ. 11 కోట్లను కోర్టులో భద్ర పరచాలంటో విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు బుధవారం మెమో దాఖలు చేశారు. మరోవైపు.. ఈ నగదుతో తనకు సంబంధంలేదంటూ రాజ్ కసిరెడ్డి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

చాణక్యను నమ్మి మోసపోయా..

వరుణ్ పురుషోత్తం విచారణలో పలు విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. తాను ఉన్నత విద్యావంతుడినని, బూనేటి చాణక్యను నమ్మి అన్నివిధాలా జీవితాన్ని కోల్పోయానని కంటతడి పెట్టుకున్నట్లు సమాచారం. తనకు తెలియని లిక్కర్ బిజినెస్‌లో దింపి ప్రభుత్వం మారగానే దుబాయ్‌కు తీసుకెళ్లాడని, సీఐడీ కేసు నమోదు చేసినప్పటి(2024 సెప్టెంబరు) నుంచి ఎన్నో నిద్ర లేని రాత్రులు గడిపానని వాపోయినట్లు తెలిసింది. తీగల సోదరులు కూడా చాణక్యతో తరచూ సమావేశం అయ్యేవారని, ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయిన తర్వాత దుబాయ్ వెళ్లేందుకు తమకు సహకరించారని వెల్లడించినట్లు సమాచారం. తమతో పాటు దుబాయ్ వచ్చిన బూనేటి చాణక్య సిట్ పిలుపుతో తిరిగొచ్చే సమయంలో.. 'ఇది నిలబడే కేసు కాదు.. వెంటనే బెయిల్ తీసుకుని తిరిగొస్తా.. మీ పేర్లు చేర్చినా, 90 రోజులు దాటినా ముందస్తు బెయిల్ వచ్చేస్తుంది.. అని ఇక్కడికి వచ్చాడు. అరెస్టై విజయవాడ జైల్లో ఖైదీలకు వంట చేస్తున్నాడు. దీంతో మాకు భయం పట్టుకుంది. రెడ్ కార్నర్ నోటీసు అనగానే అందరూ దుబాయ్ నుంచి వెనక్కి వద్దామని అనుకున్నాం. మిగతా వాళ్లు కూడా వచ్చేస్తారు' అని సిట్ అధికారులకు వివరించినట్లు తెలిసింది.



ఎకరం రూ.65.34 కోట్లు

- కేపీహెచ్‌బీలో ఒక ప్లాట్‌కు పలికిన ధర
- రాజీవ్ స్వగృహ ఫ్లాట్ల ద్వారా 26 కోట్లు
- హౌసింగ్ బోర్డుకు భారీ ఆదాయం

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు నిర్వహించిన వేలంలో ఎకరం ధర రూ.65.34కోట్లు పలికింది. ఈ భూమిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెన్సీ ఆఫ్ ఇండియా అనే సంస్థ ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో అత్యధిక ధరకు దక్కించుకుందని బోర్డు ఎండీ వీపీ గౌతమ్ తెలిపారు. ఈ ప్లాట్ కూకట్‌పల్లిలోని ఫేజ్-4లో ఉంది. మరోవైపు రాజీవ్ స్వగృహ పరిధిలోని బండ్లగూడలో ఉన్న వివిధ టవర్లలోని 159 ఫ్లాట్లకు బుధవారం లాటరీ నిర్వహించారు. ఈ లాటరీ ద్వారా హౌసింగ్ బోర్డుకు మరో రూ.26కోట్ల ఆదాయం వచ్చింది. 3 బీహెచ్‌కే (11) ఫ్లాట్లకు దాదాపు 1325 దరఖాస్తులు, 2 బీహెచ్‌కే (19) ఫ్లాట్లకు 525, సింగిల్ బెడ్ రూమ్ (105) ఫ్లాట్లకు 234 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 159 ఫ్లాట్లలో సీనియర్ సిటిజన్లకు కేటాయించినవి పోగా, మిగిలిన వాటికి ఈ దరఖాస్తులను స్వీకరించారు. లాటరీ ప్రక్రియ సీనియర్ సిటిజన్ల కోసం కేటాయించిన ఫ్లాట్లతో ప్రారంభమైంది. బండ్లగూడలో ఫ్లాట్లు దక్కని దరఖాస్తుదారులు పోచారంలో ఉన్న ఫ్లాట్లకు అదే రశీదులతో దరఖాస్తు చేసుకోవచ్చని బోర్డు ప్రకటించింది. సింగిల్ బెడ్ రూమ్ (రూ.13లక్షలు) ఫ్లాట్లు 255, 2బీహెచ్‌కే (రూ.19 లక్షలు) ఫ్లాట్లు 340 అందుబాటులో ఉన్నాయి. ఈ ఫ్లాట్లకు గురువారం సాయంత్రం వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఆగస్టు 1, 2 తేదీల్లో లాటరీ నిర్వహిస్తామని హౌసింగ్ బోర్డు ప్రకటించింది.

తిరుమలలో టికెట్ పొందినరోజే

శ్రీవాణి దర్శనం

తిరుమల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీవాణి టికెట్ల కేటాయింపు, దర్శన వేళల్లో టీటీడీ మార్పులు చేసింది. వీరికి కల్పించే వీఐపీ బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4.30 గంటలకు మార్చింది. ఆగస్టు 1 నుంచే ఇది అమల్లోకి వస్తుంది. అయితే, ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్ ద్వారా అక్టోబరు 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో శ్రీవాణి టికెట్లు పొందిన భక్తులను మాత్రం పాత సమయంలోనే ఉదయం 10 గంటలకే దర్శనానికి అనుమతిస్తారు. ప్రస్తుతం తిరుమలలో శ్రీవాణి టికెట్లను ఉదయం 7 గంటలకు జారీ చేస్తున్నారు. వీరికి తర్వాత రోజు ఉదయం దర్శనం కేటాయిస్తున్నారు. దీనివల్ల భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి, అందువల్ల ఉదయం 10 గంటలకు శ్రీవాణి టికెట్లు కేటాయించి, అదేరోజు సాయంత్రం 4.30 గంటలకు దర్శనం కల్పిస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుందనే ఆలోచనతో టీటీడీ ఈ మార్పులు చేసింది.

సైబర్ దోపిడీ రూ. 378 కోట్లు!



దేశంలోనే అతిపెద్ద 'క్రిప్టో' సంస్థ నెబ్లియో టెక్నాలజీస్ సర్వర్ హ్యాక్

- సంస్థ ఉద్యోగి ల్యాప్‌టాప్ నుంచే 44 మిలియన్ యూఎస్‌డీటీ బదిలీ
- దేశంలోనే అతిపెద్ద ఘటన: పోలీసులు

బెంగళూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాల్లో ఇది పరాకాష్ఠ!. ఇప్పటి వరకు వ్యక్తులను డిజిటల్ అరెస్టు చేయడం, బెదిరించి సొమ్ము బదిలీ చేసుకోవడం తెలిసిందే. అలాగే ఇతర రూపాల్లోనూ మోసాలకు పాల్పడి నగదును దోచేస్తున్న సైబర్ నేరగాళ్లు.. ఇప్పుడు కంపెనీలను కూడా లక్ష్యంగా చేసుకుని పేట్రేగి పోతున్నారు. అత్యంత పటిష్ఠమైన అంతర్గత భద్రత ఉన్న బెంగళూరులోని క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ సంస్థ నెబ్లియో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సర్వర్‌ను హ్యాక్ చేసి.. ఏకంగా రూ.378 కోట్లను వేరే ఖాతాల్లోకి బదిలీ చేసుకున్నారు. నెబ్లియో టెక్నాలజీస్.. దేశంలోనే అతి పెద్ద క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ సంస్థ. ఈ సంస్థ పటిష్ఠమైన అంతర్గత భద్రతా చర్యలను పాటిస్తోంది. అయినప్పటికీ.. సైబర్ నేరగాళ్లు ఈ సంస్థ సర్వర్‌లోకి ప్రవేశించి.. భారీ మోసానికి పాల్పడ్డారు. దీనికిగాను సంస్థ పార్ట్‌టైమ్ ఉద్యోగి ల్యాప్‌టాప్‌ను వినియోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. దేశంలోనే అతిపెద్ద సైబర్ మోసంగా దీనిని పేర్కొన్నారు. కాగా, సైబర్ నేరగాళ్లు బదిలీ చేసిన సొమ్ము పూర్తిగా సంస్థ, సంస్థ భాగస్వాములదేనని, వినియోగదారులకు ఎలాంటి నష్టం జరగలేదని నెబ్లియో టెక్నాలజీస్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ హర్‌దీప్‌సింగ్ తెలిపారు. క్రిప్టో సహా బిట్ కాయిన్ ఎక్స్ఛేంజ్ సంస్థ నెబ్లియో టెక్నాలజీస్‌కు దేశంలోనే మంచి పేరుంది. దీనినే 'కాయిన్ డీసీఎక్స్'గా కూడా పిలుస్తారు. ఈ సంస్థ వినియోగించే ప్రత్యేక సాఫ్ట్ వేర్ సహా రెండంచల భద్రతా వ్యవస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. అయితే.. ఈ నెల 19, శనివారం తెల్లవారుజామున 2.37 గంటలకు కంపెనీ వాలెట్ నుంచి ఒక యూనైటెడ్ స్టేట్స్ డాలర్ టెదర్(యూఎస్‌డీటీ) గుర్తు తెలియని వ్యాలెట్‌కు బదిలీ అయింది. ఆ తర్వాత ఉదయం 9.40 గంటలకు సైబర్ నేరగాళ్లు సర్వర్‌లోకి ప్రవేశించి, ఏకంగా 44 మిలియన్ యూఎస్‌డీటీ(రూ.378 కోట్లు) బదిలీ చేశారు. ఈ బదిలీ జరిగిన తర్వాత.. వెబ్-3 ట్రేడింగ్ ఆగిపోయింది. దీంతో ఉలిక్కిపడిన సంస్థ అధికారులు.. అసలేం జరిగిందన్న విషయంపై దృష్టిపెట్టారు. ఈ సంస్థలో పార్ట్‌టైమర్‌గా పనిచేస్తున్న ఉద్యోగి రాహుల్ అగర్వాల్ ల్యాప్‌టాప్ నుంచి సైబర్ నేరగాళ్లు కంపెనీ సర్వర్‌ను హ్యాక్ చేశారని గుర్తించారు. సంస్థ వైస్‌ప్రెసిడెంట్ హర్‌దీప్‌సింగ్ ఈ నెల 22న వైట్‌ఫీల్డ్ సీఈఎన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు రాహుల్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. తాను అదే ల్యాప్‌టాప్‌ను మరోచోట వినియోగించినట్లు రాహుల్ చెప్పారు. దీనికిగాను అక్కడ రూ.15 లక్షలు పొందినట్లు తెలిపారు. దీంతో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు.

ఫైర్ వాల్స్.. నామమాత్రం!

సాధారణంగా సిస్టమ్‌లను హ్యాక్ చేసేందుకు ఫిషింగ్, రాన్‌సమ్‌వేర్, బ్రూట్-ఫోర్స్ వంటి వాటిని నేరగాళ్లు వినియోగిస్తారు. కానీ, 'కాయిన్ డీసీఎక్స్' విషయంలో మాత్రం ఈ సంస్థ ప్రత్యేకంగా వినియోగిస్తున్న 'ఇంటర్నల్ ఆపరేషనల్ అకౌంట్'ను లక్ష్యంగా చేసుకున్నారు. సంస్థ వినియోగిస్తున్న అధునాతన సర్వర్, వాల్ట్ ఐసోలేషన్, ఏపీఐలను అత్యంత చాకచక్యంగా సైబర్ నేరగాళ్లు తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. వాస్తవానికి నెబ్లియో సంస్థ సిస్టమ్ రక్షణ కోసం ఫైర్‌వాల్‌ను ఏర్పాటు చేసింది. కానీ.. ఈ ఫైర్ వాల్స్.. ప్రధాన యాప్ సేవలకు, డేటాబేస్ భద్రతకు మాత్రమే పరిమితం అవుతున్నాయి. దీంతో లిక్విడిటీ బ్రిడ్జ్ లేదా ఏపీఐకి అనుసంధించిన ఆపరేషనల్ వ్యాలెట్‌కు ఫైర్ వాల్స్ భద్రత కల్పించవు. నెబ్లియోలో కూడా 'ఆపరేషనల్ వ్యాలెట్'ను హ్యాక్ చేయడం ద్వారానే సైబర్ మోసం జరిగింది.

నింగిలోకి నిసార్



మిషన్ కంట్రోల్ సెంటర్‌లో పల్లీల డబ్బాతో నాసా శాస్త్రవేత్త

(మొదటి పేజీ తరువాయి)

హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. అక్కడి నుంచే రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. సహచర శాస్త్రవేత్తలను ఆలింగనం చేసుకొని ఆనందం పంచుకున్నారు. ఈ ఏడాది మేలో పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ ప్రయోగం విఫలమైన నేపథ్యంలో.. ఈ విజయం ఇస్రోకు భారీ ఉత్సాహాన్నిచ్చింది. ఇస్రో-నాసా సంయుక్త మిషన్ కావడంతో ఇస్రోతో పాటు అమెరికా నుంచి నాసా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు చేరుకుని ప్రయోగాన్ని పరిశీలించారు.

తొలి సిగ్నల్స్ అందాయ్...

విజయవంతంగా కక్ష్యలోకి చేరిన నిసార్ ఉపగ్రహం అక్కడ స్థిరంగా ఉన్నట్లు బెంగళూరులోని హసన్ మాస్టర్ కంట్రోల్ సెంటర్ గ్రౌండ్ స్టేషన్‌కు సిగ్నల్స్ అందాయి. భూపరిశీలన కోసం నాసా-ఇస్రో ఈ ఉపగ్రహాన్ని తయారు చేశాయి. దీని బరువు 2,392 కిలోలు. ఈ కొత్తతరం ఉపగ్రహం భూమిని అణువణువూ స్కాన్‌చేసి సమాచారాన్ని చేరవేస్తుంది. కొండలు, పర్వతాలు, జలవనరులు ఇలా అన్నింటినీ జల్లెడపడుతుంది. ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నారాయణన్‌కు ఇది మూడో ప్రయోగం. తొలి రెండు ప్రయోగాలూ విఫలం కావడంతో దీని విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. కాగా, నాసా-ఇస్రో సంయుక్తంగా అభివృద్ధి చేయడంతో దీనికి 'నిసార్' (నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్) అని పేరు పెట్టారు. దీనికోసం ఇరువురూ రూ.13వేల కోట్లకుపైగా వెచ్చించినట్టు అంచనా. ఇప్పటివరకు అంతరిక్షంలోకి చేర్చిన అత్యంత శక్తిమంతమైన భూపరిశీలన ఉపగ్రహాల్లో ఇదీ ఒకటి.

పల్లీలు తింటూ.. ప్రయోగాన్ని వీక్షిస్తూ..

నిసార్ ఉపగ్రహ ప్రయోగ సమయంలో శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ సెంటర్‌లో నాసా శాస్త్రవేత్తలు పల్లీలు తింటూ కనిపించారు. ప్రయోగాన్ని పరిశీలిస్తున్న సమయంలో వారి చేతుల్లో చిన్న డబ్బాలు కనిపించాయి. రాకెట్ గమనాన్ని వీక్షిస్తున్నంతసేపూ వాళ్లు అందులో ఉన్న పల్లీలు పంచుకుని తింటూ ఉన్నారు. దీనిపై ఇస్రో పూర్వ ఉద్యోగిని ప్రశ్నించగా.. 'ప్రతి ప్రయోగ సమయంలోనూ వాళ్లు ఇలాగే పల్లీలు తింటారు.. ఇది వాళ్ల సెంటిమెంట్ అని చెప్పారు.




బలపడిన ఇస్రో-నాసా బంధం

'భూపరిశీలన ఉపగ్రహం కోసం ఇస్రో-నాసా మధ్య 2014లో ఒప్పందం కుదిరింది. అప్పట్నుంచి రెండు బృందాలు నిసార్ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశారు. ఇద్దరూ కలిసి చేపడుతున్న తొలి ప్రయోగమే అయినా.. మా మధ్య బంధం మరింత బలపడింది. రాబోయే కాలంలో ఇద్దరం కలిసి మరో మూడు ప్రయోగాలు చేపట్టేందుకు ఒప్పందం చేసుకున్నాం' అని ఇస్రో చైర్మన్ నారాయణన్ అన్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగం విజయానంతరం ఆయన మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడారు. శాస్త్రవేత్తల సమష్టి కృషితోనే నిసార్ విజయవంతమైందన్నారు. రాబోయే రోజుల్లో చంద్రయాన్-4 ప్రయోగ పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ఈ ఏడాది చివరికి గగన్‌యాన్-1 పేరుతో రోబో వ్యోమమిత్రను అంతరిక్షంలోకి పంపే ప్రయోగానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పీఎస్ఎల్వీ సిరీస్‌లో కూడా మరో నాలుగు ప్రయోగాలు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. కాగా, ఇస్రో తమకు చక్కని సహకారం అందించినట్లు నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. ఇస్రో చైర్మన్‌తోపాటు షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, వీఎస్ఎస్‌సీ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్, శాటిలైట్ ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రరావు, జీఎస్ఎల్వీ మిషన్ డైరెక్టర్ థామస్ కురియన్ తదితరులు ఉన్నారు.

నిసార్ విశేషాలు

- ఉమ్మడిగా భూపరిశీలన ఉపగ్రహ మిషన్‌ను ప్రారంభించేందుకు నాసా, ఇస్రో 2014 సెప్టెంబరులో ఒప్పందం చేసుకున్నాయి. నాసా-ఇస్రో మధ్య కుదిరిన తొలి భారీ ఒప్పందమిది.
- భూమిపై పొరల్లో ఒక్క సెంటీమీటరు మార్పులు సంభవించినా గుర్తించేందుకు వీలుగా దీనిలో డబుల్ ఎల్, ఎస్-బ్యాండ్ రాడార్ ఫ్రీక్వెన్సీలను ఉపయోగించారు. ఈ రాడార్లు పగలు, రాత్రి మేఘాలు, పొగ, వర్షం, పొగమంచులోనూ స్పష్టంగా ఫొటోలు తీసి పంపగలవు.
- సైన్స్ డేటా కోసం ఎల్-బ్యాండ్ సింథటిక్ అపార్చర్ రాడార్, జీపీఎస్ రిసీవర్లను నాసా అందించగా.. ఉపగ్రహం, ఎస్-బ్యాండ్ రాడార్, ప్రయోగానికి అవసరమైన జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్‌ను ఇస్రో సమకూర్చింది.
- భూకంపాలు, అగ్నిపర్వతాల పేలుళ్లు, కొండచరియలు, పర్వత ప్రాంతాల్లో మంచు చరియలు విరిగిపడే పరిస్థితులను ముందే గుర్తిస్తుంది.
- నిసార్ భూమిపై, సముద్రాల్లో మంచు పరిస్థితి ఎలా ఉంది.. ఎంత మందంలో ఉంది? ఆ మంచు కరిగి నీరుగా మారే అవకాశాలను కచ్చితత్వంతో గుర్తిస్తుంది. భూమిని, మంచును 3డీలో చూపిస్తుంది. ఇది 12 రోజుల వ్యవధిలో భూమి మొత్తాన్నీ స్కాన్ చేస్తుంది.
- అడవులు, పంటల విస్తీర్ణం, పచ్చదనంలో తేడాలు, నేల తేమ, నీటి వనరులు, తేడాలను గుర్తిస్తుంది.
- నిసార్ డేటాతో ప్రభుత్వాలు ప్రకృతి విపత్తులు, ప్రమాదాలను అంచనావేసి తగుజాగ్రత్తలు తీసుకోవచ్చు.
- జీఎస్ఎల్వీ-ఎఫ్16 ద్వారా ఇస్రో సూర్య సమకాలిక కక్ష్యలోకి ఒక ఉపగ్రహాన్ని ప్రయోగించడం ఇదే తొలిసారి. శ్రీహరికోట నుంచి ఇస్రోకు ఇది 102వ ప్రయోగం.

రష్యాలో 8.8 తీవ్రతతో భారీ భూకంపం



సునామీ హెచ్చరికలతో జపాన్‌లో ముందుజాగ్రత్తగా ఓ భవనంపైకి ఎక్కిన ప్రజలు

- ఊగిపోయిన కమ్చాట్కా ద్వీపకల్పం..
- పసిఫిక్ తీర దేశాలకు సునామీ అలర్ట్
- ముందు జాగ్రత్తతో తప్పిన ప్రాణనష్టం



'క్ల్యుచెవ్‌స్కోయ్' అగ్నిపర్వతం

టోక్యో, జూలై 30: రష్యా తూర్పు కొసన ఉన్న కమ్చాట్కా ద్వీపకల్పం సమీపంలో సముద్రంలో భారీ భూకంపం వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఏకంగా 8.8 మ్యాగ్నిట్యూడ్‌తో భూకంపం వచ్చింది. దీనితో కమ్చాట్కా ద్వీపకల్పం ఊగిపోయింది. చుట్టూ వందల కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకూ ఈ ప్రకంపనలు విస్తరించాయి. దీనికితోడు 6, 7 తీవ్రతతో వచ్చిన మరికొన్ని ప్రకంపనలు.. పసిఫిక్ తీర ప్రాంత దేశాల్లో సునామీ భయాన్ని రేకెత్తించాయి. 20 ఏళ్ల కింద హిందూ మహా సముద్రంలో, 14 ఏళ్ల కింద జపాన్ సమీపంలో భూకంపాలతో వచ్చిన భారీ సునామీల వంటివి రావొచ్చనే కలకలం చెలరేగింది. దీనితో భూకంప ప్రాంతానికి సమీపంలోని దేశాలు.. ప్రజలను తీర ప్రాంతాల నుంచి దూరంగా తరలించాయి. కానీ రష్యా తూర్పు తీరంలో నాలుగు మీటర్ల ఎత్తున, జపాన్, అమెరికాలోని హవాయ్, అలాస్కా, పశ్చిమ తీర ప్రాంతాల్లో, ఫిలిప్పీన్స్‌లలో మీటరు ఎత్తున చిన్నపాటి సునామీ అలలు మాత్రమే వచ్చాయి. సముద్ర తీరంలోని నిర్మాణాలు స్వల్పంగా దెబ్బతినడం, బోట్లు కొట్టుకుపోవడం వంటి నష్టం జరిగింది. దీనితో సునామీ హెచ్చరికలను వెనక్కి తీసుకున్నారు. తీర ప్రాంతాల్లో ముందస్తుగా హెచ్చరికలు జారీ చేయడంతో ఎక్కడా ప్రాణనష్టం జరగలేదు. రష్యా, జపాన్ మాత్రం పదుల సంఖ్యలో జనం గాయపడినట్టు ప్రకటించాయి. అయితే మళ్లీ భూకంపం వచ్చే అవకాశం ఉందన్న నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో.. పసిఫిక్ తీర ప్రాంత దేశాలు అప్రమత్తంగా ఉండాలన్న సూచనలు వెలువడ్డాయి. మరోవైపు రష్యాలో ప్రస్తుత భూకంప ప్రాంతానికి సుమారు 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న 'క్ల్యుచెవ్‌స్కోయ్' అగ్నిపర్వతం బుధవారం సాయంత్రం బద్దలైంది. ఈ అగ్నిపర్వతం భారీ పేలుళ్లతో లావాను వెదజల్లుతోందని రష్యా భూతత్వ పరిశోధన సంస్థ ప్రకటించింది. ఇక రష్యాలో భారీ భూకంపం వచ్చిన కొన్ని గంటల్లోనే టిబెట్‌లో హిమాలయ పర్వతాలకు సమీపంలో 4.3 తీవ్రతతో భూకంపం వచ్చింది.

అంత భారీ భూకంపం అయినా..

2011 మార్చిలో జపాన్‌ను వణికించిన, ఫుకుషిమా అణు విద్యుత్ ప్లాంట్ ప్రమాదానికి గురైన భూకంపం (9.1 తీవ్రత) తర్వాత.. ప్రస్తుతం కమ్చాట్కా ద్వీపకల్పంలో వచ్చిన భూకంపమే అతి పెద్దది కావడం గమనార్హం. అంతకుముందు 1960లో చిలీలోని బయోబియోలోట 9.5 తీవ్రతతో, 1964లో అమెరికాలోని అలాస్కాలో 9.2 తీవ్రతతో భూకంపాలు వచ్చాయి. 2004లో ఇండోనేషియా సమీపంలో హిందూ మహా సముద్రంలో 9.1 తీవ్రతతో వచ్చిన భూకంపం.. అతి భారీ సునామీకి కారణమై, భారత్ సహా దక్షిణ, ఆగ్నేయాసియా దేశాల్లో రెండున్నర లక్షల మంది మృతికి కారణమైంది. కాగా తాజాగా రష్యాలో వచ్చిన భూకంపం జపాన్ మంగా ఆర్టిస్ట్ రియో టట్సుకి కాలజ్ఞానాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. జూలై 5న జపాన్‌లో భారీ భూకంపం వస్తుందని రియో టట్సుకి గతంలో పేర్కొన్న నేపథ్యంలో తీవ్రకలకలం చెలరేగింది. ఆమె చెప్పిన భూకంపం ఇదేననే వాదనలు వినిపిస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.